

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 5-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 141 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి తె.3.13 తదుపరి చతుర్దశి; నక్షత్రం: శ్రవణం రా.11.38 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: తె.3.31-5.04; దుర్ముహూర్తం: ఉ.8.32-9.21, మ.12.38-1.27; అమృతఘడియలు: మ.1.16-2.52; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.22





ఈ ఏడాది అమ్మకాల్లో 7% వృద్ధి

చిన్న కార్ల అమ్మకాలు పుంజుకునే అవకాశం

ఆటోమొబైల్ పరిశ్రమ అంచనా

న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణతో దేశంలో కార్ల మార్కెట్ వృద్ధి రేటు మళ్లీ గాడిలో పడుతుందని ఆటోమొబైల్ పరిశ్రమ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అమ్మకాల వృద్ధి రేటు గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 1 నుంచి 2 శాతానికి మించి ఉండకపోవచ్చని నిన్న మొన్నటి వరకు పరిశ్రమ వర్గాలు అంచనా వేశాయి. జీఎస్‌టీ మండలి తాజా నిర్ణయంతో ఎంట్రీ లెవల్ కార్లపై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గనుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ అమ్మకాల వృద్ధి రేటు 7 శాతం వరకు ఉండే అవకాశం ఉందని మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) చైర్మన్ ఆర్‌సీ భార్గవ చెప్పారు. పండగల సీజన్ నుంచే ఈ తగ్గింపు అమల్లోకి రావడం మరింత శుభ పరిణామమన్నారు. ఈ నిర్ణయంతో దేశంలో ఎంట్రీ లెవల్ కార్ల ధరలూ 8.5 నుంచి 9 శాతం (రూ.45,000 నుంచి రూ.50,000) తగ్గి వాటి అమ్మకాలూ మరింత పుంజుకునే అవకాశం ఉందన్నారు. కొన్ని ఎంట్రీలెవల్ మోడల్ కార్ల ధర అయితే రూ.లక్ష వరకు కూడా తగ్గే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ షురూ

సీబీఐసీ చీఫ్ సంజయ్

మారిన జీఎస్‌టీ రేట్లకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ ప్రక్రియ ఊపందుకుంది. కొత్త జీఎస్‌టీ రేట్లు అమల్లోకి వచ్చే ఈ నెల 22వ తేదీ లోపే ఈ ప్రక్రియ పూర్తవుతుందనే నమ్మకం ఉందని కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) చైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ చెప్పారు. ఇందుకోసం కంపెనీలతోనూ చర్చిస్తున్నట్టు తెలిపారు. సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేస్తేనే కొత్త జీఎస్‌టీ రేట్ల అమలు సాఫీగా జరుగుతుందన్నారు. అప్పుడు కంపెనీలు కూడా తమ రిటర్న్‌లను సాఫీగా అప్‌లోడ్ చేయగలుగుతాయని అగర్వాల్ చెప్పారు.

సిమెంట్ ధర రూ.30 వరకు తగ్గే చాన్స్

సిమెంట్‌పై ఉన్న 28 శాతం జీఎస్‌టీని 18 శాతానికి తగ్గించడంపై సిమెంట్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. దీనివల్ల ధరలు తగ్గి మౌలిక సదుపాయాల రంగం ఊపందుకుంటుందని సిమెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (సీఎంఏ) తెలిపింది. దీంతో 50 కిలోల బస్తా సిమెంట్ ధర రూ.25 నుంచి రూ.30 వరకు తగ్గవచ్చని జేఎం ఫైనాన్సియల్ ఇనిస్టిట్యూషనల్ సెక్యూరిటీస్ సంస్థ అంచనా. కాగా ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో హోల్‌సేల్ మార్కెట్లో బస్తా సిమెంట్ ధర రూ.370 నుంచి రూ.385 వరకు ఉంది. జీఎస్‌టీ తగ్గింపుతో ఇది రూ.15 నుంచి రూ.20 వరకు తగ్గే అవకాశం ఉందని హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఒక సిమెంట్ కంపెనీ ఉన్నతాధికారి 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో చెప్పారు.

జీఎస్‌టీ తగ్గింపు సరైన చర్య



డెయిరీ ఉత్పత్తులపై జీఎస్‌టీ తగ్గింపు సకాలంలో తీసుకున్న సరైన చర్య. సగటు గృహస్థులు అధికంగా వినియోగించే పన్నీర్‌ను జీఎస్‌టీ శ్లాబ్‌లోకి తేవడం, నెయ్యి, వెన్న, చీజ్‌పై రేటును 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం వల్ల వారికి ఎంతో ఊరట కల్పిస్తుంది. అత్యధిక నాణ్యత గల, బ్రాండెడ్ ఉత్పత్తులు.. అవ్యవస్థీకృత రంగ ఉత్పత్తులతో దీటుగా పోటీ పడే అవకాశం ఏర్పడుతుంది. ఈ తగ్గింపు ప్రయోజనాన్ని మేం పూర్తిగా వినియోగదారులకే పంచాలని భావిస్తున్నాం. రేట్ల పరివర్తన ప్రక్రియ సరళంగా సాగేందుకు భాగస్వాములు, పంపిణీదారులతో కలిసి మేం పని చేస్తున్నాం. పెరగనున్న డిమాండ్‌కు దీటుగా ఉత్పత్తి సామర్థ్యాలు పెంచేందుకు మేం ఎదురుచూస్తున్నాం.

- నారా భువనేశ్వరి, వైస్ చైర్‌పర్సన్, ఎండీ, హెరిటేజ్ ఫుడ్స్



ఫెడ్‌పై ట్రంప్ పెత్తనం పెరిగితే

5,000 డాలర్లకు ఔన్స్ బంగారం?

గోల్డ్‌మన్ శాక్స్ అంచనా

దేశీయ మార్కెట్లో 10 గ్రాముల పసిడి రూ.1.50 లక్షలకు చేరువయ్యే చాన్స్!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అంతర్జాతీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు వేగంగా పరుగు తీస్తున్నాయి. న్యూయార్క్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి తొలిసారిగా 3,600 డాలర్లు అధిగమించింది. బుధవారం ట్రేడింగ్‌లో 3,638 డాలర్ల స్థాయి వద్ద సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయిని నమోదు చేసింది. సిల్వర్ సైతం 41 డాలర్ల ఎగువకు చేరింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలహీనపడుతుండటం, ఆ దేశ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో నిర్వహించనున్న పరపతి సమీక్షలో ప్రామాణిక వడ్డీ రేట్లను మరో 0.25 శాతం తగ్గించవచ్చన్న అంచనాలు విలువైన లోహాలకు డిమాండ్ పెంచుతున్నాయి. అలాగే, ఫెడ్ రిజర్వ్ స్వయంప్రతిపత్తికి విఘాతం కలిగించేలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు బులియన్ ర్యాలీకి మరో ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు. అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ అనిశ్చితులు, ట్రంప్ టారిఫ్‌లు, ఫెడ్ రేట్ల కోతలతో ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఔన్స్ బంగారం రేటు 35 శాతం పెరిగింది. ఫెడ్‌పై ట్రంప్ పెత్తనం బంగారం ధరలను ముున్ముందు మరింత ఎగదోయవచ్చని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఫెడ్ స్వయంప్రతిపత్తికి ప్రమాదం ఏర్పడితే, వచ్చే ఏడాది ప్రథమార్థం చివరినాటికి ఔన్స్ గోల్డ్ 4,000 డాలర్ల నుంచి 5,000 డాలర్ల వరకు ఎగబాకే అవకాశాలున్నాయని అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ తాజా నివేదికలో అంచనా వేసింది. ఎందుకంటే, ఆర్థిక వృద్ధికి దోహదపడేలా వడ్డీ రేట్లను తగ్గించాలని ఫెడ్ రిజర్వ్‌పై ట్రంప్ ఒత్తిడి తెస్తున్నారు. తన డిమాండ్‌ను ఖాతరు చేయకపోవడంతో ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్‌పైను పదవి నుంచి తొలగించేస్తానని బెదిరించాడు కూడా. ఈ మధ్యనే ఫెడ్ గవర్నర్ లీసా కుక్‌ను తొలగించేందుకు ట్రంప్ చేసిన ప్రయత్నం అమెరికా సెంట్రల్ బ్యాంక్ స్వయం ప్రతిపత్తిని మరింత ప్రమాదంలోకి నెట్టింది.

ఫెడ్‌పై ప్రభుత్వ పెత్తనం పెరిగితే, ఒత్తిడి చేసినప్పుడల్లా వడ్డీ రేట్లు తగ్గించాల్సిన పరిస్థితి వస్తుందని.. తత్ఫలితంగా దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణ (ధరల) నియంత్రణ లక్ష్యాలకు విఘాతం కలగవచ్చని, అమెరికా కరెన్సీ విలువ కూడా తగ్గి ట్రెజరీ బిల్లులు, బాండ్లు వంటి డాలర్ ఆధారిత ఆర్థిక సాధనాల నుంచి పెట్టుబడులు గోల్డ్, సిల్వర్‌లోకి మళ్లే ప్రమాదం ఉందని గోల్డ్‌మన్ శాక్స్ పేర్కొంది. ఉదాహరణకు యూఎస్ ట్రెజరీ మార్కెట్లోని ప్రైవేట్ వర్గాల పెట్టుబడుల్లో ఒక శాతం బులియన్‌లోకి మళ్లినా గోల్డ్ దాదాపు 5,000 డాలర్ల వరకు ఎగబాకవచ్చని హెచ్చరించింది. అదేగనుక జరిగితే, భారత్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరువ కావచ్చని బులియన్ ట్రేడర్లు భావిస్తున్నారు.

- ఎనిమిది రోజుల గోల్డ్ ర్యాలీకి తెరపడింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,000 తగ్గి రూ.1,06,070కి దిగివచ్చింది. బులియన్ ట్రేడర్లు లాభాల స్వీకరించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో బలహీన ట్రెండ్ ఇందుకు కారణం. కిలో వెండి సైతం రూ.500 తగ్గి రూ.1,25,600కి పరిమితమైంది.



వెండి ఆభరణాలకు హాల్‌మార్కింగ్

ఈ నెల 1 నుంచే అమల్లోకి..

ప్రస్తుతానికి ఐచ్ఛికమే..

వెండి ఆభరణాలు, వస్తువులకు హాల్‌మార్కింగ్‌ను ప్రవేశపెట్టినట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం వెల్లడించింది. ఈ నెల 1 నుంచే ఇది అమలులోకి వస్తుందని, ప్రస్తుతానికిది స్వచ్ఛందమని స్పష్టం చేసింది. వెండి నగలు లేదా వస్తువుల్లో లోహ స్వచ్ఛత నిర్ధారణకు ఈ డిజిటల్ గుర్తింపు విధానం దోహదపడనుంది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) తన హాల్‌మార్కింగ్ ప్రమాణాలను సవరించింది. గత వెర్షన్ ఐఎస్ 2112:2014ను ఐఎస్ 2112:2025తో భర్తీ చేసింది. ఈ సవరణ ద్వారా ప్రస్తుత బంగారం హాల్‌మార్కింగ్ వ్యవస్థకు అనుసంధానిస్తూ వెండి ఆభరణాలు, వస్తువులకు సైతం హాల్‌మార్కింగ్ వినూత్న గుర్తింపు (హెచ్‌యూఐడీ) ఆధారిత హాల్‌మార్కింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ కొత్త వ్యవస్థ ద్వారా 2025 సెప్టెంబరు 1 నుంచి వినియోగదారులు హాల్‌మార్కింగ్ చేసిన వెండి ఆభరణం లేదా వస్తువు టైపు, లోహం స్వచ్ఛత, హాల్‌మార్కింగ్ తేదీ, టెస్టింగ్ సెంటర్ వివరాలతో పాటు దాన్ని హాల్‌మార్కింగ్ చేయించిన జువెలర్ రిజిస్ట్రేషన్ నంబరును తెలుసుకోగలుగుతారు. బీఐఎస్ కేర్ మొబైల్ యాప్ ద్వారా ఈ సమాచారాన్ని పొందవచ్చు. మరిన్ని వివరాలు..

- సవరించిన ప్రమాణాల ద్వారా బీఐఎస్ ఏడు లోహ స్వచ్ఛత గ్రేడ్‌లను (800, 835, 925, 958, 970, 990, 999) ప్రవేశపెట్టింది. అందులో 958, 999 గ్రేడ్‌లు కొత్తగా ప్రవేశపెట్టినవి.
- వెండి హాల్‌మార్కింగ్‌లో మొత్తం మూడు భాగాలుంటాయి. ఒకటి సిల్వర్ అనే పదంతో కూడిన బీఐఎస్ స్టాండర్డ్ మార్క్. రెండోది లోహ స్వచ్ఛత గ్రేడ్, మూడోది హెచ్‌యూఐడీ కోడ్.
- వెండి ఆభరణాల టెస్టింగ్ కోసం దేశంలోని 87 జిల్లాల్లో బీఐఎస్ గుర్తింపు పొందిన 230 పరీక్ష, హాల్‌మార్కింగ్ కేంద్రాలు ఉన్నాయి.
- గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో 32 లక్షలకు పైగా వెండి ఆభరణాలకు హాల్‌మార్కింగ్ చేసారు.

ఆరంభ ఉత్సాహం ఆవిరి

- జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో ప్రారంభంలో సెన్సెక్స్ 889 పాయింట్లు అప్
- చివరికి స్వల్ప లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబై: జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం ట్రేడింగ్ ఆరంభంలో భారీగా పుంజుకున్నాయి. సెన్సెక్స్ 888.96 పాయింట్ల లాభంతో 81,456.67 ట్రేడింగ్ ప్రారంభించింది. సూచీకిదే ఇంట్రాడే గరిష్ఠ స్థాయి కూడా. జీఎస్‌టీ తగ్గింపుతో అధికంగా లబ్ధి పొందనున్న ఆటోమొబైల్, ఎఫ్ఎంసీజీ, సిమెంట్, ఇన్సూరెన్స్ రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. అయితే, ఆరంభంలోని ఉత్సాహం క్రమంగా నీరుగారుతూ వచ్చింది. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ సహా ఇతర రంగాల షేర్లలోనూ లాభాల స్వీకరణ కారణంగా క్రమంగా తగ్గుతూ వచ్చిన సూచీలు చివరికి స్వల్ప లాభాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సెన్సెక్స్ కేవలం 150.30 పాయింట్ల వృద్ధితో 80,718.01 వద్ద ముగిసింది. ఇంట్రాడే గరిష్ఠ స్థాయితో పోలిస్తే, సూచీ 738 పాయింట్లు తగ్గింది. మరోవైపు ఆరంభంలో 25,000 స్థాయికి చేరువైన నిఫ్టీ.. చివరికి 19.25 పాయింట్ల లాభంతో 24,734.30 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 11 మాత్రమే రాణించాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

5 తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	545
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	90
కర్నూలు	98	నెల్లూరు	95
విశాఖపట్నం	131	అనంతపురం	95
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,06,860 ▼	97,950 ▼	1,37,000 ▲
విజయవాడ	1,09,300 ▲	1,03,500 ▲	1,27,500 ▲
విశాఖపట్నం	1,09,470 ▲	98,050 ▲	1,37,000 ▲
రాజమండ్రి	1,06,850 ▼	97,950 ▼	1,26,600 ▲
ప్రొద్దుటూరు	1,08,100 ▲	99,450 ▲	1,26,500 ▲
ముంబై	1,05,945 ▼	97,046 ▼	1,23,207 ▼

స్పోర్ట్స్



స్వియటెక్

స్వియటెక్‌కు షాక్

యూఎస్ ఓపెన్

బదులు తీర్చుకొన్న అమండా ● సెమీస్‌కు ఒసాక, సినర్, ఫెలిక్స్



అనిసిమోవా

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పోలెండ్ భామ ఇగా స్వియటెక్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. వరుస విజయాలతో జోరుమీదున్న రెండో సీడ్ స్వియటెక్‌కు క్వార్టర్స్‌లో లోకల్ స్టార్ అమండా అనిసిమోవా ఝలక్ ఇచ్చింది. కాగా, పనైపోయిందనుకొన్న మాజీ చాంపియన్ నవోమి ఒసాక మరో సంచలన విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లింది. పురుషుల డిఫెండింగ్ చాంప్ యానిక్ సినర్ కూడా ఫైనల్-4లోకి అడుగుపెట్టాడు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఎనిమిదో సీడ్ అనిసిమోవా 6-4, 6-3తో స్వియటెక్‌ను వరుస సెట్లలో ఓడించింది. ఈ క్రమంలో వింబుల్డన్ ఫైనల్లో తనను చిత్తుగా ఓడించిన పోలెండ్ బ్యూటీపై అనిసిమోవా గట్టిగా బదులు తీర్చుకొంది. మూడో సీడ్ కొకొ గాఫ్‌ను ఓడించిన జపాన్ ప్లేయర్ ఒసాక అదే జోరును కొనసాగించింది. 23వ సీడ్ ఒసాక 6-4, 7-6(3)తో 11వ సీడ్ కరోలినా ముచోవా (చెక్)పై గెలిచింది. శుక్రవారం జరిగే సెమీఫైనల్స్‌లో టాప్ సీడ్ సబలెంకాతో జెస్సికా పెగుల, అనిసిమోవాతో ఒసాక తలపడనున్నారు.

సినర్ అలవోకగా..: డిఫెండింగ్ చాంప్ సినర్ అలవోక విజయంతో ముందంజ వేశాడు. ఇద్దరు ఇటలీ ఆటగాళ్ల మధ్య జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో సినర్ 6-1, 6-4, 6-2తో 10వ సీడ్ లొరెంజో ముసెట్టిపై వరుస సెట్లలో నెగ్గాడు. మరో మ్యాచ్‌లో 25వ సీడ్ ఫెలిక్స్ అగర్ అలియస్సిమి (స్పెయిన్) 4-6, 7-6(7), 7-5, 7-6(4)తో 8వ సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)పై పోరాడి గెలిచి కెరీర్‌లో రెండోసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌కు చేరుకొన్నాడు. శనివారం జరిగే సెమీఫైనల్స్‌లో అల్కారజ్‌తో జొకోవిచ్, సినర్‌తో ఫెలిక్స్ అమీతుమీ తేల్చుకోనున్నారు.


పురుషుల సింగిల్స్ సెమీస్
నేటి రాత్రి 12.30 నుంచి
జొకోవిచ్ x అల్కారజ్
సినర్ x ఫెలిక్స్
(శనివారం తెల్లవారుజామున 4.30 నుంచి)

సెమీస్‌లో భాంబ్రి జోడీ



భారత ఆటగాడు యుకీ భాంబ్రి కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌కు చేరుకొన్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో ఇండో-కివీస్ జంట భాంబ్రి-మైకేల్ వీనస్ 6-3, 6-7(6), 6-3తో క్రొయేషియా-అమెరికా ద్వయం నికోలా మెక్టిక్-రాజీవ్ రామ్‌పై గెలిచింది.

క్రికెట్‌కు అమిత్ మిశ్రా గుడ్‌బై



న్యూఢిల్లీ: భారత వెటరన్ స్పిన్నర్ అమిత్ మిశ్రా (42) క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 25 ఏళ్ల కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు మిశ్రా గురువారం సోషల్ మీడియాలో తెలిపాడు. హరియాణాకు చెందిన మిశ్రా చివరిసారిగా 2017లో బెంగళూరులో ఇంగ్లండ్‌తో టీ20 మ్యాచ్ ఆడాడు. 2024దాకా ఐపీఎల్‌లో ఆడిన మిశ్రా ఇకపై అన్ని ఫార్మాట్లకు గుడ్‌బై చెబుతున్నట్టు తెలిపాడు. 2003లో ఢాకాలో సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో మిశ్రా వన్డేల్లో అరంగేట్రం చేశాడు. 2008లో ఆస్ట్రేలియాతో ఆడిన తన తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో సత్తాచాటాడు. 2010లో జింబాబ్వేతో మ్యాచ్‌తో టీ20ల్లోకి అడుగుపెట్టాడు. భారత్ తరపున 22 టెస్టులు, 36 వన్డేలు, 10 టీ20లలో ప్రాతినిథ్యం వహించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 156, ఐపీఎల్‌లో 166 వికెట్లు సాధించాడు.

ధవన్‌ను విచారించిన ఈడీ



న్యూఢిల్లీ: బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసినందుకు భారత క్రికెట్ జట్టు మాజీ ఓపెనర్ శిఖర్ ధవన్ చిక్కుల్లో పడ్డాడు. గురువారం అతడిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) 8 గంటల పాటు విచారించింది. గతంలో ధవన్ 1xBETఅనే యాప్‌కు ప్రచారం చేశాడు. దీనికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు రావాలని ఇప్పటికే ఈ మాజీ ఆటగాడికి నోటీసులు పంపారు.

రుతురాజ్ భారీ శతకం



బెంగళూరు: రుతురాజ్ గైక్వాడ్ (184) శతక సహాయంతో వెస్ట్ జోన్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. దులీప్ ట్రోఫీలో భాగంగా సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న ఈ సెమీస్‌లో.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి వెస్ట్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 363/6 స్కోరుతో నిలిచింది. నార్త్ జోన్‌తో జరుగుతున్న మరో సెమీస్‌లో సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 297/3 స్కోరు సాధించింది. ఓపెనర్ ఎన్.జగదీశన్ (148 బ్యాటింగ్) అజేయ శతకంతో నిలిచాడు.

భారత్ జోరు

- మలేసియాపై గెలుపు
- ఆసియా కప్ హాకీ



రాజ్‌గిర్ (బిహార్): ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు జోరు కొనసాగిస్తోంది. అపజయమెరుగని రికార్డును నిలబెట్టుకుంది. సూపర్-4లో తొలి విజయం అందుకుంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 4-1తో మలేసియాను చిత్తు చేసింది. మన్‌ప్రీత్ సింగ్ (17), సుఖ్‌జీత్ సింగ్ (19), షీలానంద్ లక్రా (24), వివేక్ సాగర్ ప్రసాద్ (38) భారత్ తరపున గోల్స్ చేశారు. మలేసియాకు ఏకైక గోల్‌ను హసన్ షఫీక్ (1) అందించాడు. బుధవారం జరిగిన సూపర్-4 తొలి మ్యాచ్‌లో కొరియాతో మనోళ్లు డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే. రెండో మ్యాచ్ గెలుపుతో లభించిన రెండు పాయింట్లతో కలిపి.. మొత్తం మూడు పాయింట్లతో సూపర్-4 పట్టికలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. శనివారం జరిగే ఆఖరి పోరులో చైనాతో భారత్ తలపడనుంది. ఆ మ్యాచ్‌ను డ్రా చేసుకుంటే మనోళ్లకు ఫైనల్ బెర్త్ ఖాయమవుతుంది. ఇక.గురువారం జరిగిన మరో సూపర్-4 మ్యాచ్‌లో చైనా 3-0తో డిఫెండింగ్ చాంపియన్ కొరియాకు షాకిచ్చింది.

విజయంతో ఆరంభించాలని..

- థాయ్‌లాండ్‌తో భారత్ తొలిమ్యాచ్
- నేటి నుంచి మహిళల ఆసియా కప్ హాకీ



హంగ్‌ఝూ (చైనా): ఇటీవలి కాలంలో ఓటములతో డీలాపడ్డ భారత మహిళల హాకీ జట్టు శుక్రవారం నుంచి జరిగే ఆసియా కప్‌ను విజయంతో ఆరంభించాలనుకొంటోంది. పూల్-బిలో థాయ్‌లాండ్‌తో జరిగే తమ తొలి మ్యాచ్‌లో వరల్డ్ నెం:9 భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. జపాన్, సింగపూర్ కూడా ఇదే గ్రూప్‌లో ఉన్నాయి. పూల్-ఎలో చైనా, కొరియా, మలేసియా, చైనీస్ తైపీ జట్లున్నాయి. ఈ నెల 14న ఫైనల్ జరుగుతుంది. వచ్చే ఏడాది బెల్జియంలో జరిగే వరల్డ్ కప్‌నకు క్వాలిఫయింగ్ టోర్నీ కావడంతో ప్రతి జట్టుకూ ఇది కీలకంగా మారింది. వెటరన్ గోల్ కీపర్ సవిత, ఏస్ డ్రాగ్ ఫ్లికర్ దీపిక గాయాలతో టోర్నీకి దూరం కావడం భారత్‌కు దెబ్బగానే పరిగణించాలి. వీరి గైర్హాజరీలో కెప్టెన్ సలీమా టెటె, నవ్‌నీత్ కౌర్, ఉదిత, షర్మిలా దేవి, లాల్‌రిమ్సియామి జట్టు బాధ్యత తీసుకోవాల్సి ఉంది. భారత జట్టు 2004, 2017లో ఆసియా కప్ విజేతగా నిలిచింది.

తెలుగు టైటాన్స్ తొలి గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్-12లో ఆతిథ్య తెలుగు టైటాన్స్‌కు తొలి విజయం దక్కింది. ఇక్కడి పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 37-32 స్కోరుతో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. తొలి రెండు మ్యాచ్‌ల ఓటమితో పాఠాలు నేర్చుకున్న టైటాన్స్.. ఈ మ్యాచ్‌లో వ్యూహాత్మకంగా ఆడింది. ఆట ప్రారంభం నుంచే టైటాన్స్ ఆటగాళ్లు ఆధిపత్యం ప్రదర్శించారు. దీంతో ప్రథమార్ధం 16-09 స్కోరుతో ముగిసింది. ద్వితీయార్ధంలో ఒక్కసారిగా పుంజుకున్న పాంథర్స్ వరుస పాయింట్లు రాబట్టి టైటాన్స్‌ను ఆలౌట్ చేసే ప్రయత్నం చేసింది. చివరి నిమిషాల్లో టైటాన్స్ సూపర్ రైడ్స్‌తో పాయింట్లు రాబట్టి సురక్షిత స్థాయికి చేరింది. టైటాన్స్‌లో కెప్టెన్ విజయ్, భరత్ చెరో 8 పాయింట్లు...చేతన్, అజిత్ పవార్ చెరో ఐదు పాయింట్లు రాబట్టి విజయంలో కీలకపాత్ర వహించారు. పింక్ పాంథర్స్ జట్టులో రైడర్ నితిన్ కుమార్ అత్యధికంగా 13 పాయింట్లు సాధించాడు.

టీటీ జట్టులో శ్రీజ, స్నేహిత్

ఆసియా టీమ్ చాంపియన్‌షిప్స్



న్యూఢిల్లీ: ఆసియా టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొనే భారత పురుషుల, మహిళల జట్లను గురువారం ప్రకటించారు. తెలంగాణకు చెందిన ఆకుల శ్రీజ, ఆర్. స్నేహిత్‌లకు జట్లలో చోటు లభించింది. ఈ చాంపియన్‌షిప్స్ వచ్చేనెల 11 నుంచి 15 వరకు భువనేశ్వర్‌లో జరగనుంది.

గుకేష్‌కు గెలుపు

గ్రాండ్ స్విస్

సమర్‌ఖండ్ (ఉజ్బెకిస్థాన్): ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీని వరల్డ్ చాంపియన్ గుకేష్ విజయంతో ఆరంభించగా.. అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద తమ గేమ్‌లను డ్రా చేసుకొన్నారు. గురువారం జరిగిన తొలి రౌండ్‌లో ఫ్రెంచ్ జీఎం ఎటెన్ని బాక్రోట్‌పై గుకేష్ 45 ఎత్తుల్లో గెలిచాడు. స్పెయిన్ జీఎం మాక్సిమ్ చికాగ్‌తో గేమ్‌ను అర్జున్, జెఫ్రీ జియాంగ్ (అమెరికా)తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకొన్నారు. కాగా మహిళల విభాగంలో మార్సెల్‌తో గేమ్‌ను ద్రోణవల్లి హారిక డ్రా చేసుకుంది.

పవన్, సాక్షి శుభారంభం

లివర్‌పూల్ (ఇంగ్లండ్): వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్లు పవన్ బర్త్వల్, సాక్షి చౌధరి శుభారంభం చేశారు. మొదటి రౌండ్‌లో సాక్షి (54కి.)-షూయెల్ (ఉక్రెయిన్)పై, పవన్ (55కి.)-డగ్లస్ (బ్రెజిల్)పై నెగ్గారు. హితేశ్ (77కి.), అభినాష్ (65కి.), లవ్లీనా బోర్గొహైన్ (మహిళల 75 కి.)లకు మొదటి రౌండ్‌లో బై లభించింది. ఇక నిఖత్‌జరీన్ (51కి.) తొలి రౌండ్‌లో లొజానా (అమెరికా)తో ఆడనుంది.

మూడో స్థానం పోరులో భారత్

కాఫా నేషన్స్ కప్

హిసోర్ (తజికిస్థాన్): కాఫా నేషన్స్ కప్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు మూడో స్థానం కోసం పోటీ పడనుంది. గురువారం అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌ను 0-0తో డ్రాగా ముగించింది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే నేరుగా ప్లేఆఫ్స్‌కు వెళ్లేది. దీంతో ఇరాన్-తజికిస్థాన్ మ్యాచ్ ఫలితంపై ఆధారపడాల్సి వచ్చింది. ఈ మ్యాచ్ 2-2తో డ్రా కావడంతో భారత్ ఊపిరిపీల్చుకుంది.

శ్రేయా పాటతో..మహిళల వన్డే వరల్డ్‌కప్ షురూ

గువాహటి: మహిళల వన్డే వరల్డ్‌కప్ ఆరంభ వేడుకల్లో ప్రఖ్యాత గాయని శ్రేయా ఘోషాల్ తన గాన మాధుర్యంతో అలరించనుంది. ఈనెల 30న ఈ మెగా టోర్నీ ఆరంభం కానుంది. అదే రోజు గువాహటిలో జరిగే భారత్-శ్రీలంక జట్ల మధ్య మ్యాచ్‌కు ముందు టోర్నీ అధికారిక గీతం 'బ్రింగ్ ఇట్ హోమ్'ను శ్రేయా ఆలపించనుంది. మరోవైపు భారత్‌లో జరిగే అన్ని మ్యాచ్‌ల టిక్కెట్ల కనీస ధరలను కేవలం రూ.100కే విక్రయించనున్నట్టు ఐసీసీ ప్రకటించింది. గురువారం నుంచే ఆన్‌లైన్‌లో టిక్కెట్ల అమ్మకాలు కూడా ఆరంభమయ్యాయి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కేంద్రమంత్రుల్లో 40% మందిపై
క్రిమినల్ కేసులు
రాష్ట్రాల్లో 47% మందిపై నేరాభియోగాలు
కొందరిపై హత్య, హత్యాయత్నం, అపహరణ వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
బిలియనీర్ మంత్రుల జాబితా టాప్ టెన్‌లో ఆరుగురు తెలుగువాళ్లే
ఏడీఆర్ నివేదికలో వెల్లడి
10

శుక్రవారం | 5-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 141 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి తె.3.13 తదుపరి చతుర్దశి; నక్షత్రం: శ్రవణం రా.11.38 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: తె.3.31-5.04; దుర్ముహూర్తం: ఉ.8.32-9.21, మ.12.38-1.27; అమృతఘడియలు: మ.1.16-2.52; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.22 | హైదరాబాద్ సిటీ*
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జీఎస్టీ 2.0తో డబుల్ డోస్ అభివృద్ధి

పేదలకు మేలు చేసేలా సంస్కరణలు: మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ 2.0గా పేర్కొంటున్న సంస్కరణలు దేశాభివృద్ధికి డబుల్ డోస్‌గా నిలుస్తాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. భారత్‌లో నూతన శకానికి దోహదపడేలా ఈ సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. గురువారం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో సమావేశంలో మాట్లాడిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీలో సంస్కరణల ద్వారా భారత ఆర్థికరంగానికి పంచరత్నాలను జమ చేశామన్నారు. జీఎస్టీలో పలు శ్లాబ్‌లను హేతుబద్ధీకరిస్తూ నిర్ణయించిన 5శాతం, 18 శాతం శ్లాబ్‌లు ఈ నెల 22న మహా నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కాలానుగుణంగా మార్పులను

మిగతా 11వ పేజీలో...

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాన్ని వినియోగదార్లకు అందించండి

పరిశ్రమలకు కేంద్ర మంత్రి పీయూష్ పిలుపు 10
దేశంలో ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని వెల్లడి


కౌంట్‌డౌన్..

జీఎస్టీ కొత్త పన్ను రేట్లు అమల్లోకి వచ్చే 22వ తేదీపై అందరి దృష్టి

- టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లపై రూ. 1,500 నుంచి 45 వేల వరకు తగ్గే చాన్స్
- 13 శాతం వరకు తగ్గనున్న ఐస్‌క్రీమ్ ధరలు
- ద్విచక్ర వాహనాలపై 25 వేల వరకు మిగులు
- జిమ్‌లు, సెలూన్లపై పన్ను 5 శాతానికి తగ్గింపు
- రూ. 100లోపు సినిమా టికెట్లపై తగ్గిన పన్ను
- స్విగ్గీ, జొమాటో ఫుడ్ డెలివరీ కాస్త భారం
- ఐపీఎల్ టికెట్లపై 40 శాతం పన్ను మోత
- బిజినెస్, ఫస్ట్ క్లాస్ టికెట్లు మరింత ప్రియం

వినియోగదారుడికి జీఎస్టీ లబ్ధి అందేనా? 11

- పాత, కొత్త సరుకులంటూ వ్యాపారులు కొర్రీలు పెడతారంటూ ప్రజల్లో అనుమానాలు
- సరుకు ఎప్పటిదైనా లాభం ప్రజలకు చేరాల్సిందే
- విక్రయదారులు అక్రమాలకు పాల్పడితే ఫిర్యాదు చేయవచ్చు: జీఎస్టీ కమిషనర్



రాష్ట్ర ఖజానాకు 10 వేల కోట్ల నష్టం!

- ప్రధాన రంగాల్లో తగ్గనున్న జీఎస్టీ రాబడి
- సిమెంటు, ఆటోమొబైల్‌పై 10% పన్ను తగ్గుదల
- గ్రానైట్‌పై తగ్గనున్న 7 శాతం ఆదాయం
- పరిహారం చెల్లించాలని సర్కారు డిమాండ్

12

జీఎస్టీ శ్లాబుల కుదింపు, చాలా రకాల వస్తువుల పన్నుల్లో మార్పుతో లబ్ధి ఎంత? పన్ను తగ్గిన వస్తువుల ధరలు నేరుగా అంత శాతం తగ్గుతాయా? ఇతర అంశాల ప్రభావం ఏమైనా ఉంటుందా? ఏయే వస్తువుల రేట్లు ఎంత వరకు తగ్గుతాయి? టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్ వంటివాటి నుంచి కార్లు, బైకుల దాకా ఏది కొంటే ఎంత ఆదా అవుతుంది? ఎవరెవరికి, ఎలాంటి ప్రయోజనం ఉంటుంది?.. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే చర్చ.. కొత్త పన్ను రేట్లు అమల్లోకి వచ్చే సెప్టెంబరు 22 పైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. కొత్తగా కార్లు, ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రిక్ గృహోపకరణాలు కొనుగోలు చేయాలని భావించే వారంతా ఇప్పుడు కొనేకంటే.. 22వ తేదీ తర్వాత కొంటే ఎంత మిగులుతుందనే అంచనాలు వేసుకుంటున్నారు.

షి'కారు' కోసం కాస్త ఆగండి!

- ఈ నెల 22 నుంచి కొత్త పన్ను రేట్లతో గణనీయంగా తగ్గనున్న కార్ల ధరలు
- రూ.లక్షన్నర దాకా ఆదా.. లైఫ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీల్లోనూ తగ్గుదల
- నిరుటితో పోలిస్తే తగ్గిన కార్ల కొనుగోలు.. పన్ను తగ్గింపుతో పెరిగే అవకాశం
- రూ. 10 లక్షల్లోపు కార్ల విక్రయాలు పెరుగుతాయని అంచనా

11



జీఎస్టీ మండలి భేటీలో హైడ్రామా!

- పన్ను తగ్గింపుపై 4 రాష్ట్రాల అభ్యంతరం
- తమకు పరిహారం ఇవ్వాలని డిమాండ్
- రాత్రి 7 గంటలకే ముగియాల్సిన భేటీ
- రెండు రాష్ట్రాల అభ్యంతరాలతో 9.30 వరకు కొనసాగిన వైనం
- ఓటింగ్‌కు వెళ్దామన్న మరో రాష్ట్ర మంత్రి
- అంగీకరించిన ఆర్థిక మంత్రి నిర్మల
- బెంగాల్ మంత్రి జోక్యంతో సద్దుమణిగిన వివాదం.. ఈ క్రమంలోనే ప్రకటన జాప్యం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: దేశంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చిన ఎనిమిదేళ్ల తర్వాత భారీ సంస్కరణలు తీసుకొచ్చారు. అయితే, బుధవారం ఢిల్లీలో జరిగిన జీఎస్టీ మండలి సమావేశంలో హైడ్రామా చోటుచేసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జీఎస్టీ మండలి భేటీ తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల మీడియాతో మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపు నిర్ణయాన్ని ఏకగ్రీవంగా తీసుకున్నట్లు చెప్పారు. కానీ, జీఎస్టీ తగ్గింపు వల్ల తమకు భారీగా నష్టం వాటిల్లుతుందని ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ విషయంపై బెంగాల్ కాస్త గట్టిగానే నిరసన వ్యక్తం చేసినట్లు

మిగతా 11వ పేజీలో...

ఆదుకుంటాం!

- పంట నష్టపరిహారం అందిస్తాం
- ఇసుక మేటల తొలగింపునకు సాయం చేస్తాం
- కొడంగల్‌తో సమానంగా కామారెడ్డిని అభివృద్ధి చేస్తాం
- కామారెడ్డిలో వరద బాధితులకు సీఎం రేవంత్ రెడ్డి భరోసా
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి
- కేంద్రం నుంచి ఎన్ని వస్తే అన్ని నిధులు రాబట్టుకోవాలని వ్యాఖ్య


లింగంపేట మండలం బుడిగిద్దలో రైతులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కామారెడ్డి, హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని, ఆదుకుంటామని, పంట నష్టపరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. భారీ వరదలతో చాలా మంది రైతుల పంట పొలాల్లో ఇసుక మేటలు వేసిందని, దానిని తొలగించేందుకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. తిరిగి రైతులు వ్యవసాయం చేసుకునేలా ఆ భూములను యథా స్థితికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. భారీ వర్షాలు, వరదలతో కామారెడ్డి జిల్లాలో అపార నష్టం

మిగతా 9వ పేజీలో...

రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ

- 2027 డిసెంబరు తొమ్మిదినాటికి పూర్తి కావాలి.. నిపుణుల సేవలు వాడుకోండి
- గతంలో జరిగిన తప్పులు పునరావృతం కావొద్దు.. సమీక్షలో సీఎం రేవంత్

9



కేసీఆర్‌కు మచ్చ తెచ్చింది కవితే!

- హరీశ్‌రావుపై ఆమెవి నిరాధార ఆరోపణలు
- వాటిని తెలంగాణ సమాజం నమ్మదు
- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావుపై మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలను మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి ఖండించారు. హరీశ్‌రావుపై కవిత నిరాధార ఆరోపణలు చేశారని, ఆయన వల్ల కేసీఆర్‌కు అవినీతి మరక అంటిందనడం విడ్డూరంగా ఉందని అన్నారు. కవితే కేసీఆర్‌కు

మిగతా 10వ పేజీలో...

కవితను బీజేపీలోకి తీసుకోం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు 10

కన్న తండ్రే కాలయముడు

వీడిన ముగ్గురు చిన్నారుల అదృశ్యం మిస్టరీ

- పిల్లలకు పురుగుల మందు తాగించి.. పెట్రోల్ పోసి నిప్పంటించిన తండ్రి
- ముగ్గురు పిల్లల మృతదేహాలు లభ్యం
- పిల్లల్ని చంపి.. వేరేచోట తండ్రి ఆత్మహత్య
- ఇప్పటికే అతని మృతదేహం గుర్తింపు
- నిందితుడిది ఏపీలోని ప్రకాశం జిల్లా
- భార్యతో గొడవ నేపథ్యంలో పిల్లలతో కలిసి బైక్‌పై నాగర్‌కర్నూల్‌కు..


అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వద్ద సీసీ ఫుటేజీలో ముగ్గురు పిల్లలతో తండ్రి వెంకటేశ్వర్లు

నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కన్నబంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ఆ ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి మానవమృగంగా మారి తన ముగ్గురు పిల్లలను పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ముగ్గురు పిల్లలను తనతో బైక్‌పై తీసుకెళ్లిన ఆ తండ్రి రాక్షసుడిగా మారి వారిని మార్గమధ్యంలో పురుగుల మందు తాగించి చంపేసి, దహనం చేశాడు. ఆ తర్వాత అతను ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహం బుధవారమే లభించగా.. ముగ్గురు పిల్లల మృతదేహాలను గురువారం వేర్వేరుచోట్ల కనుగొన్నారు. ఏపీలోని ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు (38) మేన మరదలు దీపికను 12 ఏళ్ల క్రితం వివాహం

మిగతా 9వ పేజీలో...

ఒక ఐఏఎస్ దుర్మార్గం!

- హైదరాబాద్‌లో ఓ మహిళతో ఏపీ ఉన్నతాధికారి వివాహేతర సంబంధం
- ఇటీవల ఆమె మరొకరితో సన్నిహితంగా ఉంటుందని అనుమానం, గొడవలు
- వాగ్వాదంలో ఆమెపై దాడి, మృతి
- కేసు కాకుండా చక్రం తిప్పిన ఐఏఎస్
- ఏమీ ఎరగనట్లు బెజవాడలో విధులు

7

హైదరాబాద్ ఐఐటీకి 7వ స్థానం!

- అత్యుత్తమ ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో సత్తా.. 'ఓవరాల్'లో 12వ ర్యాంకు
- రాష్ట్ర ప్రభుత్వ వర్సిటీల జాబితాలో ఓయూకు ఏడో స్థానం.. 'ఓవరాల్' 53
- ఎన్ఐఆర్ఎఫ్-2025 ర్యాంకింగ్స్ వెల్లడి

12

5 వేల కోట్లు ఇవ్వండి


కేంద్ర మంత్రి అమిత్‌షాకు వినతిపత్రం ఇస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల, జితేందర్‌రెడ్డి

- జాతీయ విపత్తుగా పరిగణించి ఆదుకోండి
- భారీ వర్షాలతో రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లింది
- ప్రాథమిక అంచనా ప్రకారం రూ. 5018.72 కోట్లు
- గత, ప్రస్తుత సాయం 16,732 కోట్లు అందించండి
- ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు ఆర్థికసాయం ఇవ్వండి
- గిరిజన ప్రాంతాలకు నిధులు మంజూరు చేయండి
- కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మల, పెమ్మసానికి డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల విజ్ఞప్తులు
- కేంద్ర బృందాలను రాష్ట్రానికి పంపుతామన్న షా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో భారీ వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లిందని, జాతీయ విపత్తుగా పరిగణించి ఆదుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. పంట, ఆస్తి, ప్రాణనష్టం జరిగిందని, కేంద్రం తక్షణమే సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం వారు ఢిల్లీలో అమిత్ షాను ఆయన అధికారిక నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాలతో ముఖ్యంగా కామారెడ్డి, మెదక్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో

మిగతా 7వ పేజీలో...

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బ్యాంకు ఖాతాలోని 55 కోట్ల జప్తు



బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి

మిగతా 10వ పేజీలో...


మహబూబాబాద్‌లో ఎరువు దుకాణంపై రాళ్లతో దాడి చేస్తున్న రైతులు

ఎరువుల దుకాణంపై రాళ్ల దాడి

- మానుకోటలో రైతుల తిరుగుబాటు
- దుకాణం ముందు నిప్పు
- యూరియా కోసం అన్నదాతల ఆందోళన
- హుస్నాబాద్‌లో పొన్నం ఆఫీసు వద్ద ధర్నా
- పలు జిల్లాల్లో రాస్తారోకోలు
- యూరియాను తరలిస్తున్న లారీ పట్టివేత
- వికారాబాద్ జిల్లాలో ఘటన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం యూరియా బస్తాల కోసం రైతులు కన్నెర్ర చేశారు. ఎరువుల దుకాణం వద్ద బస్తాలు పంపిణీ చేస్తుండగా.. రైతులు ఎగబడగా యాజమాని షాపు మూసివేసి వెళ్లిపోవడంతో ఆగ్రహించిన రైతులు మూసివున్న దుకాణంపై ఇటుకలు, రాళ్లతో దాడి చేశారు. స్థానిక సూర్య థియేటర్ సమీపంలోని మన గ్రోమోర్ సెంటర్‌లో బుధవారం 330 (12 టన్నుల) యూరియా బస్తాలు వచ్చాయి. అయితే దుకాణం యాజమాని కొన్ని బస్తాలే ఇచ్చి రేపు మళ్లీ ఇస్తామని చెప్పి షాపు బంద్ చేసి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం కూడా దుకాణం మూసివేసి వెళ్లిపోవడంతో ఆగ్రహించిన రైతులు దుకాణంపై

మిగతా 12వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సుప్రీం'లో సుంకాల పోరు

మిగతా ప్రపంచంమీద తాను సాగిస్తున్న సుంకాల సమరం అమెరికా ప్రయోజనాల పరిరక్షణకే కాదు, యుద్ధ నివారణకూ, ప్రపంచశాంతికీ కూడా అత్యంత ముఖ్యమని సుప్రీంకోర్టులో ట్రంప్ చెప్పుకున్నారు. దిగుమతులపై సుంకాలు విధించేందుకు ఫెడరల్ చట్టాల ప్రకారం అధ్యక్షుడికి విస్తృతమైన అధికారాలున్నాయని ట్రంప్ ప్రభుత్వం వాదించింది. ఆర్థిక అత్యయిక అధికారాలు వాడి సుంకాలు ప్రయోగించడం చట్ట విరుద్ధమంటూ అప్పీల్స్‌కోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో, ట్రంప్ ప్రభుత్వం అమితవేగంతో సుప్రీంకోర్టును ఆశ్రయించడంతోపాటు, వెంటనే విచారణ ఆరంభించి, తీర్పు త్వరితంగా వెలువడేట్టు చూడాలని కూడా విజ్ఞప్తి చేసుకుంది. ఐదునెలలుగా విదేశాలతో సాగిస్తున్న చర్చలను, సాధించిన విజయాలను దిగువకోర్టు తీర్పు అనిశ్చితిలో పడేస్తుందని ట్రంప్ ప్రభుత్వం హెచ్చరిస్తోంది. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న భారతదేశాన్ని అదనపు సుంకాలతో శిక్షిస్తూ ఉక్రెయిన్‌లో రష్యా చేస్తున్న యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తున్నట్టు సుప్రీంకోర్టులో ట్రంప్ ప్రభుత్వం చెప్పుకుంది. దిగువకోర్టు అంటున్నట్టుగా ట్రంప్ తన పరిధినేమీ అతిక్రమించలేదని, ప్రపంచ దేశాలన్నింటినీ కొత్త ఒప్పందాలకు దిగివచ్చేట్టుచేసి అమెరికాను ఆర్థికంగా వెలిగేట్టు చేస్తున్నారనీ, ఈ టారిఫ్‌లు కనుక లేకుంటే అమెరికా ఏడాది క్రితం వరకూ ఉన్నట్టుగా ఇకపై శాశ్వతంగా పేదదేశంగానే మిగిలిపోతుందని ప్రభుత్వం వాదన. తాము అధికారంలోకి వచ్చిన తరువాతే దేశం కళ్ళుతెరిచిందనీ, వెలుగుతున్న దేశాన్ని చూసి మిగతా ప్రపంచం అసూయపడుతోందనీ, కుట్రలు చేస్తోందని నాయకులు చెప్పుకోవడం సహజమేకానీ, న్యాయస్థానాలు అవును నిజమేనంటాయా? అన్నది ప్రశ్న.

1977 నాటి అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాలచట్టం (ఐఈఈపీఏ) వాడి సుంకాలు ప్రయోగించినప్పటినుంచీ ట్రంప్ చర్యమీద చర్చ జరుగుతూనే ఉంది. ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధమంటూ దాఖలైన పిటిషన్లపై తొలిగా విచారించిన అమెరికా వాణిజ్య న్యాయస్థానం ఆయనకు విదేశీ వాణిజ్యంతో చిత్తం వచ్చినట్టు వ్యవహరించగల విశేషాధికారాలేమీ లేవని మూడునెలల క్రితమే తేల్చేసింది. అప్పీల్స్‌కోర్టు మరునాడే ఆ తీర్పును నిలిపివేసి ట్రంప్‌కు తాత్కాలికంగా ఊరట కలిగించినా, ఇప్పుడు మంచి మెజారిటీతో కిందికోర్టు మాటే సరైనదని నిర్ధారించింది. జిమ్మీ కార్టర్ కాలంలో తయారై, ఇప్పటివరకూ ఏ అధ్యక్షుడూ వినియోగించని ఈ ఆర్థిక అత్యయిక చట్టాన్ని వాడి ట్రంప్ మిగతా ప్రపంచంతో యుద్ధం చేస్తున్నాడు. ఈ పురాతన చట్టంతో తాను న్యాయస్థానాల్లో నెగ్గుకురాగలనో లేదో ట్రంప్‌కు తెలియకపోయినా న్యాయనిపుణులు తెలియచెప్పకుండా ఉండరు. తన చర్య చట్ట బాహ్యమైనది అయినప్పటికీ, ట్రంప్‌కు కావల్సింది సామాన్య జనంలో రక్షకుడని అనిపించుకోవడం. గత పాలకుల చేతగానితనం వల్ల దుర్భరమైన పేదరికంలో కడుదీనాతిదీనంగా బతుకీడుస్తున్న అమెరికాను తిరిగి వెలుగుజిలుగుల అగ్రరాజ్యంగా ఉన్నతంగా నిలబెట్టే పేరిట ఆయన ఎన్ని విన్యాసాలైనా చేస్తాడు. ఏప్రిల్ 2న 'లిబరేషన్ డే' పేరిట ఆయన అక్షరక్రమంలో ప్రతీ దేశానికీ టారిఫ్‌లు విధించిన దృశ్యం చూసినవారికి ఆయనకు దేశాన్ని తీర్చిదిద్దడంకంటే తాను గ్రేట్ అనిపించుకోవడం ప్రధానమని అర్థమైంది. మిగతా ప్రపంచంతో పోరాడుతున్నానని ఆయన అంటూంటే, ఆయన మీద రాష్ట్రాలు, వాణిజ్య సంస్థలు, వేదికలు న్యాయపోరాటం చేస్తూ ఒక్కోమెట్టూ ఎక్కుతున్నాయి. ట్రేడ్‌కోర్టు తీర్పులోనూ, ఇప్పుడు అప్పీల్స్‌కోర్టు తీర్పులోనూ ఆయనకు రాజకీయ కుట్రలూ, తనపట్ల ద్వేషం, దేశంపట్ల న్యాయమూర్తుల బాధ్యతారాహిత్యం కనిపించాయి. సుంకాలను సంధించి శాంతిని సాధిస్తున్నానంటూ భారత్–పాక్ యుద్ధాన్ని కూడా ఆయన గతంలో న్యాయస్థానంలో వాడుకున్నాడు. దౌత్యం కంటే, చర్చలకంటే సుంకాల సమరమే సర్వరోగనివారిణి అని ఆయన నమ్ముతున్నాడు. ఎంతటి మొండిదేశాన్ని అయినా టారిఫ్‌వార్‌తో లొంగదీయగలనని గర్విస్తున్న ట్రంప్‌కు ఇది మరింత పెద్ద ఎదురుదెబ్బ. అమెరికన్ కాంగ్రెస్‌లో ఎటువంటి చర్చా చేయకుండా, దానిని పక్కకునెట్టేసి, ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న ట్రంప్‌కు రేపు సర్వోన్నత న్యాయస్థానంలో కూడా ఇదే పరిస్థితి ఎదురైతే నైతికంగా ఓడిపోయినట్టే.

అమెరికా ఆధిపత్యం నిలిచేనా?

చరిత్ర అనేది ఒక నిరంతర చైతన్య వాహిని. కఠినమైన న్యాయమూర్తి. ఎవరిపైనా పక్షపాతం చూపదు, ఎవరినీ కనికరించదు. ఎంతో గొప్పవారమని ఎవరు భావించినా, తామే శాశ్వత పాలకులమని, ఎప్పటికీ అధినాథులమని ఎవరు అనుకున్నా చరిత్ర ఎప్పుడూ అటువంటి వారికి ఒక గట్టి పాఠం నేర్పింది. అధికారం, సంపదతో పాటు మరేదీ శాశ్వతం కాదని చరిత్రలో పదే పదే రుజువయింది. ఇవి ఎప్పటికీ మరచిపోకూడని పాఠాలు. ఆ సత్యాలు వర్తమాన ప్రపంచానికి, ముఖ్యంగా నేటి అమెరికాకు వర్తిస్తాయి.

వంద సంవత్సరాల క్రితం గ్రేట్ బ్రిటన్ సమస్త ప్రపంచానికి ఏకైక నాయకి. ప్రపంచ సంపదలో ఆ దేశానికి 20శాతం కంటే ఎక్కువ వాటా ఉండేది. మానవాళిలో నాలుగో వంతుకు పైగా జనాభా బ్రిటిష్ సామ్రాజ్య పాలనలో ఉండేది. వినూత్న వాణిజ్యాలు, కొత్త పరిశ్రమలు, నవ సాంకేతికతలు సమస్తమూ అన్నీ బ్రిటన్ నుండే ప్రభవించినట్టుండేవి. సప్త సముద్రాలపై బ్రిటిష్ నౌకాదళ సర్వాధిపత్యం తిరుగులేకుండా ఉండేది. లండన్‌లో తీసుకున్న నిర్ణయాలు దేశదేశాల భవిష్యత్తును మార్చేవి. 'బ్రిటిష్ సామ్రాజ్యంలో సూర్యుడు ఎప్పుడూ అస్తమించడు' అనేది కేవలం మాట కాదు, వాస్తవం. అయితే ఇరవయో శతాబ్ది పూర్వార్ధంలో సంభవించిన రెండు ప్రపంచ యుద్ధాలు బ్రిటన్‌ను గట్టిగా కుదిపేశాయి. ఆ యుద్ధాల వలన బ్రిటన్ సిరిసంపదలు అడుగంటిపోయాయి. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య పాలకుల ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నది. వలస దేశాల్లో స్వాతంత్ర్య ఉద్యమాలు ఉధృతమయ్యాయి. తొలుత భారత్ విముక్తమయింది. ఆ తరువాత ఆసియా, ఆఫ్రికా దేశాలు క్రమంగా స్వతంత్ర రాజ్యాలుగా ఆవిర్భవించాయి. 20వ శతాబ్దం మధ్య నాటికే బ్రిటన్ ఒక సాధారణ యూరోపియన్ దేశంగా మారిపోయింది. ఇప్పటికీ అలాగే మిగిలిపోయి ఉంది. ఒకప్పుడు ప్రపంచాన్ని పాలించిన బ్రిటన్, నేడు తన గత చరిత్ర జ్ఞాపకాలతో కాలాన్ని నెట్టుకొస్తున్నది.

రెండు శతాబ్దాల క్రితం యూరప్ ఖండంలో ఫ్రాన్స్ అత్యంత శక్తిమంతమైన దేశంగా వెలిగింది. నెపోలియన్ చక్రవర్తి సైన్యాలు యూరప్ అంతటినీ జయించాయి. నెపోలియన్ అజేయుడని భావించేవారు. ఫ్రెంచ్ సంస్కృతి, కళలు, భాష సమస్త ప్రపంచాన్నీ ఆకర్షించాయి. తన పాలన శాశ్వతమని నెపోలియన్ విశ్వసించాడు. ఆ వివేకరాహిత్యమే అతడిని దెబ్బ తీసింది. నిరంతర యుద్ధాలు ఫ్రాన్స్ ఆర్థిక వనరులను హరించివేశాయి. బ్రిటన్, ఇతర యూరోపియన్ దేశాలు సమైక్యంగా నెపోలియన్‌పై దండెత్తాయి. చివరికి అతడిని ఓడించి, ఒక సుదూర దీవిలో ఒంటరిగా బంధించాయి. ఫ్రాన్స్ ఆధిపత్యం తగ్గిపోయింది. ఆ తరువాత కూడా ఫ్రాన్స్ సాటిలేని ఒక సాంస్కృతిక, ఆర్థిక శక్తిగా నిలిచినా, సామ్రాజ్యాధిపత్యాన్ని మాత్రం కోల్పోయింది.

నాలుగు శతాబ్దాల క్రితం స్పెయిన్ ప్రపంచ సముద్రాలపై తిరుగులేని ఆధిపత్యం చెలాయించింది. ఆసియాలోని ఫిలిప్పీన్స్‌లో మనీలా నుంచి ఉత్తర అమెరికాలోని మెక్సికో వరకూ సువిశాల భూభాగాలు స్పెయిన్ పాలనలో ఉండేవి. వెండి, బంగారం, సుగంధ ద్రవ్యాలు, పట్టుతో నిండిన నౌకలు తరలివచ్చేవి. స్పానిష్ రాజవంశం తమ పాలన దేవదత్తమని, శాశ్వతమని నమ్మింది. కానీ తన సంపదను సరైన విధంగా ఉపయోగించలేదు. మితిమీరిన ఖర్చులు చేసింది. ప్రబలిపోయిన మత అసహనం, యుద్ధాలు, దోపిడీలు... ఇవన్నీ స్పెయిన్ శక్తి సామర్థ్యాలను క్రమంగా క్షీణింపచేశాయి. 19వ శతాబ్దంలో లాటిన్ అమెరికా దేశాలు స్పెయిన్ వలస పాలన నుంచి స్వాతంత్ర్యం సాధించాయి. ఒకప్పుడు బంగారం, వెండి నిల్వలతో మెరిసిన స్పెయిన్ సామ్రాజ్యాన్ని కోల్పోయిన తరువాత యూరప్‌లో ఒక సాధారణ దేశంగా మిగిలిపోయింది.

బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్– ఈ మూడు దేశాల పతనం వెనక ఒకే కారణం ఉన్నది– తాము శాశ్వతమని నమ్మడం. బ్రిటన్ తన పాలనా విధానమే ఉత్తమమని భావించింది. ఫ్రాన్స్ తన సైన్యం ఎప్పటికీ అజేయమని అనుకుంది. స్పెయిన్ తన బంగారం ఎప్పటికీ తరుగదని విశ్వసించింది. అయితే కాలం అన్నది ఎవరి కోసం ఆగదు. చరిత్ర ముందుకు సాగిపోయింది. ప్రతి సామ్రాజ్యం ఎప్పటికైనా కూలిపోతుందనే సత్యాన్ని స్పెయిన్, ఫ్రాన్స్, బ్రిటన్ చరిత్ర రుజువు చేసింది.

ప్రస్తుత ప్రపంచంలో ఏకైక అగ్రరాజ్యంగా పేరుబడిన అమెరికా కూడా నెమ్మదిగా గతించిన సామ్రాజ్యాల బాటలో నడుస్తున్నది. ఇరవయో శతాబ్దం తొలినాళ్ల నుంచి ఇప్పటి వరకు అమెరికా తిరుగులేని ఆర్థిక, సైనిక శక్తిగా, సాంకేతిక ఆవిష్కరణలలో అగ్రగామిగా వెలుగొందింది. డాలర్‌ను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన కరెన్సీగా మార్చి, ఇతర దేశాలపై తన ప్రభావాన్ని చూపుతున్నది. అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ప్రతిభావంతులను ఆకర్షించే అవకాశాలు అన్నీ అమెరికాలోనే కేంద్రీకృతమయ్యాయి. అంతేకాదు, అనేక దేశాల్లో సైనిక స్థావరాలను నెలకొల్పి తన కుయుక్తిని ప్రదర్శిస్తున్నది. ప్రపంచ నాయకత్వం తనకు మాత్రమే సొంతం అనే అహంభావాన్ని సుదీర్ఘ కాలంగా కొనసాగిస్తున్నది.

అయితే కాలం మారింది. అంతర్గతంగా, బాహ్యంగా అమెరికా ఇప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. దేశీయంగా రాజకీయ అస్థిరత పెరిగిపోతున్నది. పార్టీ విభేదాలు, విధానాల్లో అస్పష్టత, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నాయి. ధనిక–పేదల మధ్య అసమానతలు ఆందోళనకర స్థాయికి చేరాయి. జాత్యహంకారం, వర్ణ వివక్ష ఇంకా పూర్తిగా అంతరించలేదు. ఫలితంగా, అమెరికా ప్రజలు ఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వాలపై నమ్మకం కోల్పోతున్నారు.

విదేశీ సంబంధాలలో కూడా అమెరికా పరిస్థితి మునుపటిలా లేదు. చైనా, భారత్, బ్రెజిల్, టర్కీ మొదలైన దేశాలు వేగంగా ఎదుగుతున్నాయి. సాంకేతిక రంగంలో కొత్త ఆవిష్కరణలు పాశ్చాత్య దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల్లో కూడా జరుగుతున్నాయి. ఒకప్పుడు అమెరికా చెప్పిన మాటే తుది నిర్ణయంగా ఉండేది. అయితే ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపై అమెరికా మాట అంతగా చెల్లడం లేదు. అగ్ర రాజ్య ఆధిపత్యం తగ్గిపోతున్న సంకేతాలు స్పష్టంగా కనబడుతున్నాయి.

చరిత్ర మనకు ఒక గొప్ప పాఠాన్ని చెబుతున్నది. ప్రపంచంలో ఏ సామ్రాజ్యమూ శాశ్వతం కాదు. రోమన్ సామ్రాజ్యం, బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్– ఒకప్పుడు శక్తిమంతమైన దేశాలే, సందేహం లేదు. అయితే అహంకారం, నిర్లక్ష్యం, అంతర్గత విభేదాల వల్ల అవి క్రమంగా బలహీనపడి చరిత్రలో కనుమరుగయ్యాయి. నేడు అమెరికా కూడా అదే మార్గంలో నడుస్తున్నట్టుగా కనిపిస్తున్నది.

నిజమైన నాయకత్వం అనేది సైనిక బలంపై కాకుండా, న్యాయం, సమానత్వం, మానవతా విలువలపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు ఒక దేశాన్ని గొప్ప నాగరికతా శక్తిగా నిలుపుతాయి. ఆ విలువలను విస్మరించిన రోజు ఆ దేశం ప్రాబల్య ప్రభావాలు క్షీణించడం ప్రారంభమవుతుంది. ఇది చారిత్రక సత్యం. అమెరికా దీనిని మరవకూడదు.

అమెరికా లేకపోయినా ప్రపంచం ముందుకు సాగుతుంది. రోమ్ కూలిపోయినా యూరప్ పురోగమనం ఆగలేదు. బ్రిటన్, ఫ్రాన్స్ ప్రభావం తగ్గినా కొత్త శక్తులు ప్రభవించాయి. అలాగే అమెరికా కూడా సమర్థమైన, సమంజసమైన నాయకత్వం అందించకపోతే ప్రపంచం దానిని దాటి ముందుకు వెళ్తుంది. ఇప్పటికే అనేక దేశాలు కొత్త కూటములుగా సంఘటితమవుతున్నాయి. అమెరికాతో నిమిత్తం లేకుండా ఆర్థిక, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారం పెరుగుతున్నది.

ఏ సామ్రాజ్య పతనం ఒక్కసారిగా సంభవించదు. అది నెమ్మదిగా, క్రమంగా జరుగుతుంది. అంతర్గత సమస్యలు, రాజకీయ విభజనలు, అహంకారం పెరిగితే ఎంత బలమైన దేశమైనా కూలిపోతుంది. అమెరికా కూడా ఈ సత్యాన్ని అంగీకరించి, తన మార్గాన్ని సరిదిద్దుకోవాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో అమెరికా ముందు రెండు మార్గాలు ఉన్నాయి. మొదటిది– చరిత్ర పాఠాలు గుర్తు పెట్టుకుని వినయం, న్యాయం, ఆవిష్కరణల ఆధారంగా కొత్త శతాబ్దానికి తగిన నాయకత్వ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం; రెండోది–'మేమే శాశ్వత అగ్రగాములు' అనే భ్రమలో మునిగి, మెల్లగా తన ప్రభావాన్ని కోల్పోవడం.

కాలం ఎవరిని విడిచిపెట్టదు. ఆర్థిక కలిమి, సైనిక బలం, రాజకీయ దురహంకారం ఆధారంగా నడిచే సామ్రాజ్యాలు ఎప్పటికీ నిలవవు. కాలమే వాటిని కనుమరుగు చేస్తుంది. అమెరికా భవిష్యత్తును నిర్ణయించేది ఇప్పుడు ఆ పాలకులు తీసుకునే నిర్ణయాలే.



> నిజమైన నాయకత్వం అనేది సైనిక బలంపై కాకుండా, న్యాయం, సమానత్వం, మానవతా విలువలపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు ఒక దేశాన్ని గొప్ప నాగరికతా శక్తిగా నిలుపుతాయి. ఆ విలువలను విస్మరించిన రోజు ఆ దేశం ప్రాబల్య ప్రభావాలు క్షీణించడం ప్రారంభమవుతుంది. ఇది చారిత్రక సత్యం. అమెరికా దీనిని మరవకూడదు.



■ పి. వేణుగోపాల్‌రెడ్డి
ఏకలవ్య ఫౌండేషన్ సంస్థాపకుడు

ఇనుమడించిన శాసనసభ ప్రతిష్ఠ!

తెలంగాణలో గత పదేళ్లలో ఏ రోజూ కనపడని అరుదైన దృశ్యాలకు ఇటీవలి శాసనసభ కేంద్ర బిందువైంది. ప్రతిపక్ష నేతల ప్రసంగాలకు కావల్సినంత సమయం ఇవ్వడం, విపక్ష సభ్యులు ప్రభుత్వానికి తగిన సూచనలు ఇవ్వడం, వాటిని మంత్రులు సహృదయంతో స్వీకరించడం, అబద్ధపు ప్రసంగాలను సభానాయకుడు రేవంత్‌రెడ్డి అంకెలు, వాస్తవాల ఆధారంగా చీల్చిచెండాడటం... ఆగస్టు 30, 31 తేదీల్లో పదమూడు గంటలకు పైగా సాగిన తెలంగాణ శాసనసభ ఈ వేడుక వంటి దృశ్యాలకు వేదికైంది. ఇందుకు ప్రధాన కారకుడు ప్రజాస్వామిక విలువలపై ప్రగాఢ విశ్వాసం ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డే!

ఎట్టకేలకు శాసనసభ శాసనసభలా నడిచి ఆద్యంతం ఆకట్టుకున్నది. 'తుమ్మిడిహెట్టి వద్ద 205 టీఎంసీల నీటి లభ్యత ఉందని నాటి జలవనరులశాఖ మంత్రి ఉమాభారతి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు' అంటూ ఆ లేఖను చూపుతూ కాళేశ్వరం ప్రాజెక్టు స్థల మార్పిడిలోని మతలబును సభా వేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు తెలియజేశారు. కాళేశ్వరం ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇష్టారీతిన చేసిన వాదనలను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు అంకెలతో, లేఖలతో, తగిన ఆధారాలతో తిప్పికొట్టారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఎమ్మెల్యేలకు అందక ముందే మీడియాకు రావడంపై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ విమర్శను పరిగణనలోకి తీసుకుంటూ ఈ అంశంపై విచారణ చేయిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. సున్నితమైన ప్రాజెక్టుల విషయంలో తప్పు చేయడం మరణంతో సమానమని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రసంగించారు. నీటి లభ్యతలో తేడా లేకుండా కమీషన్ల కోసమే ప్రాజెక్టు స్థల మార్పిడి చేశారని, నాడు అంతా తానే అన్న కేసీఆర్ ఇప్పుడు తనకు సంబంధం లేదనడం సరికాదనీ బీజేపీ ఎమ్మెల్యే హరీశ్‌బాబు ప్రసంగించారు. మరో పక్క బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ అవినీతిని బట్టబయలు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై ఆక్రోశం వెళ్ళగక్కుతూ, ఆ నివేదికను ముక్కలుగా చింపిపారేసి తమ అప్రజాస్వామిక వైఖరిని చాటుకున్నారు. అధికారపక్షం మాత్రం ఓపిగ్గా సహనంగా ప్రతిపక్షాల విమర్శలను వింటూ, వారి సలహాలను స్వీకరిస్తూ సభా ప్రతిష్ఠ పెంచింది.

ఉమ్మడి రాష్ట్రంలో నీళ్ల దక్కక బీళ్లుగా మారిన భూములను సస్యశ్యామలం చేసేందుకు ప్రాజెక్టుల రీడిజైన్ మొదలు పెడుతున్నామంటూ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటిస్తే ప్రజలు నిజమేనని నమ్మారు. కానీ ఆ రీడిజైన్‌లు ఇంజినీర్లు కాకుండా తానే చేస్తున్నానని, ప్రాజెక్టులు ఎక్కడ కట్టాలో నిపుణులు కాకుండా తానే నిర్ణయిస్తున్నానని ప్రగల్భాలు పలికినప్పుడే తెలంగాణ సమాజం ఉలిక్కిపడింది. కానీ ప్రశ్నించిన గొంతుకలను ఉక్కుపాదంతో అణిచివేయడం, విపక్ష పార్టీల ఉనికే శాసనసభలో లేకుండా చేయడం వల్ల బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎదురన్నది లేకుండా పోయింది. ప్రభుత్వం చేసిన తప్పులకు నిరసన తెలిపేందుకు ధర్నాచౌక్ లేదు, ప్రశ్నించేందుకు శాసనసభలో, మండలిలో విపక్షాలకు చోటే లేదు. ప్రజలు చట్టసభల్లో అవకాశం ఇచ్చిన పార్టీల ఉనికినే సభలో లేకుండా చేయడం ద్వారా శాసనసభను బాతాఖానీ క్లబ్‌గా, భజన మండలిగా మార్చేశారు గత ముఖ్యమంత్రి కేసీఆర్. కానీ 20 నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఆ చీకటి రోజులకు తెరదింపి ప్రజాస్వామిక పాలనకు తెరలేపారు. దాని ఫలితంగానే నేడు లోతైన చర్చల ద్వారా శాసనసభ ప్రతిష్ఠ మరింత పెరిగింది.



> తెలంగాణలో తొలి ముఖ్యమంత్రి అయిన కేసీఆర్‌కు విపక్ష పార్టీలపై ఉన్న చిన్న చూపు, నియంతృత్వ వైఖరి వల్ల శాసనసభ సమావేశాలంటే ప్రజలకు చులకన భావం ఏర్పడింది. నేడు సభానాయకుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు సభలో వ్యవహరిస్తున్న తీరుతో శాసనసభ మళ్ళీ పూర్వ వైభవాన్ని, గౌరవాన్ని వెనక్కి తెచ్చుకుంది.

ఉమ్మడి రాష్ట్రంలో 1970వ దశకం నుంచి 2014 వరకు ఉద్దండులైన ముఖ్యంత్రులు జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి, టంగుటూరి అంజయ్య, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, ఎన్టీ రామారావు, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు, వైఎస్. రాజశేఖర రెడ్డి ఉన్న సమయంలో భిన్న ప్రతిపక్ష పార్టీలకు చెందిన గౌతు లచ్చన్న, భాట్టం శ్రీరామమూర్తి, సూదిని జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు, నర్రా రాఘవరెడ్డి, మద్దికాయల ఓంకార్, బోడేపూడి వెంకటేశ్వరరావు, చిలుముల విఠల్‌రెడ్డి, పి. జనార్దన్‌రెడ్డి, చెన్నమనేని రాజేశ్వరరావు, గుమ్మడి నర్సయ్య, చెన్నమనేని విద్యాసాగర్‌రావు ప్రతిపక్ష నేతలుగా ప్రజా సమస్యలపైనా ప్రభుత్వాన్ని చీల్చిచెండాడుతూనే మరోవైపు రాష్ట్ర భవిష్యత్‌కు అవసరమైన విలువైన సలహాలు, సూచనలు ఇచ్చేవారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభల ప్రతిష్ఠ చాలావరకు మసకబారింది. తెలంగాణలో తొలి ముఖ్యమంత్రి అయిన కేసీఆర్‌కు విపక్ష పార్టీలపై ఉన్న చిన్న చూపు, నియంతృత్వ వైఖరి వల్ల శాసనసభ సమావేశాలంటే ప్రజలకు చులకన భావం ఏర్పడింది. అధికార పక్షానికి డబ్బా కొట్టడంతో, ప్రతిపక్షాలపై నిందలతో గౌరవ సభను కౌరవ సభగా మార్చివేశారు.

నేడు సభానాయకుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు సభలో వ్యవహరిస్తున్న తీరుతో శాసనసభ మళ్ళీ పూర్వ వైభవాన్ని, గౌరవాన్ని వెనక్కి తెచ్చుకుంది. ప్రతిపక్షాలకు సమయం ఇవ్వడంతో పాటు వారి ప్రతి సందేహాన్ని నివృత్తి చేస్తూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, మంత్రులు పూర్తి ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నారు. ఫలితమే గతంలోలా అనవసరంగా సభ్యులపై అనర్హత వేట్లు, మార్షల్స్ సభ నుంచి ఈడ్చి పారేయడం వంటి అప్రజాస్వామిక చర్యలకు తావులేకుండా సభ సజావుగా సాగుతున్నది. సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఎటువంటి పక్షపాతం చూపకుండా అన్ని పక్షాలకు అవకాశం ఇస్తున్నారు. మాగంటి గోపీనాథ్ సంతాప తీర్మానం; బీసీ రిజర్వేషన్లకు అడ్డుగా ఉన్న పంచాయతీరాజ్, పురపాలక చట్టాల సవరణ; కాళేశ్వరం అవినీతిపై జస్టిస్ పీసీ ఘోష్ నివేదికపై చర్చల సందర్భంలో ముఖ్యమంత్రి, మంత్రులు పూర్తి ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించారు. శాసనసభలో ఇటీవలి ఈ చర్చలు రానున్న సంవత్సరాల్లో మార్గదర్శకంగా నిలుస్తాయి. గత పదేళ్ల సభ జరిగిన తీరుతో, ఇప్పుడు సభ జరుగుతున్న తీరును ప్రజలు బేరీజు వేసుకొని ప్రశంసిస్తున్నారు.

• అద్దంకి దయాకర్
కాంగ్రెస్ ఎమ్మెల్సీ

జ్ఞానప్రదాతలు

దేశ అభివృద్ధి, సమాజ నిర్మాణం, విద్యార్థుల భవిష్యత్, మానవ విలువలు, మూర్తిమత్వం, మానవత్వం, సామాజిక స్పృహ, ఓర్పు, నేర్పు, అన్నిటికీ మూలం గురువు. ఏ దేశమైనా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే ఆ దేశంలో ఆర్థికరంగ నిపుణులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, వ్యవసాయరంగ నిపుణులు, నీటిపారుదల రంగం, రక్షణశాఖ, డాక్టర్లు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులు... ఇలా ప్రతి రంగంలోని వ్యక్తులూ విద్యావంతులు కావల్సిందే. వీరిని తీర్చిదిద్దేది కేవలం ఉపాధ్యాయుడే, అంటే దేశాభివృద్ధికి కారకుడు గురువే. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా నేడు జరుపుకొనే ఉపాధ్యాయ దినోత్సవం ఒక ఉపాధ్యాయుని జ్ఞానానికి, త్యాగానికి ప్రతిఫలం. డా. రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఎన్నో సన్మానాలు, అవార్డులు పొందారు. 27సార్లు నోబెల్ పురస్కారానికి నామినేట్ అయ్యారు. దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న పొందారు. ఆయనను రాష్ట్రపతిగా ఎన్నుకోవడానికి ప్రధాన కారణం, ఆయన సాధించిన అవార్డులు, పేరు ప్రఖ్యాతులు, విద్యా రంగానికి చేసిన సేవలే.



మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అని సమాజంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులకే ఇస్తారు. బాధ్యతలను, కర్తవ్యాలను, తెలివితేటలను, శక్తిని, యుక్తిని, శాంతిని, ధర్మాన్ని, తన దగ్గరున్న అపార అనుభవాన్ని నరనరాన నింపి, శిల్పి శిల్పాన్ని చెక్కినట్లు విద్యార్థులలో జ్ఞానాన్ని చెక్కేది ఉపాధ్యాయుడే. సాంకేతికత ఎంత పెరిగినా, అర చేతిలో ప్రపంచం మొత్తం కనపడేలా ఫోన్లు, నెట్‌వర్క్‌లు ఉన్నా కూడా, కొన్ని విషయాలను ఆయనే నేర్పగలడు. సమాజంలో మంచి పౌరులు తయారవ్వాలన్నా, యువత స్వావలంబన వైపు నడవాలన్నా, ప్రగతి సాధించాలన్నా, శాంతియుతంగా, ఐకమత్యంగా ఉండాలన్నా, దేశభక్తి పెంపొందాలన్నా, మానవత్వం అలవర్చుకోవాలన్నా గురువు బోధనే ముఖ్యం. కొన్ని దేశాలలో గురువుల స్థానం ఆ దేశంలోని వీఐపీలతో సమానంగా ఉంది. మన దేశంలో కూడా వారికి సమున్నత స్థానం కల్పించాలి.

– సయ్యద్ జబీ, టీజీవో సెక్రటరీ, సిరిసిల్ల

నేర రాజకీయాల ఆటకట్టుకు తొలి అడుగు

తీవ్ర నేరాభియోగాలపై అరెస్టై వరుసగా 30 రోజుల పాటు నిర్బంధంలో ఉంటే రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, చివరికి ప్రధానమంత్రినైనా 31వ రోజు పదవి నుంచి తప్పించడానికి రాజ్యాంగంలోని 75, 164, 239ఎఎ అధికరణలకు సవరణలను ప్రతిపాదిస్తూ 130వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 20న లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు నిబంధనలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధమని, రాజకీయ దురుద్దేశాలతో ప్రతిపక్షాలకు చెందిన నాయకులను గద్దె దించడానికి దోహదపడుతుందని విపక్ష పార్టీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. చివరకు ఈ బిల్లుల్ని సమగ్ర అధ్యయనం నిమిత్తం సంయుక్త పార్లమెంటరీ సంఘం పరిశీలనకు పంపించాలని మూజువాణీ ఓటుతో లోక్‌సభ నిర్ణయించింది. పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలి వారం చివరి రోజున జేపీసీ తన నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ రాజ్యాంగ సవరణ దేశ వ్యాప్తంగా రాజకీయ నాయకుల్లో కలవరం సృష్టిస్తోంది. అత్యున్నత అధికార స్థానాల్లో అవినీతిని రూపుమాపేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలను ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని ఇటీవల బిహార్ పర్యటనలో ప్రధాని మోదీ ఆరోపించారు. ఒక సాధారణ ప్రభుత్వోద్యోగి ఒక చిన్న తప్పు చేసి కొంతకాలం జైలు జీవితం గడిపితే సస్పెన్షన్‌కు గురవుతున్నప్పుడు, 30 రోజులు జైలులో ఉన్న ముఖ్యమంత్రి లేదా ప్రధాని తమ స్థానం నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని ఆయన ప్రశ్నించారు. ఒకవైపు ఊచలు లెక్కిస్తూనే మరోవైపు ఫైళ్లపై సంతకాలు చేస్తున్నారంటే మనం చింతించాలని అన్నారు. అయితే ఈ నిబంధన తటస్థంగా ఉండవలసిన వ్యవస్థలను అనివార్యంగా రాజకీయమయం చేస్తుందని, బెయిలు దరఖాస్తులను నిర్ణయించే జడ్జీలు ఎవరు పాలించాలో నిర్ణయించే శక్తులుగా మారతారని, పోలీసులు కూడా తాము ఒక ముఖ్యమంత్రిని అరెస్ట్ చేస్తే ప్రభుత్వం కూలిపోతుందని గ్రహిస్తారని కొందరు విమర్శిస్తున్నారు.

అయితే నేరమయమై పోయిన నేటి రాజకీయాల్లో మార్పునకు ఇది ఒక తొలి అడుగుగానే భావించాలే తప్ప, యూనియన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ రాజ్యాంగ సవరణతో దేశ రాజకీయాలు సచ్ఛీలంగా మారిపోతాయని అనుకోవడం భ్రమే. అలాగే ఈ సవరణ ప్రభుత్వాన్ని మార్చేందుకు రాజ్యాంగం ప్రసాదించిన 'కూల్చివేత ఆయుధం'గా ఎన్డీయే ప్రభుత్వం ఉపయోగించుకుంటుందని, బ్యాలెట్ కన్నా లాకప్ ఒక మార్గంగా మార్చుకుంటుందని అనుకోవడం కూడా పొరపాటే. నేర రాజకీయాలు అంతమైతే నష్టపోయేవారు హింసా రాజకీయాలకు, నేరాలకు పాల్పడే రాజకీయ నాయకులే... కాబట్టి కొందరు ఉద్దేశపూర్వకంగానే ఈ సవరణను వ్యతిరేకిస్తున్నారన్నది నిజం.

వాస్తవానికి మన దేశంలో నేర రాజకీయాలు ఏదో ఒక పార్టీకి మాత్రమే పరిమితమయ్యాయని భావిస్తే పొరపాటు. అన్ని ప్రధాన పార్టీలూ నేరచరితులకు నిర్లజ్జగా పెద్దపీట వేస్తున్నాయి. ఈ నేర చరితులనే సమాజానికి ఆదర్శంగా చూపుతున్నాయి. ఎన్నికల్లో దౌర్జన్యం చేసి గెలవగానే ఈ పార్టీల ప్రభుత్వాలే నేరస్థులపైన కేసుల్ని రద్దు చేస్తున్నాయి. నేరస్థుడి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాల్సింది పోయి, అతడికి రక్షణ పేరుతో సాయుధ పోలీసులనిస్తోంది ప్రభుత్వం! ఇక గెలవగానే అది వరకు నేరస్థులను నిలదీసిన పోలీసు అధికారులను బదిలీ చేయించడం, తమ అడుగులకు మడుగులొత్తే వాళ్లను తమ ప్రాంతాల్లో వేయించుకోవడం అధికారంలో ఉన్నవాళ్లు చేసే మొదటి పని. ఈ విషవలయం నుంచి బయటపడడం వ్యవస్థ భవిష్యత్తుకు, ప్రజల సంక్షేమానికి అవసరం.

నిజానికి మన దేశంలో రాజకీయ నాయకులకి, నేరగాళ్లకు విడదీయరానంత ప్రగాఢ సంబంధాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. మన ప్రభుత్వ వ్యవస్థలు– ముఖ్యంగా పోలీసు యంత్రాంగం నిర్వీర్యం కావడమే దీనికి ప్రధాన కారణం. పోలీసు అధికారుల నియామకాలు, బదిలీలు, ప్రమోషన్లు వంటివన్నీ ప్రభుత్వంలోని నాయకుల చేతుల్లో ఉన్నాయి. నిజాయితీగా నేర పరిశోధన చేసే ఏ అధికారి అయినా ఎన్నో ఇబ్బందులను, ఒడిదుడుకులను ఎదుర్కొనవలసి వస్తోంది. దాంతో ఇక తప్పని పరిస్థితుల్లో నాయకుల మాట విని నెట్టుకురావాల్సిన పరిస్థితి పోలీసులది. దీంతో పోలీసుల ప్రతిష్ఠ మరింత దిగజారుతోంది. నేర రాజకీయం, హింసా సంస్కృతి, అవినీతి, మాఫియా నేర సామ్రాజ్యాలు, ఎన్నికల అక్రమాలు, కులం పేరుతో ముఠాలు, ప్రైవేటు సైన్యాల ద్వారా తగాదాల పరిష్కారాలు, అధికారుల బదిలీలు, ప్రభుత్వ సిబ్బందిని సొంత సేవకులుగా వినియోగించుకోవడం, ప్రభుత్వ పనులపైన పూర్తి ఆధిపత్యం– ఇవన్నీ మన వ్యవస్థలో కలగాపులగమైపోయాయి. నేరాల దర్యాప్తులో రాజకీయ జోక్యంతో రాజకీయాలు నేరస్థులను అయస్కాంతంలా ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టడం, సెటిల్మెంట్లు, ఓట్ల కొనుగోలు... ఇవన్నీ కలిస్తేనే ఎన్నికల్లో గెలుపు అవకాశాలు అనే ఫార్ములా నేరచరితులకు రాజకీయాల్లో ప్రవేశం కల్పిస్తున్నాయి.

ఇప్పుడు జరగవలసిన మరొక చర్చ ఏమిటంటే– అవినీతి, అక్రమాలు, ఆర్థిక నేరాలు... ఇలా కేసులు ఏవైనా కావొచ్చు, ఈ కేసులలో దోషులుగా రుజువైన వాళ్ళు పోటీకి, అర్హులా, అనర్హులా అనే దానికంటే... కోర్టుల్లో ప్రాథమిక విచారణ తరువాత, నేరారోపణ జరిగిన అనంతరం తీర్పు వచ్చేలోగా అలాంటి వాళ్ళు పోటీకి అర్హులా, కాదా అనే అంశం మీద అసలు చర్చ జరగాలి. ప్రస్తుత చట్టాల ప్రకారం సాక్షాత్తూ హత్య చేసి దొరికినవాళ్ళు కూడా కోర్టుల్లో తీర్పు వచ్చి శిక్ష పడేదాకా పోటీకి అర్హులు! నాగరిక సమాజంలో ఇంతకన్నా మరో దారుణం లేదు.

ఏది ఏమైనా ఇప్పటికే చాలా ఆలస్యమైంది, పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండాలంటే ఇప్పుడైనా ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలూ కలిసి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు. మొదటిది– సమర్థులు, నిజాయితీపరులైన అధికారులను ఎంపికచేసి, వారికి తగిన అధికారాలను, సిబ్బందిని ఇచ్చి, వెన్నుతట్టి ప్రోత్సహించడం. రెండవది– నేరగాళ్ళను, ముఠా నాయకులను ఎన్నికలకు దూరంగా ఉంచడం. 'నాలుగు సీట్లు పోయినా ఫర్వాలేదు, మేం మాత్రం మా పద్ధతి మార్చుకుంటున్నాం' అని ప్రజలకు ప్రత్యక్షంగా రుజువు చేయగలగాలి. మూడోది– నేర పరిశోధనలో రాజకీయ జోక్యం లేకుండా కట్టుదిట్టం చేయాలి. ప్రమోషన్లు, బదిలీలలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలి. చివరిది– నేరాల విషయంలో త్వరితగతిన న్యాయం అందేలా న్యాయవ్యవస్థలో మార్పులు జరగాలి. సకాలంలో న్యాయం అందటం నాగరికతకు చిహ్నం, అసలు న్యాయాన్నే అందించలేకపోతే రాజ్యవ్యవస్థకు, ప్రభుత్వానికి మనగలిగే హక్కు లేదు. జాతీయ స్థాయిలో పెద్ద మార్పులు రావాలి. అందు కోసం ఆగకుండా కనీసం స్థానికంగా న్యాయం త్వరగా అందేలా గ్రామ న్యాయాలయాలను, పట్టణాలలో త్వరితగతిన వివాదాలు తీర్చడం కోసం తగిన న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలి. ఈ నాలుగు మార్పులతో పాటు చట్టబద్ధ పాలన సక్రమంగా అమలు చేసే విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి. ఇదే సందర్భంలో సమర్థులు, నిజాయితీపరులు... ముఖ్యంగా యువత నాయకత్వ బాధ్యతల్ని అందుకునేలా, వీలున్నంత కాలం చేశాక తమ తర్వాతి తరానికి బాధ్యతల్ని బదిలీ చేసేలా సంస్కరణల్ని తెచ్చుకోవడం ఇప్పుడు ప్రజల ముందున్న ప్రధాన లక్ష్యం. అదేవిధంగా ఓటు వేసేది ఎన్నికల్లో నిలబడ్డవారికి కాదు... తన భవిష్యత్తుకు వేస్తున్నాననే స్పృహ ప్రతి ఒక్కరిలో రావాలి. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలూ ఇలాంటి చర్యలు తీసుకోకుండా, ప్రజల్లో మార్పు రాకుండా కేవలం నేర రాజకీయాల గురించి మాట్లాడుకుని ఉపయోగం లేదు. దీనికి కావలసిందల్లా రాజకీయ సంకల్పం, సమాజంలో అవగాహన.

> మన దేశంలో నేర రాజకీయాలు ఏదో ఒక పార్టీకి మాత్రమే పరిమితమయ్యాయని భావిస్తే పొరపాటు. అన్ని ప్రధాన పార్టీలూ నేరచరితులకు నిర్లజ్జగా పెద్దపీట వేస్తున్నాయి. ఇప్పుడైనా ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలూ కలిసి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు. దీనికి కావలసిందల్లా రాజకీయ సంకల్పం, సమాజంలో అవగాహన.



◆ కూసంపూడి శ్రీనివాస్
జనసేన అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.3 కనిష్ఠం 22.2

9వ రోజు.. నిమజ్జన జోరు

ఖైరతాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సాగర తీరంలో వినాయక విగ్రహాల నిమజ్జనం జోరందుకుంది. 9వ రోజైన గురువారం ప్రతిమలను నిర్వాహకులు గంగ ఒడికి తరలించారు. ఎన్‌టీఆర్ మార్గ్‌లో 10 క్రేన్లు ఏర్పాటు చేసి నిమజ్జనాలు కొనసాగిస్తున్నారు. బ్యాండు, డప్పు మేళాలు, నృత్యాల మధ్య ఏకదంతుడికి వేడుకగా వీడ్కోలు పలికారు. అర్ధరాత్రి తర్వాత కూడా ఎన్‌టీఆర్ మార్గ్‌లో నిమజ్జన కోలాహలం కనిపించింది.



మహా నిమజ్జనం కోసం ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన క్రేన్లు



9వ రోజు నిమజ్జనానికి ట్యాంక్‌బండ్ వద్ద క్యూ కట్టిన గణపతి విగ్రహాలు



నిమజ్జనం కోసం వేచి ఉన్న పరశురామ సమేత గణేశుడు

మహా నిమజ్జనం.. సర్వం సిద్ధం

ఆయా కేంద్రాల వద్ద పూర్తయిన ఏర్పాట్లు

- ట్యాంక్‌బండ్‌పై అందుబాటులోకి క్రేన్లు
- సాగర తీరంలో 30 వరకు ఏర్పాటు
- ఆపరేషన్ ఖైరతాబాద్ మహా గణపతి..
- మధ్యాహ్నం 1.30కు పూర్తయ్యేలా ప్లాన్
- 30 వేల మంది సిబ్బందితో బందోబస్తు
- రేపు, ఎల్లుండి మద్యం విక్రయాలు బంద్




ఉట్టి కొడుతూ చిన్నారుల కేరింతలు



డప్పు కొడుతున్న బాలుడు



పీపుల్స్‌ప్లాజా వద్ద వినాయకుడి నిమజ్జనం



హైదరాబాద్ సిటీ/కవాడిగూడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రేపు మహా నిమజ్జనం. హుస్సేన్‌సాగర్‌తో పాటు ఇతర చోట్ల వినాయక విగ్రహాల నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సాగర తీరంలోని ఎన్‌టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, సంజీవయ్య పార్కు వైపు ఇప్పటికే క్రేన్లు అందుబాటులో ఉన్నాయి. గురువారం ట్యాంక్‌బండ్‌పై పది క్రేన్లు ఏర్పాటు చేశారు. నిమజ్జన ఏర్పాట్లపై భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి, భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ తదితర సంస్థలు అసంతృప్తి వ్యక్తం చేసిన మర్నాడే ప్రభుత్వ విభాగాలు రంగంలోకి దిగాయి. క్రేన్లు, కంట్రోల్ రూమ్‌లు, మెడికల్ క్యాంపులు, మొబైల్ టాయిలెట్లు, తదితర సదుపాయాలు ఏర్పాటు చేశాయి. సరూర్‌నగర్, ఐడీఎల్, సఫిల్‌గూడ, సున్నం చెరువుతోపాటు

మిగతా 4వ పేజీలో..

నిమజ్జన లెక్కలు ఇలా..

- శోభాయాత్ర జరిగే మార్గం : 303 కి.మీలు
- కంట్రోల్ రూమ్‌లు : 13
- గణేష్ యాక్షన్ టీంలు : 160
- పని చేయనున్న పారిశుధ్య కార్మికులు : 14,486
- ప్రధాన నిమజ్జన కేంద్రాలు : 20
- కృత్రిమ కొలనులు : 74
- స్టాటిక్ క్రేన్లు : 134
- మొబైల్ క్రేన్లు : 259
- మొత్తం క్రేన్లు : 403
- హుస్సేన్‌సాగర్‌లో బోట్లు : 9
- అందుబాటులో ఉండే గజ ఈతగాళ్లు : 200
- అదనంగా ఏర్పాటు చేసిన వీధి దీపాలు : 56,187

దర్శనానికి రావొద్దు

- బడా గణేశ్ నిమజ్జన పనులు ప్రారంభం

ఖైరతాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ మహా గణపతి దర్శనాలు గురువారంతో ముగిశాయని, శుక్రవారం ఎవరూ రావొద్దని సైఫాబాద్ డివిజన్ ఏసీపీ సంజయ్ కుమార్ సూచించారు. గురువారం ఉదయం నుంచే నిమజ్జన పనులు ప్రారంభించారు. గణపతిని తరలించే భారీ ట్రాలీపై బేస్ పనులకు వెల్డింగ్ చేస్తున్నారు. గణపతిని తరలించే ట్రాలీకి రథసారధిగా ఈసారి ఎం.వెంకట్ రెడ్డి వ్యవహరించనున్నారు. భారీ గణపతిని ఈయన గతంలో మూడు సార్లు తరలించిన అనుభవం ఉంది. ఎస్టీసీ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన లో బెడ్ వాహనాన్ని శోభాయాత్రకు వినియోగిస్తున్నారు. ఇది 100 టన్నుల బరువును తరలించగలదు. గణపతి దాదాపు 60 టన్నుల బరువుంటాడు. 26 టైర్లతో ఉన్న ఈ వాహనం 75 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పుతో ఉంది.



రథసారధి వెంకట్ రెడ్డి | గణపతిని తరలించే ట్రాలీకి వెల్డింగ్ పనులు

ట్రాఫిక్ ఆంక్షలు.. మళ్లింపులు 6

లడ్డూ @ రూ.51.07లక్షలు



లడ్డూను దక్కించుకున్న కొండపల్లి గణేశ్

రాయదుర్గం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని మై హోం భూజలో ఏర్పాటు చేసిన వినాయడి లడ్డూ రికార్డు ధర పలికింది. ఫ్లాట్ నంబర్ సి-2501లో నివాసం ఉండే కొండపల్లి గణేష్ రూ.51,07,777లకు వేలం పాటలో లడ్డూను దక్కించుకున్నారు. గత ఏడాది కూడా రూ.29లక్షలకు వీరే దక్కించుకున్నారు. వీరికి ఖమ్మం ఇతర ప్రాంతాల్లో వైన్‌షాపులు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఉన్నాయి.

అమిత్‌షా హైదరాబాద్ పర్యటన రద్దు

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హైదరాబాద్ పర్యటన రద్దు అయ్యింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం శనివారం నిమజ్జన ఉత్సవాల ఊరేగింపు సందర్భంగా చార్మినార్, మొజంజాహి మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన వేదికల నుంచి ఆయన స్వాగతం పలకాల్సి ఉంది. ఉపరాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా పార్టీ తరఫున పాల్గొనాల్సిన ముఖ్య కార్యక్రమాలు ఉన్నందున హైదరాబాద్ పర్యటన రద్దు అయినట్టు రాష్ట్ర బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి.

'చిట్టీ'ంగ్



చిట్టీ వ్యాపారి ఇంటి ముందు బాధితులు

చిట్టీల పేరుతో ఘరానా మోసం
రూ.3 కోట్ల మేర కుచ్చు టోపి!

బిట్స్ పిలానీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జవహర్ నగర్ పరిధిలో ఘరానా మోసం వెలుగుచూసింది. చిట్టీల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజలను నిండా ముంచిన ఒక మహిళ సుమారు రూ. 3 కోట్లతో అదృశ్యమైంది. స్థానికుల కథనం ప్రకారం.. దాదాపు 14 సంవత్సరాల క్రితం జవహర్ నగర్ బాలాజీ నగర్‌కు పొట్టకూటికోసం వచ్చిన ఒక జంట కిరాయి ఇంట్లో ఉంటూ అందరితో నమ్మకంగా ఉండేవారు. ఆ మహిళ ఎంబ్రాయిడరీ, బొటిక్ వర్క్ చేస్తూ స్థానికులకు విశ్వాసం కలిగించింది. ఒక రాజకీయ పార్టీ మహిళా విభాగం నాయకురాలిగా కూడా ఎదిగింది. మొదట చిన్న మొత్తాల్లోనే చిట్టీలను నడిపిస్తూ సమయానికి డబ్బులు చెల్లించి నమ్మకం పొందింది. ఆ తర్వాత దశలవారీగా రూ.కోట్లలో డబ్బులు సేకరించి చివరికి మాయం అయిందని, మూడు లక్షల నుంచి ఐదు లక్షల వరకు చిట్టీలు నిర్వహించేదని బాధితులు వాపోతున్నారు. ఆమె మరో వ్యాపారుల నుంచి ఇటీవలే పది లక్షల చిట్టీలు రెండు లిఫ్ట్ చేసి ఆ డబ్బులు సైతం తీసుకెళ్లినట్లు సమాచారం.

పథకం ప్రకారమే పరార్

నెల రోజులుగా ఇక్కడి నుంచి పరారయ్యేందుకు పథకం వేసుకున్నట్లు సమాచారం. తన పిల్లలు చదువుతున్న కళాశాల నుంచి టీసీలు తీసుకున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్ టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియాను కూడా క్లోజ్ చేశారు. రెండు రోజులుగా భార్యాభర్తల ఫోన్లు స్విచాఫ్ వస్తుండడంతో బాధితులు ఇంటికి వచ్చి చూడగా, వారు రూమ్ ఖాళీ చేసి వెళ్లినట్లు ఇంటి యజమాని తెలిపారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే విచారణ చేపడతామని పోలీసులు చెబుతున్నారు.



నగరంలో సర్వేపల్లి అడుగుజాడలు 6

- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

జన సంద్రం.. ఖైరతాబాద్ 6

- వినాయకుడి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన పరిసరాలు.. ట్రాఫిక్ జాం

అమెరికాకు నకిలీ టికెట్లు

- విమాన సీటు వివరాలు లేకపోవడంతో వెలుగులోకి మోసం



బేగంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అమెరికా విమాన ప్రయాణానికి నకిలీ టికెట్లను అంటగట్టిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి భరత్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భరత్‌నగర్‌లోని శక్తినగర్‌కు చెందిన దేవరపల్లి తిరుపతిరెడ్డిని అతని మిత్రుడు గోలిపల్లి సంజీవ్ అమెరికా వెళ్లి వచ్చేందుకు విమాన టికెట్లు కావాలని సంప్రదించాడు. దీంతో తిరుపతి రెడ్డి తన సహ ఉద్యోగి డీఎంఎస్ ప్రసాద్ ద్వారా శ్రీకాంత్‌ను కలిశాడు. విమాన టికెట్లు బుక్ చేసేందుకు సంజీవ్ వద్ద శ్రీకాంత్ రూ.2,12,450 తీసుకున్నాడు. ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ టికెట్ నిర్ధారణ పత్రాల పేరిట ఓ సాఫ్ట్ కాపీని సంజీవ్‌కు పంపాడు. తిరుగు ప్రయాణంలో దుబాయిలో ఎక్కువ సేపు ఆగుతుందని గుర్తించి టికెట్లను మార్చాలని సంజీవ్ కోరాడు. దీంతో టికెట్ రద్దుకు రూ.13వేలతో పాటు అదనపు టికెట్‌కు రూ.లక్ష చెల్లించాలని శ్రీకాంత్ చెప్పడంతో సంజీవ్ ఆ నగదును కూడా చెల్లించాడు. తిరుపతిరెడ్డి కూడా తన కుమార్తె అమెరికా నుంచి హైదరాబాద్‌కు రావడం కోసం టికెట్ కావాలని రూ.43వేలు శ్రీకాంత్‌కు ఇచ్చాడు. అతనికి కూడా ఓ సాఫ్ట్ కాపీని పంపాడు. అయితే విమానంలోని సీటింగ్, ఆహారం తదితర వివరాలు లేకపోవడంతో అనుమానంతో సంజీవ్ ఆరా తీశాడు. శ్రీకాంత్ పంపినవి నకిలీ టికెట్లు అని తేలింది. మోస పోయామని గ్రహించిన బాధితులు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హైడ్రా పేరిట మోసం..
రూ.50 లక్షలు వసూలు

- ఓ వ్యక్తితో కలిసి డిజిటల్ మీడియా ప్రతినిధుల దందా
- పోలీసులకు సంస్థ ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తితో కలిసి డిజిటల్ మీడియా ప్రతినిధులు హైడ్రా పేరు చెప్పి కొందరు రూ.50 లక్షలు వసూలు చేయడంతో ఆ సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హైడ్రాకు ఫిర్యాదు చేయాలనుకుంటే బుద్ధభవన్‌లోని సంస్థ కార్యాలయంలో అధికారులను నేరుగా సంప్రదించాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణిలో ఆక్రమణలు, కబ్జాలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. హైడ్రా అధికారులు బంధువులు, మిత్రులు, సన్నిహితులు.. మీ పనులు చేయిస్తామంటూ కొందరు వ్యక్తులు ప్రజలను మభ్యపెట్టి.. అక్రమార్జనకు పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసపోవద్దని సూచించారు.



'వెలుగు'లోకి మోసం

తుక్కుగూడ మునిసిపాలిటీ మంఖాల్ గ్రామం పరిధిలో వర్టెక్స్ నిర్మాణ సంస్థ లే అవుట్ అభివృద్ధి చేసింది. సూరం చెరువును ఆక్రమించడంతో పాటు కొత్తకుంటలో మట్టిపోసి బాక్స్ డ్రైన్ నిర్మించిందనే ఫిర్యాదు హైడ్రాకు అందింది. విచారణ చేపట్టిన హైడ్రా నిర్మాణ సంస్థపై రెండు కేసులు నమోదు చేసింది. తమ భూమిని ఆక్రమించి వర్టెక్స్ సంస్థ రోడ్డు నిర్మించిందని చైతన్యరెడ్డి హైడ్రాకు ఫిర్యాదు చేశాడు. ఇరు పక్షాలతో అధికారులు మాట్లాడారు. ఈ క్రమంలో ఫిర్యాదుకు సంబంధించి ఓ వ్యక్తికి రూ.50 లక్షలు ఇచ్చానని చెప్పాడు. దీనిపై సమగ్ర విచారణ జరిపిన హైడ్రా.. హైకోర్టు బార్ కౌన్సిల్ నుంచి తొలగించిన ఓ వ్యక్తి, అందరి జీవితాల్లో 'వెలుగు'లు నింపుతామనే ఓ డిజిటల్ మీడియా రిపోర్టర్, మరో డిజిటల్ మీడియా ప్రతినిధి కలిసి డబ్బులు తీసుకున్నట్టు నిర్ధారణకు వచ్చారు. రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు ఆ ముగ్గురిపై పహడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కొత్త ఎస్టీపీల పనులు ప్రారంభమవ్వాలి

- సమీక్షా సమావేశంలో ఎండీ అశోక్‌రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దసరాలోపు కొత్త సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల(ఎస్టీపీల) నిర్మాణ పనులను ప్రారంభించాలని వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో అమృత్ 2.0 పథకంలో భాగంగా కొత్తగా చేపట్టే 39 ఎస్టీపీల నిర్మాణంపై గురువారం సమీక్ష నిర్వహించారు. భూవివాదాలు లేకుండా భూమి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఎస్టీపీల నిర్మాణానికి ప్లాన్లను వెంటనే ఖరారు చేయాలని ఎండీ ఆదేశించారు. భూ వివాదాలు ఉన్న ప్రాంతాల్లో స్థానిక కలెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని ఎస్టేట్ ఆఫీసర్‌కు సూచించారు. తక్కువ స్థలంలో ఎక్కువ సామర్థ్యం గల ఎస్టీపీలను నిర్మించే అవకాశాలను అధ్యయనం చేయాలని అన్నారు. వీలైనంత త్వరగా భూ పరీక్షలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్ సుదర్శన్, సీజీఎంలు పద్మజ, సుజాత, వాస సత్యనారాయణ, ఈవో విజయ కుమారి, జీఎంలు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్టీపీలను నిర్మించే ప్రాంతాలివే

అమీన్‌పూర్, తెల్లాపూర్, ఇక్రిసాట్, ఉప్పేబావి, బాచుగూడ, తిమక్క చెరువు, గాంధీ గూడెం, పీర్జాదిగూడ, నాగారం, నార్సింగ్ (ఓఆర్ఆర్), సొంగం (బాపూఘాట్), హైదర్షాకోట, ఫతేనగర్, చిత్రపురి కాలనీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, మీర్‌పేట్, మాసబ్‌చెరువు, కాప్రా, రవిర్యాల్, బొంగులూరు

లాభాలు 800 శాతం గ్యారెంటీ

- ట్రేడింగ్ పేరుతో రూ.7.60 లక్షలు కాజేసిన నేరగాళ్లు



హైదరాబాద్ సిటీ, ఆక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ ద్వారా ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తే 800 శాతం లాభాలు గ్యారెంటీ అంటూ నగరవాసిని ముంచిన సైబర్ నేరగాళ్లు రూ.7.60 లక్షలు కాజేసినట్లు పోలీసులు తెలిపారు. బోరబండకు చెందిన యువకుడిని సంప్రదించిన సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు సంపాదించవచ్చని తెలిపారు. స్టాండర్డ్ చార్టెడ్ బ్యాంకు వెబ్‌సైట్‌ను పోలిన నకిలీ సెబీ అనుమతి పత్రాలను చూపించారు. అతడిని 54 స్టాండర్డ్ చార్టెడ్ ఇండియా ఇన్వెస్ట్‌మెంట్ వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. స్వల్ప కాలంలో పెట్టిన పెట్టుబడికి 800 శాతం లాభాలు వచ్చినట్లుగా అందులో పోస్టులు పెట్టారు. వారి మాటలు పూర్తిగా నమ్మిన బాధితుడు పలు దఫాలుగా రూ.7.60 లక్షలు వారు సూచించిన ఖాతాలకు బదిలీ చేశాడు. పెట్టుబడికి లాభాలతో కలిపి రూ.47 లక్షలు వచ్చాయని యాప్‌లో చూపుతున్నప్పటికీ, విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకుండా పోయింది. మరో రూ.9 లక్షల పెట్టుబడితోపాటు లాభంలో 25 శాతం చెల్లిస్తేనే విత్‌డ్రాకు అనుమతిస్తామని చెప్పడంతో ఇదంతా మోసమని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

4400 చ.గల పార్కు స్థలం కాపాడిన హైడ్రా

● బండ్లగూడ జాగీర్‌లో కబ్జాల తొలగింపు


హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా బండ్లగూడ జాగీర్‌లో 4400 చదరపు గజాల పార్కు స్థలాన్ని గురువారం హైడ్రా కాపాడింది. సర్వే నెంబర్లు 96/2, 96/3లోని 125 ఎకరాల విస్తీర్ణంలో 582 ప్లాట్లతో పీఅండ్‌టీ కాలనీ పేరిట 1989లో లే అవుట్ అభివృద్ధి చేశారు. ఇందులో ఓ చోట 1200 చ.గ, 3200 చ.గ పార్కు స్థలం ఉంది. ఈ రెండు పార్కు స్థలాలను అభివృద్ధి చేసేందుకు వీలులేకుండా కబ్జా చేసిన వారు అడ్డుకుంటున్నారు. స్థానిక మునిసిపల్ అధికారులు పార్కు స్థలాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే ప్రయత్నం చేయగా కబ్జాదారులు అడ్డుకున్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ వివాదంపై ఇటీవల ప్రజావాణిలో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా.. రెవెన్యూ, మునిసిపల్ అధికారులతో కలిసి సమగ్ర విచారణ చేపట్టింది. అవి పార్కు స్థలాలుగా నిర్ధారణ కావడంతో గురువారం ఆక్రమణలు తొలగించారు. వెంటనే ఆ స్థలాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. పార్కు స్థలాలను హైడ్రా కాపాడిందని పేర్కొంటు బోర్డులు ఏర్పాటు చేశారు.

2గంటలు ఆలస్యంగా నాగ్‌పూర్ వందేభారత్

● సాంకేతిక లోపాలు తలెత్తడమే కారణమంటున్న సిబ్బంది

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ వెళ్లాల్సిన వందేభారత్ రైలు గురువారం రెండు గంటల ఆలస్యంగా బయల్దేరింది. మధ్యాహ్నం ఒంటిగంటకు బయల్దేరాల్సిన వందే భారత్ కోసమని ప్రయాణికులు సికింద్రాబాద్ స్టేషన్‌లో పడిగాపులు కాశారు. అయితే అది 3.09గంటలకు బయల్దేరింది. నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు రావాల్సిన వందేభారత్ 2.30గంటలు ఆలస్యంగా రావడంతో సికింద్రాబాద్ నుంచి వెళ్లాల్సిన వందేభారత్ ఆలస్యమైందని స్టేషన్ అధికారులు చెబుతున్నారు. మరోవైపు నాగ్‌పూర్‌లో ఉదయం 5గంటలకు బయల్దేరాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో మెకానికల్ సిబ్బంది రెండున్నర గంటల పాటు శ్రమించి సరిదిద్దారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లలో తరచూ సాంకేతిక లోపాలు తలెత్తుతుండడం పట్ల ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు రైళ్ల సమయ పాలనపై దృష్టి సారించాలని ప్రయాణికుల సంఘాలు డిమాండ్ చేశాయి.


కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు


దుర్గంచెరువులో గణేశ్ ప్రతిమలను నిమజ్జనం చేస్తున్న సిబ్బంది


వినాయక నిమజ్జన ర్యాలీల ప్రభావంతో మాదాపూర్‌లో భారీ సంఖ్యలో నిలిచిపోయిన వాహనాలు

మహా నిమజ్జనం.. సర్వం సిద్ధం

(3వ పేజీ తరువాయి)

20 ప్రాంతాల్లో భారీ విగ్రహాల నిమజ్జనం జరగనుంది. మొత్తంగా 134 మొబైల్, 259 స్టాటిక్‌తో కలిపి 403 క్రేన్లు ఏర్పాటు చేశారు. ఇందులో సాగర తీరం చుట్టూ 30 వరకు క్రేన్లు ఉన్నాయని ఓ అధికారి చెప్పారు. ఇప్పటికే 1.25 లక్షల విగ్రహాలు (చిన్నవి, పెద్దవి) నిమజ్జనమైనట్టు జీహెచ్ఎంసీ పేర్కొంది.

303 కి.మీల శోభాయాత్ర

బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు 19 కి.మీల ప్రధాన మార్గంతో పాటు.. గ్రేటర్ వ్యాప్తంగా 303 కి.మీల మేర శోభాయాత్ర జరగనుంది. ఈ మార్గాల్లో ఇప్పటికే 11,442 గుంతలు పూడ్చామని బల్దియా ప్రకటించింది. పారిశుధ్య నిర్వహణ కోసం 160 గణేశ్ యాక్షన్ టీంలు అందుబాటులో ఉండనున్నాయి. 14,486 మంది పారిశుధ్య కార్మికులు నిమజ్జనం రోజున విధుల్లో ఉంటారు. శోభాయాత్ర మార్గాల్లో అదనపు విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. సాగర్‌లో తొమ్మిది బోట్లు, ఇతర ప్రాంతాల్లోనూ బోట్లతో పాటు గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారు.

ఆపరేషన్ ఖైరతాబాద్

ఖైరతాబాద్‌లోని విశ్వశాంతి మహాశక్తి గణపతి నిమజ్జనంపై ప్రభుత్వ విభాగాలు ప్రత్యేక దృష్టి సారించాయి. నిమజ్జన ఘట్టంలో కీలకమైన ఈ ఏకదంతున్ని గంగ ఒడికి తరలించేందుకు కొన్నేళ్లుగా ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో రేపు కూడా మధ్యాహ్నం 1.30 గంటల వరకు మహా గణపతి నిమజ్జనం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దాంతోపాటు బాలాపూర్ గణపతి కూడా సాయంత్రం లోపు సాగర తీరానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్టు పోలీసులు తెలిపారు.

25 అడుగుల లోతు పూడికతీత

మహా గణపతి నిమజ్జనం సందర్భంగా హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో హుస్సేన్‌సాగర్‌లో 25 అడుగుల లోతు వరకు పూడిక తీశారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి నుంచి గణనాథుడి ఎత్తు, వెడల్పు ఇలా కొలతలు తీసుకొని ఆ మేరకు పూడిక తీత ప్రక్రియను పూర్తి చేశారు. గురువారం వరకు 2వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగించారు.

శోభాయాత్రకు పుష్కలంగా నీళ్లు

మహా నిమజ్జనం రోజున భక్తులకు తాగునీటికి ఢోకా లేకుండా వాటర్‌బోర్డు చర్యలు చేపట్టింది. అధికారులు నగరవ్యాప్తంగా 123 వాటర్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. 35 లక్షల వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నారు. శోభయాత్ర కొనసాగే ప్రాంతాల్లో మ్యాన్‌హోల్ మూతలు పరిశీలించి అవసరమైన చోట్ల మరమ్మతు పనులు పూర్తి చేశారు. వాటర్ లీకేజీలు, సీవరేజీ ఓవర్‌ఫ్లోలు లేకుండా తగు చర్యలు చేపడుతున్నారు.

విద్యుత్‌శాఖ కంట్రోల్ రూమ్

హుస్సేన్ సాగర్ వద్ద దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమును గురువారం సంస్థ డైరెక్టర్‌లు నర్సింహులు, చక్రపాణి, కృష్ణారెడ్డి ప్రారంభించారు. దాదాపు 9 వేల మంది సిబ్బంది, అధికారులు నిమజ్జనం ముగిసేవరకు విధుల్లో ఉంటారని తెలిపారు.

44 వైద్య ఆరోగ్య శిబిరాలు

నిమజ్జనం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటి తెలిపారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు పరిసరాల అన్ని మార్గాల్లో దాదాపు 44 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అత్యవసర పరిస్థితులో రోగులను ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు తరలించడానికి అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

30 వేల మంది సిబ్బందితో బందోబస్తు

నిమజ్జనం రోజున 30 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. పోలీసు విభాగాల సిబ్బంది. పారామిలిటరీ, రిజర్వ్ ఫోర్స్‌తో పాటు జిల్లాల నుంచి పోలీసు సిబ్బంది, అధికారులతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. నిమజ్జనాల మధ్యలో ప్రవక్త పుట్టిన రోజు (మిలాద్‌ఉల్‌నబీ) రావడంతో పాటు నిమజ్జనానికి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యటన సందర్భంగా బలగాలను అప్రమత్తం చేశారు. దాదాపు 40 గంటల పాటు జరిగే నిమజ్జనాన్ని ఉన్నతాధికారులు కమాండ్ కంట్రోల్ రూము ద్వారా పర్యవేక్షిస్తారు. కాగా, సెప్టెంబరు 6 ఉదయం 6 గంటల నుంచి 7వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు నగరంలో మద్యం, కల్లు, విక్రయాలు నిలిపి వేయాలని సీపీలు ఆదేశించారు.

ట్రాఫిక్ ఆంక్షలు.. మళ్లింపులు



గణపతి నిమజ్జన రూట్ మ్యాప్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీ నిమజ్జనం సందర్భంగా పలు రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. 7వ తేదీ సాయంత్రం వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని అన్నారు. ప్రధానంగా బాలాపూర్ నుంచి కట్టమైసమ్మ టెంపుల్, గుర్రం చెరువు, చార్మినార్, మదీన, అఫ్జల్‌గంజ్, ఎస్ఏ బజార్, ఎంజే మార్కెట్, ఆబిడ్స్, బషీర్‌బాగ్ లిబర్టీ మీదుగా ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ నుంచి సంగీత్, ప్యాట్నీ, ప్యారడైజ్ తదితర ప్రాంతాల్లో ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఎర్రగడ్డ వైపు నుంచి వచ్చే వాహనాలు ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్ మీదుగా ట్యాంక్ బండ్ వైపునకు చేరుకుంటాయి. కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువుకు ఇతర వాహనాలను అనుమతించరు. కూకట్‌పల్లి నుంచి మాదాపూర్ వైపు వచ్చే వాహనాలను జేఎన్‌టీయూ మీదుగా మాదాపూర్ వైపు మళ్లిస్తారు. హైటెక్ సిటీ నుంచి కూకట్‌పల్లి వెళ్లే వాహనాలను రెమిడీ ఆస్పత్రి వైపు పంపుతారు. ప్రగతి నగర్‌లో శ్రీనివాస స్టీల్స్ నుంచి మూడు కోతుల బొమ్మవరకు రోడ్డును మూసివేస్తారు. గండిమైసమ్మ నుంచి బాలానగర్ వైపుకు వెళ్లే వాహనాలను బహదూర్‌పల్లి జంక్షన్ వద్ద మళ్లిస్తారు. గచ్చిబౌలి నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లే వాహనాలను ఎగ్జిట్ 17 నుంచి దారి మళ్లిస్తారు.

గణేశ్ నిమజ్జనానికి 600 ప్రత్యేక బస్సులు

గణేశ్ నిమజ్జనాల నేపథ్యంలో శనివారం నగరంలోని ముఖ్య ప్రాంతాల నుంచి ఖైరతాబాద్, లక్డీకపూల్, బషీర్‌బాగ్, పాత ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రాంతాలకు 600 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఈడీ రాజశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నిమజ్జనాలు చూసేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. గ్రేటర్‌లోని 31 ప్రాంతాల నుంచి స్పెషల్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు, రద్దీ ప్రాంతాల్లో సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. ప్రత్యేక బస్సుల వివరాల కోసం కోఠి బస్ స్టేషన్(9959226160) రేతి ఫైల్ బస్ స్టేషన్ (9959226154) నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఓయూ పరిధిలో పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్‌లోని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఓయూలో జరగాల్సిన పరీక్షలు వాయిదా వేసినట్లు అకారులు పేర్కొన్నారు. పీజీ కోర్సుల్లో మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూమెంట్ పరీక్షలతో పాటు, బీఈడీ రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వాయిదా వేశారు. నూతన తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

ఏజెన్సీ ప్రాంత దళితులకు రాజ్యాంగ హక్కులు కల్పించాలి

● సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్.

పంజాగుట్ట, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంత దళితులకు రాజ్యాంగ హక్కులు కల్పించాలని, లేకుంటే తిరుగుబాటు ఉద్యమం తప్పదని వక్తలు హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంత దళితుల రాజ్యాంగ హక్కుల సాధనపై గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సమితి జాతీయ అధ్యక్షుడు జేబీ రాజు, మాస్టర్ జీ, ఆల్ ఇండియా దళిత సేన ప్రధాన కార్యదర్శి వై.బాలరాజు,డాక్టరు సయ్యద్ జాంగీర్ హుస్సేన్, దళిత సేన అధ్యక్షుడు జేమ్స్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏజెన్సీ ప్రాంత జిల్లాలో ఎస్సీ కులాలకు ఉద్యోగ, ఉపాధి, స్థానిక సంస్థల ఎన్నికలలో రాజ్యాంగపరమైన రిజర్వేషన్‌తో పాటు నివాసముంటున్న ఇంటిపైన, సాగు చేస్తున్న భూములపైన ఎటువంటి హక్కులు లేకుండా అంధకారంలోకి నెట్టివేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడ రమేష్, నాయకులు కృపాకర్, ఆవులయ్య, డి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మిలాద్-ఉన్-నబీ ర్యాలీ 14కు వాయిదా

చార్మినార్ సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5న మిలాద్-ఉన్-నబీ 6న గణేశ్ నిమజ్జనోత్సవం ఉన్న నేపథ్యంలో పోలీస్ అధికారుల సూచన మేరకు ముస్లిం మతపెద్దలు మిలాద్-ఉన్-నబీ ఊరేగింపును ఈ నెల 14కు వాయిదా వేశారు. గత రెండు సంవత్సరాలుగా గణేశ్ నవరాత్రి ఉత్సవలు మిలాద్-ఉన్-నబీ ఒకేసారి వస్తుండడం గమనార్హం. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుకోకుండా దక్షిణ మండలం పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

వందశాతం వసూళ్లపై దృష్టి పెట్టండి

● మునిసిపల్ పరిపాలన శాఖ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ఆస్తిపన్నును వందశాతం వసూలు చేసే విషయంలో దృష్టి పెట్టాలని మునిసిపల్ పరిపాలన శాఖ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు అధికారులకు సూచించారు. 100 రోజుల పట్టణ ప్రణాళికలో భాగంగా గురువారం పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలో నిర్వహించిన కార్యక్రమాల్లో జేడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుంట్లూర్‌లో పట్టణ మహిళ సంఘాలు, రిసోర్స్ పర్సన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహార, వస్తు ఉత్పత్తుల స్టాల్‌లను ఆయన పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా కుంట్లూర్ రోడ్డులో మొక్కలు నాటారు. అనంతరం జేడీ నారాయణరావు మాట్లాడుతూ ఆస్తిపన్నుతో పాటు ట్రేడ్ లైసెన్సుల ద్వారా వసూలులో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సింగిరెడ్డి రవీందర్ రెడ్డితో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలు వారం రోజుల్లో చెల్లించాలి

● రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

రాంనగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.6 వేల కోట్లు వారం రోజుల్లో చెల్లించకపోతే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కలకు ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని ఆరోపించారు. ఫీజు బకాయిల కోసం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలను ఘెరావ్ చేసే కార్యక్రమం చేపడతామన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు లాల్‌కృష్ణ, నీల వెంకటేష్, సి.రాజేందర్, జి.రాజ్‌కుమార్, మోదీ రాందేవ్, మధుసూదన్‌రావు, లింగయ్యయాదవ్, నిఖిల్ పటేల్, కౌశిల్ పాల్గొన్నారు.

పాత కక్షలతో ఒకరి హత్య

● ఇద్దరు నిందితుల అరెస్ట్


హత్యకు గురైన సైఫ్ అహ్మద్ ఖాన్


నిందితులు మహ్మద్ సైఫుద్దీన్ అలియాస్ ఫైజాన్, మహ్మద్ జాబిలు

రాజేంద్రనగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తన తల్లిని అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా తనను ఒకసారి కొట్టాడని అతడిపై పగ పెంచుకున్నాడు. అతడు తన స్నేహితుడితో కలిసి ఆ వ్యక్తిని హత్య చేశాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి రాజేంద్రనగర్ నౌసెంబర్ హర్షమహల్ ఈద్గా వద్ద జరిగింది. హత్య జరిగిన 24 గంటలలోపు అత్తాపూర్ పోలీసులు, రాజేంద్రనగర్ ఎస్ఓటీ జోన్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి ఒక కత్తి, ఒక ఎఫ్‌జెడ్ ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పుర కిషన్‌బాగ్‌కు చెందిన సైఫ్ అహ్మద్ ఖాన్ (23) అర్బన్ క్లాంప్‌లో ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ సైఫుద్దీన్ అలియాస్ ఫైజాన్ (24)తో అతడికి స్నేహం ఉంది. ఒక విషయంలో సైఫుద్దీన్ తల్లిని సైఫ్ అహ్మద్ ఖాన్ అసభ్య పదజాలంతో దూషించాడు. దీనికి తోడు మూడు నెలల క్రితం సైఫుద్దీన్‌ను కొట్టాడు. ఇది మనసులో పెట్టుకున్న సైఫుద్దీన్ ఎలాగైనా సైఫ్ అహ్మద్‌ఖాన్‌ను మట్టుబెట్టాలని కక్ష పెంచుకున్నాడు. అందుకోసం కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ జాబి (19) సహాయం కోరాడు. బుధవారం రాత్రి 8:30 గంటల సమయంలో సైఫ్ అహ్మద్ ఖాన్ హర్షమహల్ ఈద్గా వద్ద ఒంటరిగా ఉండడాన్ని గమనించి అక్కడకు వెళ్లి అతడితో గొడవపడ్డారు. మహ్మద్ జాబీ పదునైన కత్తితో సైఫ్ అహ్మద్ ఖాన్‌ను కడుపులో పొడిచాడు. ఆ తర్వాత అదే కత్తిని సైఫుద్దీన్ తీసుకుని సైఫ్ అహ్మద్ ఖాన్‌ను విచక్షణారహితంగా పొడిచాడు. ఛాతి, కడుపు, మెడ, ముంజేయి దగ్గర కత్తిపోట్లు జరిగి తీవ్ర రక్త స్రావం అయింది. బాధితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సైఫ్ అహ్మద్ ఖాన్ మరణించాడు. హత్య జరిగిన విషయాన్ని తెలుసుకున్న అత్తాపూర్ పోలీసులు, రాజేంద్రనగర్ ఎస్ఓటీ జోన్ పోలీసులు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్ పర్యవేక్షణలో హత్యకు పాల్పడిన సైఫుద్దీన్ అలియాస్ ఫైజాన్, మహ్మద్ జాబీలను అరెస్ట్ చేశారు. వారిని రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు దర్యాప్తు చేస్తున్నారు.

జైజై గణేశా!

చార్మినార్, రాజేంద్రనగర్, చాంద్రాయణగుట్ట, గోషామహల్ నియోజకవర్గాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆయా నియోజకవర్గాల్లో కొలువుదీరిన గణనాథులను గురువారం ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు, భక్తులు దర్శించుకున్నారు.

– అబిడ్స్, చార్మినార్ జోన్ బృందం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి)



గన్‌ఫౌండ్రీలో ది ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుమారస్వామి అవతారంలో నెమలిపైన ఉన్న గణేశుడు భక్తులకు అమితంగా ఆకట్టుకుంటున్నాడు



రిసాల యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌడుగు గోపీ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో పూజలో పాల్గొన్న రామ్, కిట్టు, లక్ష్మీనారాయణ, వంశీ, సత్యనారాయణ



బేగంబజార్‌లో రంగ్ ఇన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో పూజలు చేసిన భవానీ శంకర్ చౌదరి, విజయ్ శంకర్‌చౌదరి, సత్యనారాయణ, భగత్, బజ్జు పహిల్వాన్



రాజేంద్రనగర్ పత్తికుంట వద్ద వినాయక నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తదితరులు



శ్రీశక్తి గణపతి టెంపుల్ ఛత్రినాక వద్ద ఉన్న గణేశ్ మండపంలో జరిగిన ప్రత్యేక పూజలో పాల్గొన్న సౌత్ జోన్ డీసీపీ స్నేహా మెహ్రా, ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌వర్మ, బీజేపీ నాయకుడు దినేష్ అంబారే, నాయకులు రఘు, రాహుల్‌షిండే, రాకేశ్ షిండే



కాటేదాన్ బంగారు మైసమ్మ ఆలయం వినాయకుడి లడ్డూను రూ.2,25,000లకు వేలంలో దక్కించుకున్న ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ చైర్మన్ సంకూరి జయప్రకాశ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



మైలార్‌దేవుపల్లి హనుమాన్ ఆలయంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిని సన్మానిస్తున్న భక్తులు



మైలార్‌దేవుపల్లిలోని వినాయకుడిని దర్శించుకున్న బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, నాయకులు

పత్తికుంట, పల్లెచెరువులో నిమజ్జనం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్, మాణిక్యమ్మ కాలనీ, అంబేడ్కర్‌నగర్, బుద్వేల్, సాయి క్రిష్ణకాలనీ, శ్రీ శివసాయి కాలనీ, భాగవతీగూడ, ఉప్పర్‌పల్లి, ప్రేమావతిపేట్, శివరాంపల్లి, కాటేదాన్, టీఎన్‌జీవోస్ కాలనీ తదితర ప్రాంతాలలో ప్రతిష్ఠించిన గణనాథులను పత్తికుంట, పల్లెచెరువులో నిమజ్జనం చేశారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన వినాయకుడి ఊరేగింపు, నిమజ్జనోత్సవాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి పర్యవేక్షించారు. రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ కె. శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్, రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్‌తో పాటు ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

● తమ ఇంటి దైవమైన కాటేదాన్ బంగారు మైసమ్మ దేవాలయంలో జరిగిన వినాయక లడ్డూ వేలంలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పాల్గొన్నారు. ఇందిరా గాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ చైర్మన్, పద్మశాలి సంఘం నాయకుడు సంకూరి జయప్రకాశ్ రూ.2,25,000కు వినాయక లడ్డూను వేలంలో సొంతం చేసుకున్నారు. ఈయన 2023లో రూ.1,80,000లకు, 2024లో రూ.2,01,600లకు కాటేదాన్ బంగారు మైసమ్మ ఆలయం వినాయకుడి లడ్డూను దక్కించుకొని హ్యాట్రిక్ కొట్టారు.

భజన కళాకారులకు సన్మానం

గణేశ్ మండపాల వద్ద భజనలు చేస్తూ అందరినీ ఆకట్టుకుంటున్న భజన కళాకారులను రాజేంద్రనగర్ శ్రీవేంకటేశ్వర యూత్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం రాత్రి సన్మానించారు. కవి, రచయిత, గాయకులు మన్నె మహాత్మారావు, జి.రాములు నేతృత్వంలో భజన కళాకారులను సన్మానించారు. సంఘం అధ్యక్షుడు వేముల శ్రీనివాస్, వేముల రామక్రిష్ణ, వేముల రమేశ్, కొమిరె శంకర్, వేముల శేఖర్ పాల్గొన్నారు.



భజన కళాకారులను సన్మానించిన రాజేంద్రనగర్ శ్రీ వెంకటేశ్వర యూత్ అసోసియేషన్ సభ్యులు



శివానగర్ హరిహర తేజ నివాస్ అపార్ట్‌మెంట్‌లోని గణేశుడికి పూజలు చేసిన స్థానికులు



టీఎన్‌జీవోస్ కాలనీలో గణనాథుడిని దర్శించుకున్న బీజేపీ నాయకులు సూరెడ్డి వినయ్ రెడ్డి, నర్సిరెడ్డి



ఛత్రినాక మిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో గణపతికి పూజలు చేసిన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ క్రాంతికుమార్, సభ్యులు ఆదిత్య, కోటేశ్, నితిన్



హిందీనగర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో పూజలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ధన్‌రాజ్ తదితరులు



మధుబన్ కాలనీలో వినాయక మండపం ఆవరణలో తాండవ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు



బాలాపూర్ గణేశుడికి పూజలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ దంపతులు



రామ్‌సింగ్‌పురాలోని చారిత్రక వినాయకుని దేవాలయంలో పూజలో పాల్గొన్న ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ మిత్ర కృష్ణ, అభిషేక్ మిత్ర, పురుషోత్తమ్ సింగ్, ఉమేశ్ తదితరులు



శివరాంపల్లి హనుమాన్ ఆలయంలోని గణనాథుడి లడ్డూను రూ. 1,10,000కు దక్కించుకున్న స్వప్నారెడ్డి



గోషామహల్‌లోని సామాజికవేత్త సురేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో పూజలు చేస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, రమేశ్ గుప్తా, వాసుదేవ్ తదితరులు



పురానాపూల్ కార్వాన్ ఆర్యవైశ్య సంఘంలో రూ. 1.51 లడ్డూను సొంతం చేసుకున్న బొజ్జా వెంకటేశ్, మాడిశెట్టి సందానందం గుప్తాలు



న్యూ ఉస్మాన్‌గంజ్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకుడు సంతోష్ గుప్తా, జైపాల్, సాయి సుచీర్, లకన్ సింగ్, అశోక్



పటేల్‌నగర్ శ్రీరామ భక్త సమాజం న్యూ హనుమాన్ ఆలయం గణపతి లడ్డూను రూ. 43 వేలకు దక్కించుకున్న కందికంటి మహేందర్ గౌడ్

సెయింట్ ఆన్స్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కార్వాన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ కాలేజీలో సెయింట్ ఆన్స్ ఇంక్యుబేషన్ ఫౌండేషన్‌ను గురువారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెయింట్ ఆన్స్ కాలేజీ ఫర్ ఉమెన్ ఇంక్యుబేషన్ ఫౌండేషన్‌ను తన చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఇచ్చే శిక్షణను తీసుకొని మంచి ఉద్యోగాలే కాకుండా సొంతంగా వ్యాపార రంగాల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ఎ.విజయ్ రాణి, పరిశ్రమ నిపుణులు, ఇంక్యుబేషన్ సెంటర్ కన్వీనర్ డాక్టర్ సుమరెడ్డి, కో కన్వీనర్ నీరజ, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధింబర్ బజార్ స్వర్ణకార సొసైటీ కార్యవర్గం ఎన్నిక

అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్వర్ణకార సొసైటీ అభివృద్ధికి ఎన్నికైన నూతన కార్యవర్గం కృషి చేయాలని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవచారి అన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి సిద్ధింబర్ బజార్‌లోని బాలాజీ కాంప్లెక్స్‌లో సిద్ధింబర్ బజార్ స్వర్ణకార సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిగా బొడ్డుపల్లి రఘుచారి, ప్రధాన కార్యదర్శిగా కీర్తిగారి శ్రీనివాస్ చారి, కోశాధికారిగా మంచోజు సంతోష్‌చారి, ఉపాధ్యక్షులుగా ఉప్పల వేణుగోపాల్‌చారి, సహ కార్యదర్శిగా పోచమ్మకాడి సురేశ్‌చారి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా చీటిమిళ్ల హరీష్‌చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మండలోజు బీష్మచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సంతోష్‌కుమార్, చార్మినార్ సంఘం అధ్యక్షుడు కొండోజు అంజనేయులు, గౌలిగూడ అధ్యక్షుడు ప్రసాద్, దిల్‌సుఖ్‌నగర్ మాజీ అధ్యక్షుడు కీర్తిగారి అనంతచారి, ఎన్నికల కమిటీ సభ్యులు వలబోజు శ్రీనివాస్‌చారి, చేపూరి ప్రభాకర్, మైలారం మోహనచారి, బి.దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నర్సింహ

బర్కత్‌పుర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ విజ్ఞప్తి చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయ వ్యవస్థలో గొప్ప అనుభవం ఉన్న వ్యక్తిని ఉప రాష్ట్రపతిగా గెలిపిస్తే పౌర ప్రజాస్వామ్య హక్కులను కాపాడబడతాయన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని ఎంపీలు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఛాయా దేవి, నగర కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్, నళిని, శ్రీకాంత్, శ్రీనివాస్, షేక్ షంషుద్దీన్, వెంకటస్వామి, మహ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలి

● టీ పీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు రవికుమార్

బర్కత్‌పుర, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు చేసిన అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విచారణ జరిపించాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతితో పాటు రాష్ట్రంలో జరిగిన పలు అక్రమాలపై కూడా ప్రభుత్వం స్పందించాలని కోరారు. గురువారం బషీర్‌బాగ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేవలం మాజీ మంత్రి హరీష్ రావు, ఎంపీ సంతోష్‌రావుపై ఆరోపణలు చేశారని, కేటీఆర్, కేసీఆర్‌లు కూడా అవినీతి, అక్రమాలలో భాగస్వాములేనని ఆరోపించారు. ఇసుక మాఫీయాపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. యువత ఇప్పటికైనా మేల్కొని రాజకీయాల్లోకి రావాలని, అవినీతి లేని తెలంగాణను నిర్మించుకోవాలన్నారు.

గీత కార్మికులకు 50 శాతం మద్యం షాపులు కేటాయించాలి

● జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్

బర్కత్‌పుర, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 50 శాతం మద్యం దుకాణాలు గీత కార్మికులకు కేటాయించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వం గీత కార్మికులకు మద్యం షాపులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని, దానిని నిలబెట్టుకోవాలని కోరారు. గురువారం మోతిమార్కెట్‌లోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెట్ల నుంచి కింద పడి గాయపడి ప్రాణాలు కోల్పోయిన గీత కార్మికులకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం పెండింగ్‌లో ఉందని, ఈ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. 560 జీవో ప్రకారం రాష్ట్రంలోని గీత సొసైటీలకు 5 ఎకరాల భూమి కేటాయించి తాటి, ఈత చెట్ల పెంపకానికి కృషి చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిరుపేద గౌడ కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

మాధవికి తెలుగు వర్సిటీ డాక్టరేట్



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల ఆషాఢ బోనాలకు అనేక శతాబ్దాల చరిత్ర, దానికి సంబంధించిన విలక్షణమైన సంస్కృతి ఉంది. దీనిపైన సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయంలోని వరంగల్లు జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో పరిశోధన చేసిన కె.మాధవికి విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఆచార్య భట్టు రమేష్ పర్యవేక్షణలో మాధవి పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్టు విశ్వ విద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ కోట్ల హనుమంతరావు అధికారిక ప్రకటన జారీ చేశారు. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాధవి ప్రాచీన సంస్కృతికి ప్రతీకగా హైదరాబాద్ జంట నగరాల్లో ఆషాఢ మాసంలో ఘనంగా జరుపుకొనే బోనాల ఉత్సవాలపై ఒక సమగ్రమైన పరిశోధన చేశారు.

రంజింపజేసిన రసభైవా నృత్యాంశాలు



నృత్య ప్రదర్శనలో కళాకారులు

రవీంద్రభారతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): భరతనాట్యంలో అల్లూరి సీతారామరాజు జీవితాన్ని ఆవిష్కరిస్తూ, ఒడిస్సీ నృత్యంలో భగవద్గీత మహత్యాన్ని ప్రదర్శిస్తూ సాగిన నృత్యాంశాలు ప్రేక్షకుల్ని రంజింపజేశాయి. గురువారం రవీంద్రభారతిలో ఒరిస్సా డాన్స్ అకాడమీ భువనేశ్వర్ ఆధ్వర్యంలో 'రసభైవా' శీర్షికన ప్రత్యేక నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. కళాకారులు చారిత్రకమైన నృత్యాంశాలను ప్రదర్శించారు. వారసత్వం, చరిత్ర సజీవంగా ఉంది అనేలా ఈ రెండు నృత్యాల కళాకారులు ప్రదర్శించారు. ప్రముఖ నాట్య గురువు పద్మశ్రీ డాక్టర్ ఆనంద్ శంకర్ జయంత్ నృత్య దర్శకత్వంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను భరతనాట్యంతో వివరించారు. దేశభక్తిని చాటుతూ సాగిన ఈ ప్రదర్శనలో 23 మంది కళాకారులు నృత్యం చేశారు. మార్షల్ ఆర్ట్స్, థ్రిల్లింగ్ ఫైట్ సన్నివేశాలతో కలిపి ఈ నృత్యాన్ని చేశారు. ఒడిస్సీ డ్యాన్స్ అకాడమీ భువనేశ్వర్ నుంచి వచ్చిన పద్మశ్రీ డాక్టర్ అరుణ మొహంతి దర్శకత్వంలో గీత మహత్యం నృత్యాన్ని ప్రదర్శించారు. భగవద్గీత తత్వశాస్త్రం జీవితాలకు సంబంధించిందని కళాకారులు నృత్యంతో ప్రేక్షకులకు చూపించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా డాక్టర్ చక్రవర్తి, జి.అన్నారావు జ్యోతి తదితరులు హాజరై కళాకారులను అభినందించారు. ఇలాంటి నృత్య ప్రదర్శనలతో మన చరిత్రను వారసత్వాన్ని కాపాడాలని, ప్రేక్షకులకు కళ్ళకు కట్టినట్టుగా చూపించారని కొనియాడారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతలు ఆనంద శంకర్ జయంత్, అరుణ మహంతి ఇద్దరి దర్శకత్వం నృత్యాంశాలు ప్రదరిశంచడం చిరస్మరణీయమైనదని అతిథులు అన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/svc5kr2లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

విశ్వేశ్వర్‌కు సన్మానం



విశ్వేశ్వర్‌ను సన్మానిస్తున్న మహిళా సంఘాలు, సీవోలు, ఆర్‌పీలు

నార్సింగ్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ బ్రాంచ్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన విశ్వేశ్వర్‌కు జగిత్యాల జిల్లా జగ్గసాగర్ బ్రాంచ్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌ను మహిళా సంఘాలు, సీవోలు, ఆర్‌పీలు గురువారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా విశ్వేశ్వర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాత సహకారం



వాసుదేవరెడ్డిని సన్మానిస్తున్న మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్థులు

పహాడిషరీఫ్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో కన్నా విద్యాదానం గొప్పదని మామిడిపల్లి ఉమ్మడి దేవాలయాల కమిటీ అధ్యక్షుడు ఎడ్ల వాసుదేవా రెడ్డి అన్నారు. గురువారం మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గ్రామస్థులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించడానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులకు పాఠశాలలోని సమస్యలపై అడుగగా భౌతిక శాస్త్రం, పీటీ ఉపాధ్యాయుడి కొరత ఉందని విన్నవించారు. వెంటనే ఈ విషయం వైష్ణవి గ్రూప్ డైరెక్టర్ ఎడ్ల కృష్ణారెడ్డికి ఫోన్ ద్వారా తెలుపగా, ఎడ్ల కృష్ణారెడ్డి తమ గ్రామంలోని పాఠశాలకు భౌతిక శాస్త్రం, పీటీ ఉపాధ్యాయులను నియమించుకుంటే సొంత ఖర్చులతో ఇద్దరికీ జీతాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల జీతాలు చెల్లించే బాధ్యతలు తీసుకునందుకు ఉపాధ్యాయులు గ్రామస్తులు వాసుదేవ రెడ్డిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాలాజీ వెంకటేశ్వర ఆలయ చైర్మన్ కళ్లెం నరేష్ గౌడ్, ఎండీ నయీం (అడ్వకేట్), లాల్ సతీష్ గౌడ్, గణేష్ గౌడ్, రంగనాథ్, కృష్ణ, లాల్ విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవం

రాజేంద్రనగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ శ్రీరాంనగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సాంస్కృతిక కమిటీ చైర్మన్ ఎస్‌కే అల్లావల్లి విద్యార్థులకు సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపద్యాయులు శంకర్, ఉపాధ్యాయులు లత, ఆశాజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉపద్యాయులకు గ్రీటింగ్ కార్డులు ఇచ్చి సన్మానించారు.

ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈనెల 10న రాజేంద్రనగర్ మండలంలో నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవానికి హాజరు కావాలని ఎమ్మెల్యేకు మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ ఆహ్వాన పత్రం అందజేశారు.

● మైలార్‌దేవుపల్లి దుర్గా కన్వెన్షన్‌లో రాజేంద్రనగర్ మండల ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా 20 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఎనిమిది మంది ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులను అందజేయనున్నట్టు తెలిపారు.

పాఠశాల కిటికీ అద్దాలను పగలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాజేంద్రనగర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు గదుల కిటికీ అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శీలత కోరారు. ఈ మేరకు గురువారం అత్తాపూర్ పోలీసులకు ఉపాధ్యాయులు శ్రీనివాస్ సాగర్, జ్యోతితో కలిసి ఫిర్యాదు చేశారు. ఎంతో మంది దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేస్తుంటే కొందరు రాత్రి వేళల్లో పాఠశాలలోకి ప్రవేశించి తరగతి గది కిటికీలను ధ్వంసం చేశారని, ఇలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసులు నిఘా పెట్టాలని కోరారు.



కిటికీ అద్దాలను ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

నగరంలో సర్వేపల్లి అడుగుజాడలు

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ ఉపాధ్యాయుడికి నిలువెత్తు నిదర్శనం సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన భాగ్యనగరాన్ని సందర్శించిన సందర్భాలెన్నో. నగర సంస్కృతిని అభిమానించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్న సమయంలో మొట్టమొదటిసారి 1931, జూన్6న సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిలయాన్ని సందర్శించారు. విజ్ఞానానికి కేంద్రబిందువుగా భాషానిలయం దినదినాభివృద్ధి చెందాలని కాంక్షిస్తూ సందర్శకుల సందేశంలో తన అభిప్రాయాన్ని చేవ్రాలుతో రాశారు. అదే సందర్భంలో సీతారాంబాగ్ ఆలయ ప్రాంగణంలో కోయిల్ కందాడై అప్పన్ శఠకోప రామానుజాచార్య నిర్వహణలోని 'ఉభయ వేదాంత వర్ధిని సంస్కృత పాఠశాల'కు వెళ్లి ఉపన్యసించారు.

చారిత్రక భవనాలపై చెరగని ముద్ర

సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతి హోదాలోనూ పలు సార్లు నగరానికి వచ్చారు. 1961, మే 11న రవీంద్రభారతి సభామందిరాన్ని ప్రారంభించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రధాన గ్రంథాలయ భవనాన్ని 1963, ఆగస్టు 3వ తేదీన రాష్ట్రపతి హోదాలో ప్రారంభించారు.

● రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిలో నగరానికి వచ్చినప్పుడు తార్నాకలోని రీజనల్ రీసెర్చ్ లేబరేటరీ (ప్రస్తుతం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ)ని సందర్శించారు. రాష్ట్రపతి నిలయంలో శాస్త్రవేత్తలకు ప్రత్యేకంగా తేనీటి విందు ఇచ్చి వారి పట్ల తనకున్న గౌరవాన్ని ప్రకటించారు. ఆర్ట్స్‌తో పాటు సైన్స్ మీద సర్వేపల్లికి ఉన్న మక్కువ చూసి ఆనాటి శాస్త్రవేత్తలు ఆశ్చర్యం వ్యక్తంచేశారట. రాష్ట్రపతి హోదాలో ఇక్కడికి వచ్చిన సమయంలో సర్వేపల్లి ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో ఆరోగ్య పరీక్షలు చేయించుకునేవారు. ఈ విషయాన్ని ఆయన్ను పరీక్షించిన డా. కాకర్ల సుబ్బారావు ఓ సందర్భంలో చెప్పారు. పంటి నొప్పి లాంటి సమస్యలకు ఇక్కడే చికిత్స తీసుకున్నారు.

సర్వేపల్లి పాస్‌పోర్టు

సర్వేపల్లి కోల్‌కతా విశ్వవిద్యాలయం ఆచార్యుడిగా సేవలందిస్తున్న సమయంలో అంటే 1926లో తొలిసారిగా బ్రిటీషు - ఇండియా పాస్‌పోర్టు పొందారు. అప్పుడు దాని వెల మూడు రూపాయలు. బ్రిటన్, ఇటలీ, ఫ్రాన్స్, అమెరికా, చైనా, జపాన్, ఆస్ట్రేలియా, హంగేరీ, యుగోస్లేవియా, చెకోస్లేవియా దేశాల రాయబార కార్యాలయాల అధికార ముద్రలు అందులో కనిపిస్తాయి.


తార్నాకలోని ఆనాటి రీజనల్ రీసెర్చ్ లేబొరేటరీలో సర్వేపల్లి రాధాకృష్ణన్

ఓయూ గౌరవ డాక్టరేట్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సర్వేపల్లి రాధాకృష్ణన్‌లను ఒకేసారి ఉస్మానియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ప్రఖ్యాత శాస్త్రవేత్త సర్ సీవీ రామన్‌కు శిష్యుడు ఆచార్య సూరి భగవంతం ఓయూ వైస్ ఛాన్సలర్‌గా సేవలందిస్తున్న సమయంలో 1953, జనవరి 12న ఆ ఇరువురు వైతాళికులకు డీలిట్‌ను ప్రదానం చేసినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది.

గురుపూజోత్సవాన్ని(సెప్టెంబరు 5) పురస్కరించుకుని పలువురు ఐఏఎస్ అధికారులు 'ఆంధ్రజ్యోతి'తో తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. టీచర్స్‌డే రోజు టీచర్లుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పామని చెప్పుకొచ్చారు.

వారిద్దరంటే ఇష్టం



ప్రాథమిక విద్యాభ్యాసం ఆదిలాబాద్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో జరిగింది. రేణు సిస్టర్, డాక్టర్ మాలిని టీచర్ అంటే ఇష్టం. వారిద్దరూ నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు అక్కడే చదువుకున్నాను. సెప్టెంబర్ 5 నాడు నేను కూడా టీచర్‌గా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించాను. ఉపాధ్యాయులు, అధ్యాపకులు అందించిన గైడెన్స్, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఐఏఎస్ సాధించాను. *- హరిచందన దాసరి, హైదరాబాద్ కలెక్టర్*

క్లాస్‌లో ఫస్ట్ ర్యాంకు



చిన్నప్పటి నుంచి క్లాస్‌లో ఫస్ట్ ర్యాంక్ నాదే. కర్నూలులో ప్రాథమిక విద్యాభ్యాసం చదివే రోజుల్లో మ్యాథ్స్ టీచర్ వరప్రసాద్, ఫిజిక్స్ టీచర్ సత్యప్రసాద్ ప్రతీరోజూ క్లాస్ అయిన తర్వాత తోటి విద్యార్థులకు నాతో మళ్లీ పాఠం చదివించేవారు. చదువుతోపాటు టాలెంట్ టెస్టులు, ఆటపాటల్లోనూ ముందుండే దాన్ని. బాస్కెట్‌బాల్ స్టేట్‌లెవల్‌కు సెలెక్ట్ అయి ఆడాను. అప్పట్లో ఏపీఆర్‌జేసీలో స్టేట్ ఫస్ట్‌ర్యాంకు సాధించడంతోపాటు నేషనల్ లెవల్ స్కాలర్‌షిప్ ఎగ్జామ్ ఫర్ టాలెంటెడ్ (పదో తరగతి)లో ఎంపికయ్యాను. టీచర్స్ డే వచ్చిందంటే చాలా సంతోషంగా ఉండేది. నాటి రోజులు, నాకు చదువు చెప్పిన గురువులను ఎప్పటికీ మరిచిపోను. *- వల్లూరు క్రాంతి, తెలంగాణ టూరిజంశాఖ మేనేజింగ్ డైరెక్టర్*

అవార్డులకు ఎంపికైన వారు

బీహెచ్‌ఈఎల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జీ.రవీందర్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపికయ్యారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బండరావిరాల జెడ్పీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) విధులు నిర్వహిస్తున్న పుంజాల రమాదేవి, సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోం పాఠశాల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గడ్డమీది కళావతి మల్లికార్జున్‌రెడ్డి కూడా రాష్ట్ర అవార్డులకు ఎంపికయ్యారు. ఉత్తమ అధ్యాపక, ఉపాధ్యాయ అవార్డులకు జేఎన్‌టీయూ నుంచి సీనియర్ ప్రొఫెసర్ కృష్ణమోహనరావు, ప్రొఫెసర్ జీవీ నర్సింహారెడ్డి, బోరబండలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో ఆంగ్లం బోధించే హెచ్. నాగమణిమాల, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న ఎంపికయ్యారు.


జీ.రవీందర్


రమాదేవి


కళావతి


నాగమణిమాల


వెంకన్న

ఉపాధ్యాయుల సేవా దృక్పథం

● పాఠశాలలు, విద్యార్థుల అభివృద్ధికి తమవంతు సాయం

హైదరాబాద్‌సిటీ/న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చదువు చెప్పే పిల్లలను సొంత బిడ్డల్లా చూసుకుంటూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు కొందరు ఉపాధ్యాయులు. పనిచేసే పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహానగరంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తూ సేవా దృక్పథాన్ని చాటుతున్న ప్రభుత్వ టీచర్లపై ప్రత్యేక కథనం.

శ్రీలక్ష్మి, వరలక్ష్మి..

మారేడ్‌పల్లి మండలంలోని చంద్రబాబునగర్ లాలాపేట్‌లో పనిచేస్తున్న శ్రీలక్ష్మి, వరలక్ష్మి అనే మహిళా ఉపాధ్యాయులు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. శ్రీలక్ష్మి రూ.70వేలతో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు, డిజిటల్ క్లాసుల కోసం టీవీ కొనుగోలు చేసి స్కూల్‌కు అందజేశారు. గతంలో తాను పనిచేసిన ఆర్యావాటిక స్కూల్ విద్యార్థులకు చలికాలంలో స్వెటర్లు, వాటర్ బాటిళ్లు, డ్రెస్సులు అందించారు. వరలక్ష్మి టీచర్ గతేడాది రూ.55 విలువ చేసే టీవీలు, టేబుళ్లు, వైట్‌బోర్డులు బహూకరించారు. తమకు నెలవారీగా వస్తున్న వేతనంలో కొంత మొత్తాన్ని పనిచేసే పాఠశాలలోని విద్యార్థులకు కేటాయిస్తున్నారు.

సుగుణారెడ్డి..

రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుగుణారెడ్డి స్కూల్ అభివృద్ధికి తనవంతు సాయం అందిస్తున్నారు. పాఠశాల గేటు పాడవడంతో తన సొంత డబ్బులు రూ. 75 వేలు, మరో రూ. 25 వేలు దాతసాయంతో గేటు ఏర్పాటు చేయించారు. పూర్వ విద్యార్థుల సాయంతో స్కూల్‌లో రూ. 2 లక్షలతో బోరు మోటారు, పైపులైన్ వేయించారు.

ఉదయం 4 గంటలకే నిద్రలేపి..



అడ్డగుట్ట జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు విద్యార్థుల్లో ఉత్సాహం నింపుతున్నారు. ప్రధానంగా పదో తరగతి పిల్లలను పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 4 గంటలకే నిద్రలేపి చదివించేందుకు వారి ఇళ్లకు వెళ్తున్నారు. ప్రతీ విద్యార్థి మంచి గ్రేడింగ్‌తో పాస్‌కావాలనే ఉద్దేశంతో వారు ముందుకు సాగుతున్నారు.

పాఠశాల అభివృద్ధికి సమష్టిగా..



చంపాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారు. హెచ్‌ఎం విజయ రూ.60వేలు, స్పోర్ట్స్ డ్రెస్‌లు, క్యారం బోర్డుల కోసం టీచర్ జ్యోతి రూ. 20వేలు, సరస్వతిదేవి దిమ్మె నిర్మాణం కోసం ఉపాధ్యాయులు బాల్‌రాజ్ రూ. 10వేలు, గోవర్ధన్ యాదవ్ రూ. 50వేలు బోర్ కోసం ఇచ్చారు. జయమ్మ, వాణిశ్రీ, సర్వేష, కల్లేష్, నర్సింహ యాదవ్‌తో కలిసి మెట్ల నిర్మాణం, చిల్డ్రన్స్ స్పోర్ట్స్ డ్రెస్‌ల కోసం సాయం అందించారు.

గ్రామీణ ప్రాంతాల్లో..

డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



సెంట్రల్ జోన్ రివ్యూ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వందనాగుప్తా

చిక్కడపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ్ సమృద్ధి ప్రోగ్రామ్, డిజిటల్ భారత్ నిధి క్రింద గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని భారతీయ పోస్టల్, టెలికాం అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ సర్వీసెస్‌కు చెందిన కంట్రోలర్ జనరల్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ (న్యూఢిల్లీ) వందనా గుప్తా పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలతో కూడిన సెంట్రల్ జోన్ రివ్యూ సమావేశం అశోక్‌నగర్‌లోని టెలికాం లేఖాభవన్‌లో గురువారం జరిగింది. ఆమె మాట్లాడుతూ టెలీ- ఎడ్యుకేషన్, టెలీ- హెల్త్ వంటి సేవలకు సబ్సిడీ ఇస్తున్నట్లు వివరించారు. టెలీ డెన్సిటీ పథకంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుంచి 8.24 కోట్ల సబ్‌స్క్రైబర్లు ఉన్నారని తెలిపారు.

జీఎస్‌టీ సంస్కరణలతో రాష్ట్రాలకు నష్టం

● ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో ఒక్కో రాష్ట్రం సుమారు రూ. 8 వేల కోట్ల నుంచి రూ. 10 వేల కోట్ల వరకు ఆదాయం కోల్పోతుందని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. సంస్కరణలు అమలుచేయనున్నట్టు ప్రకటించిన కేంద్రం.. రాష్ట్రాలు కోల్పోయే ఆదాయాన్ని భర్తీ చేసేందుకు పరిహార మార్గాలను సూచించలేదని విమర్శించారు. దారుల్‌సలాం పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రతిపాదించిన వస్తు సేవల పన్ను వసూళ్లలో(జీఎస్‌టీ)సంస్కరణలు రాష్ట్రాల ఆదాయాన్ని నష్టపరిచే విధంగా ఉన్నాయన్నారు. జీఎస్‌టి సంస్కరణలను తాము స్వాగతించడం లేదని స్పష్టం చేశారు.

తిరుపతిలో 'తబ్లిక్ ఇస్తామా' రద్దు చేయాలి

● ఏపీ సీఎం, డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే రాజాసింగ్ వినతి



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి దేవస్థానం వద్ద అన్యమత కార్యక్రమాలను నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. తబ్లిక్ జామాద్ ఆధ్వర్యంలో ఈనెల 13, 14 తేదీల్లో తిరుపతిలో తబ్లిక్ ఇస్తామా కార్యక్రమం ఏర్పాటు చేశారని, పోలీసుల అనుమతి కూడా తీసుకున్నారని వివరించారు. తబ్లిక్ జామాద్ సంస్థను సౌదీ అరేబియా ప్రభుత్వం నిషేధించిందని, ఇక్కడ ఎలా అనుమతి ఇస్తారని ఆయన ప్రశ్నించారు. తబ్లిక్ ఇస్తామా కార్యక్రమాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంస్థల కార్యక్రమాలు దేశంలో జరగకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిషాను ఆయన కోరారు.

జనసంద్రం.. ఖైరతాబాద్

● వినాయకుడి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు
● కిక్కిరిసిన పరిసరాలు.. ట్రాఫిక్ జాం

ఖైరతాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దర్శనాలకు చివరి రోజని ప్రకటించడంతో గురువారం ఖైరతాబాద్ గణపతి వద్దకు భారీగా భక్తులు వచ్చారు. దీంతో ఖైరతాబాద్ జనసంద్రంగా మారింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో పరిసరాలు కిక్కిరిశాయి. స్పెషల్ టీంలు భక్తులను దశలవారీగా వినాయకుడిని లఘు దర్శనం చేయించి పంపించారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు భక్తుల రద్దీతో ఖైరతాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం అయింది. క్యూలో వచ్చిన భక్తులు కొందరు అస్వస్థతకు గురవడంతో అక్కడున్న వైద్య శిబిరాల్లో ప్రాథమిక వైద్యం చేసి పంపించారు.

సీఎం కుమార్తె పూజలు

భారీ గణపతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమార్తె నైమిషారెడ్డి తన కుమారుడు రెహాన్ష్‌తో కలిసి గురువారం పూజలు నిర్వహించారు. ఆమె డీసీసీ ఖైరతాబాద్ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డితో పాటు గణపతి వద్దకు రాగా ఉత్సవ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. వినాయకుడిని శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్యే దానం నాగేందర్ సతీమణి అనిత తదితరులు దర్శించుకొని పూజలు చేశారు.


భారీ గణపతి వద్ద పూజలు చేసిన ముఖ్యమంత్రి కుమార్తె నైమిషారెడ్డి


గణపతిసేవలో శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ తదితరులు


ఖైరతాబాద్ గణపతి వద్ద భక్తుల రద్దీ


క్రీడాకారులతో గుత్తా జ్వాల

ఫెన్సర్లకు షట్లర్ జ్వాల చేయూత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రతిభావంతులైన యువ ఫెన్సింగ్ క్రీడాకారులకు దిగ్గజ షట్లర్, తెలంగాణ ఫెన్సింగ్ సంఘం అధ్యక్షురాలు గుత్తా జ్వాల అండగా నిలిచారు. ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ క్యాడెట్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ క్రీడాకారులకు ఆమె ఉచితంగా స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఫెన్సింగ్ క్రీడ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జ్వాల తెలిపింది. కార్యక్రమంలో రాష్ట్ర ఫెన్సింగ్ సంఘం కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి సందీప్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పికిల్‌బాల్‌లోకి షట్లర్ సైనా ఎంట్రీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ పికిల్ బాల్ లీగ్ (హెచ్‌పీఎల్)లోని కీర్తి వారియర్స్ జట్టుకు బ్యాడ్మింటన్ దిగ్గజం సైనా నెహ్వాల్ సహ యజమానిగా మారారు. రాష్ట్రంలో గ్రామీణ స్థాయి నుంచి పికిల్‌బాల్‌ను అభివృద్ధి చేసేందుకు తాను ఈ జట్టుతో భాగస్వామిని అయ్యానని సైనా తెలిపారు. వచ్చే నెల 10 నుంచి పికిల్‌బాల్ లీగ జరగనుంది.



వారియర్స్ జట్టుతో సైనా


మాట్లాడుతున్న రోష్నీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఆత్మహత్యలను నివారించవచ్చు

రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవితంపై భరోసా కల్పించి ఆత్మహత్యలను నివారించవచ్చని రోష్నీ స్వచ్ఛంద సంస్థ కౌన్సిలర్లు ఆనంది దివాకర్, విద్యారెడ్డిలు తెలిపారు. గురువారం సికింద్రాబాద్ సింధి కాలనీలోని రోష్నీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బంజారాహిల్స్ రోడ్డు నెంబరు-1లో గల ప్రసాద్ ల్యాబ్స్ ప్రివ్యూ థియేటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ముఖ్యఅతిథిగా సినీ నటుడు సుమన్ పాల్గొంటున్నారని వివరించారు. ఆత్మహత్యలు చేసుకోవాలనుకునే ఆలోచన ఉన్నవారిని గుర్తించి వారికి జీవితంపై ఆశలు కల్పించడం ద్వారా ఆ ఆలోచన దూరం చేయవచ్చని వివరించారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠంలో ప్రతి శుక్రవారం ఉచితంగా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆత్మహత్య చేసుకోవాలనుకునే ఆలోచన ఉన్నవారు 8142020033, 8142020044, 04066202000, 04066202001 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'కవిత నిర్ణయంతో రోడ్డున పడ్డాం'

పంజాగుట్ట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీసుకున్న నిర్ణయం వల్ల తాము రోడ్డున పడ్డామని తెలంగాణ జాగృతి ఫౌండర్, ఉపాధ్యక్షుడు మేడే రాజీవ్‌సాగర్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జాగృతి నాయకులు మఠం భిక్షపతి, గ్రేటర్ హైదరాబాద్ మాజీ అధ్యక్షుడు అనంతల ప్రశాంత్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజారామ్ యాదవ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తామని తెలిపారు. సమావేశంలో జాగృతి నాయకులు ఉపేందర్‌రావు, అనంతరాములు, ఫణీంధర్, నాగరాజు, శేఖర్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి

20 ఏళ్ల జైలుశిక్ష.. జరిమానా

అల్వాల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్నేహం పేరుతో బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి ప్రత్యేక కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అద్దాల నాని (28) అల్వాల్ చంద్రపురి కాలనీలో నివసిస్తూ కూలి పనిచేసేవాడు. 2020, సెప్టెంబరు 2వ తేదీన ఓ బాలికతో పరిచయం పెంచుకొని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన మేడ్చల్ జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి అమరావతి గురువారం తీర్పు చెప్పారు. నిందితుడు అద్దాల నానికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ. 10 వేలు జరిమానా విధించారు. బాలికకు రూ. 2 లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌పై అభ్యంతరాలు

● హెచ్‌ఎండీఏ కార్యాలయానికి జిల్లాల నుంచి రైతుల రాక
● కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఆందోళన

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను నోటిఫై చేసే ప్రక్రియను హెచ్‌ఎండీఏ ప్రారంభించగా పెద్దఎత్తున అభ్యంతరాలు వస్తున్నాయి. ఈ నెల 15వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించడానికి హెచ్‌ఎండీఏ బహిరంగ ప్రకటన విడుదల చేసింది. దీంతో వివిధ ప్రాంతాల వారీగా సర్వే నంబర్లలో రీజనల్ రింగ్ రోడ్డు వెళ్తున్నట్లు ప్రకటించడంతో ఆయా సర్వే నంబర్లలో భూములున్న రైతులు అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌లో ఉన్న హెచ్‌ఎండీఏ కార్యాలయానికి బారులు తీరారు. తమ సర్వే నంబర్ల నుంచి ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ లేకుండా చేయాలని అధికారులను కోరుతున్నారు. గురువారం మహబూబ్‌నగర్, వికారాబాద్, నల్లగొండ జిల్లాలకు చెందిన రైతులు హెచ్‌ఎండీఏ కార్యాలయానికి చేరుకున్నారు. అభ్యంతరాలను తెలుపుతూ వినతిపత్రాలను కార్యాలయ సిబ్బందికి అందజేశారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం ఆర్ఆర్ఆర్ నిర్మించాలన్నారు. హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ నానక్‌రాంగూడలో మీటింగ్‌లో ఉన్నారని సిబ్బంది చెప్పడంతో ఉదయం నుంచి ఎదురుచూసిన రైతులు ఆందోళనకు దిగారు.

కమిషనర్ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ భూములను ఆర్ఆర్ఆర్ నిర్మాణం కోసం ఇచ్చేదిలేదన్నారు.



అమీర్‌పేటలోని హెచ్‌ఎండీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఆర్ అండ్ బీ అధికారులను సంప్రదించండి

ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ ఖరారు, ఇతర మార్పులన్నీ రోడ్డు భవనాల శాఖ అధికారులే చూసుకుంటున్నారని, ఖరారు చేసిన అలైన్‌మెంట్ ప్రకారంగానే నోటిఫై చేసేందుకు తాము చర్యలు చేపడుతున్నామని హెచ్‌ఎండీఏ అధికారులు అంటున్నారు. అలైన్‌మెంట్ సర్వే నంబర్లను నోటిఫై చేయడానికి మాత్రమే అభ్యంతరాలను తీసుకుంటున్నామని, అలైన్‌మెంట్‌పై వివరాలకు ఆర్ అండ్ బీ శాఖ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచిస్తున్నారు.

అక్రమ వీసా.. డ్రగ్స్ దందా

● నైజీరియన్‌ను స్వదేశానికి పంపిన పోలీసులు


అలీ ఎనుకే ఫ్యార్చునటస్ అకీడునువా

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి వీసాపై వచ్చి గడువు ముగిసినా అక్రమంగా ఉంటూ డ్రగ్స్ దందా చేస్తున్న నైజీరియన్‌ను హైదరాబాద్ పోలీసులు స్వదేశానికి పంపారు. నైజీరియా దేశానికి చెందిన అలీ ఎనుకే ఫ్యార్చునటస్ అకీడునువా (30) స్టూడెంట్ వీసాపై 2016లో ఇండియాకు వచ్చాడు. అప్పటి నుంచి పబ్‌లలో డీజేగా పనిచేస్తున్నాడు. వీసా గడువు ముగిసినా అక్రమంగా ఉంటూ నగరంలో తలదాచుకున్నాడు. లంగర్‌హౌస్ ప్రాంతంలో ఉంటూ డ్రగ్స్ విక్రయాలు చేస్తున్నాడు. ఇతడిపై నిఘా పెట్టిన హెచ్‌న్యూ సిబ్బంది ఇతడిని అరెస్ట్ చేశారు. వీసా గడువు ముగిసినా అక్రమంగా ఉంటూ డ్రగ్స్ విక్రయాలు చేస్తున్న ఇతడిని నగర పోలీసులు ఎఫ్ఆర్ఆర్ఓ సహకారంతో స్వదేశానికి తిప్పి పంపారు.

సహజయోగ

నిమజ్జనం ఎందుకంటే..



భాద్రపద శుద్ధ చవితిని 'అనంత చతుర్దశి' అంటారు. దీనికి ఒక విశేషం ఉంది. ఆ రోజే వినాయకుణ్ణి నీటిలో నిమజ్జనం చేస్తాం. వినాయక చవితి నాడు మట్టి ప్రతిమను ప్రతిష్ఠించి, పదిరోజుల పాటు పూజలు నిర్వహించిన తరువాత... దాన్ని నదిలో కానీ, సముద్రంలో కానీ కలపడానికి కారణం ఏమిటంటే... పూజలు అందుకున్న వినాయకుడి శక్తులు ఆ నీటి ప్రవాహం ద్వారా సర్వత్రా వ్యాప్తి చెందుతాయి. ఆ విధంగా శ్రీగణేశుని శక్తులు, తత్త్వం అయిన పవిత్రత, వివేకం, అబోధితత్వం, విచక్షణ, తల్లిపట్ల సమర్పణ భావం ఆ అనంతమైన నీటిలో స్థిరపడి ప్రవహిస్తూ సముద్రాన్ని చేరుకుంటాయి. 'అనంత' అంటే వినాయకుడు, నాశనం లేనివాడు. గణేశుని శక్తి అనంతంగా వ్యాపించి ఉంటుంది. అంతటి మహిమాన్వితుణ్ణి నిమజ్జనం చేయడానికి తీసుకువెళుతున్నప్పుడు ఎంతో భక్తి శ్రద్ధలతో మెలగాలి. కీర్తనలు పాడుతూ మేళ తాళాలతో, మంగళప్రదంగా ఆయనను సాగనంపాలి.

భూమాతను గణేశుని తల్లిగా, హిమాలయాలను ఆయన తండ్రి అయిన శివునిగా, సముద్రుణ్ణి ఆయన తాతగారిగా భావించే సంప్రదాయం ఉంది. 'అనంతుడు' అనే పేరు ఉన్న ఆయనను అనంత చతుర్దశి రోజున సముద్రంలో లేదా నదులు, చెరువుల్లో నిమజ్జనం చేయడానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. మట్టినుంచి ఉద్భవించిన గణేశుడు నీటిలోకి చేరి, దాని ద్వారా మానవాళికి, జంతువులకు, ప్రకృతికి తన శక్తులను, తత్త్వాన్ని ప్రసాదిస్తాడు. కాబట్టి నిమజ్జనం కార్యక్రమాన్ని గౌరవప్రదంగా, ఒక పుణ్యకార్యంగా నిర్వహించుకోవాలి.

డాక్టర్ పి. రాకేష్,
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

విశేషం

పదాలు వేరు... అర్థాలూ వేరు



ఉపాధ్యాయుడు, గురువు, ఆచార్యుడు అనే మూడు విశిష్టమైన పదాలను ఇప్పుడు పర్యాయ పదాలుగా (ఒకే స్థాయి బరువు ఉండే మాటలుగా) వాడేస్తున్నారు. క్రమక్రమంగా లోకంలో ఆ పదాలు సమానార్థకాలు అయిపోయాయి. అది సరి కాదు.

శిష్యుణ్ణి ఎంచుకొనేవాడు ఉపాధ్యాయుడు

'ఉప'... తన సమీపానికి రప్పించుకొని, 'అధ్యాయః' చదువు చెప్పేవాడు (ఉప సమీపమేత్య అధ్యాపయతి) ఉపాధ్యాయుడు. క్రమశిక్షణతో కనిపిస్తున్న పిల్లవాణ్ణి ఇతను నాకు 'విద్యా+అర్థి'గా కనిపిస్తున్నాడు కాబట్టి చదువు చెబుతానని ఎంచుకొనేవాడు ఉపాధ్యాయుడు. ఆ 'విద్యా+అర్థి'ని (కేవలం చదువు కోసమే తనను ఆశ్రయించినవాణ్ణి) తన ఇంటనే ఉంచుకొని బోధిస్తూ ఉండేవాడు. కాబట్టే విద్యార్థికి 'అంతేవాసి' (తన దగ్గరే ఉండేవాడు), 'ఛాత్రుడు' (గురువు ఏదో పొరుగు ఊరు నుంచి ఆలస్యంగా వచ్చి, ఆ రోజు అనుష్ఠానాన్ని పూర్తిగా చేయ(లే)ని పక్షంలో... ఆ దోషాన్ని పదిమందికీ చాటింపు వేయకుండా... (ఛత్రం తచ్ఛీలమస్యేతి ఛాత్రః) 'ఛత్రం' అంటే గొడుగులా దాచిపెట్టేవాడు) అనే పేర్లు వచ్చాయి. ద్వాపర యుగంలో ఎవరు విద్యా బోధకులో వారికి 'ఆచార్యుడు' అనే వృత్తిపరమైన పేరు ఉండేది. ఇప్పటికీ ఆ పద్ధతి అక్కడక్కడా కనిపిస్తుంది. దాంతో కురు, పాండు పుత్రులకు ధనుర్విద్య నేర్పే ఉపాధ్యాయుడు 'కృప-ఆచార్యుడు' అయ్యాడు.

శిష్యుడు ఎంపిక చేసుకొనేవాడు గురువు

కురు, పాండు పుత్రులు బంతి ఆట ఆడుకుంటూ ఉంటే... ఆ బంతి కాస్తా ఒక పాడుపడిన నూతిలో పడింది. వారందరూ ఏమీ తోచక తెల్లముఖాలతో ఆ నూతి చుట్టూ తిరుగుతున్నారు. అప్పటికి ఇంకా ఉపాధ్యాయుడు కాని, ఆచార్య పదవీ లేని ద్రోణుడు ఆ మార్గంలో వెళుతూ వారి పరిస్థితిని గమనించాడు. వారి ప్రార్థన విని... తన భుజాన ఉన్న వింటిని తీసి, నూతిలో ఉన్న బంతిని ఒక బాణంతో కొట్టాడు. సాధారణంగా బాణం తగలగానే బంతి గుండ్రంగా తిరగడమే కాకుండా పక్కకు పడిపోతుంది. అయితే ద్రోణుడు ఒక ప్రత్యేకమైన బాణాన్ని (ఇషువు) తీసుకొని, ఆ బంతిని కొట్టి, ఆ బాణానికి చివర ఉన్న చిన్న రంధ్రంలోకి మరొక బాణాన్ని కొట్టాడు. అలా ఆ రెండు పక్కకు ఒరిగిపోకుండా మరో బాణం చొప్పున కొడుతూ... ఆ బాణాల వరుసను ఒక తాడులా చేసి సునాయాసంగా బంతిని పైకి తీశాడు. దాన్ని కురు, పాండు పుత్రులకు ఇచ్చాడు. చిత్రమేమిటంటే... అద్భుతమైన ఈ ధనుర్విద్యా కౌశలాన్ని అందరూ గమనించలేకపోయారు. బంతి వచ్చిందనే ఆనందంతో వెళ్ళిపోయారు. అర్జునుడు మాత్రం ద్రోణుడి నైపుణ్యాన్ని గమనించి, ఆయననే గురువుగా ఎంచుకున్నాడు. అర్జునుడి అదృష్టం ఎంత గొప్పదంటే... ఈ సంఘటనను సౌధం పై నుంచి చూస్తున్న భీష్ముడికి చెప్పలేనంత ఆనందం కలిగింది. మరుక్షణంలోనే ద్రోణుణ్ణి తన క్షత్రియ విద్యా పాఠశాలలో ధనురాచార్యుడిగా నియమించాడు. దీనితో అయస్కాంతానికి ఇనుప ముక్కలా ద్రోణుడికి అర్జునుడు మరింతగా అతుక్కుపోయాడు.

గురువు లేని నేనెందుకు?

ద్రోణుడి విషయంలో దుర్యోధనుడు నిరంతరం ద్వేషభావంతో ఉండేవాడు. తమ కౌరవులకన్నా పాండు పుత్రులకు మరింత శ్రద్ధగా ఆయన చదువు చెబుతున్నాడేమో? అనే సందేహమే దీనికి కారణం. అర్జునుడు తనకు బాగా దగ్గరయ్యాడనే సంగతి ద్రోణుడికి అర్థమయినా... అతణ్ణి పరీక్షించాలనుకున్నాడు. తన శిష్యులందరితో తాను నిత్యం స్నానం చేసే తటాకం దగ్గరకు వెళ్ళాడు. స్నానం చేస్తూ "మొసలి! మొసలి!" అంటూ గట్టిగా అరిచాడు. ఆ మొసలి మనల్ని కూడా తినేస్తుందనో, వేరే సంశయాలతోనో గురువును రక్షించే ప్రయత్నం ఎవరూ చేయలేదు. కానీ గురువు అరుపు విన్న వెంటనే అర్జునుడు ఆ చెరువులోకి దూకాడు. తరువాత అదంతా గురువు ఆడిన నాటకం అని గ్రహించి పరమానందపడ్డాడు. ఒడ్డుకు చేరిన తరువాత "అర్జునా! అక్కడ మొసలే గనుక ఉండి, నాతో పాటు నిన్నుకూడా తినేసినట్టయితే?" అన్నాడు ద్రోణుడు. అర్జునుడు దానికి బదులిస్తూ "అయ్యా! మీరంటూ లేకపోయిన తరువాత ఈ ధనస్సు, బాణాలు, వాటిని ధరించిన నేను ఉండడం ఎందుకు?" అని బదులిచ్చాడు. దాంతో ఆ గురుశిష్యానుబంధం పాలు-నీరులా కలిసిపోయింది. ఇదీ గురు విధానం అంటే. ఏవో సిఫార్సులతోనో, బెదిరింపులతోనో ఉపాధ్యాయులను నియమించే విధానం ఉంటే విద్యా వ్యవస్థ దెబ్బతిని తీరుతుంది. ఆ మర్మాన్ని ఎరిగినవాడు కాబట్టే ద్రోణుణ్ణి భీష్ముడు ఆచార్యునిగా నియమించడం ఒక విశేషం కాగా, చక్కని పాండిత్యం ఉన్నా తగిన ఉద్యోగావకాశం లేకపోవడం అనేది ద్వాపర యుగం నుంచీ ఉన్నదనేది మరో విశేషం. అలాగే ఒక సంస్థకు అధిపతిగా ఎవరుంటారో వారి సంతానానికి (ఇక్కడ కౌరవులకు) అహంకారం కారణంగా సరైన చదువు అబ్బదనేది, మాయోపాయాలతో గెలుపు సాధించే పద్ధతే అలవడుతుందనేది, వారు గురునిందకు వెనుకాడరనేది గమనించాల్సిన ఇంకో విశేషం. అందుకే సుయోధనుడు చక్కని యుద్ధ విద్య తెలిసినవాడే అయినా చివరకు దుర్-యోధనుడే అయ్యాడు.

అనేక గురు సమూహం... ఆచార్యుడు


'కృష్ణం వందే జగద్గురుమ్' అని పరమాత్మను స్తుతిస్తారు. అంటే ద్రోణుడిలా పాఠ ప్రవచనాన్ని చేసేవాడని కాదు. కృష్ణుడు యుద్ధ విద్యలో నిపుణుడు. అందుకే నరకాసుర వధను స్వయంగా చేయగలిగాడు. సత్యభామకు కూడా యుద్ధ విద్య తెలుసుననే విషయాన్ని లోకానికి తెలియజెప్పడం కోసం ఓడినట్టు తాత్కాలికంగా నటించాడు తప్ప... నరకాసుర వధ చేసినది ఆయనే. అంతేకాదు.. ప్రతిక్షణమూ పాండవులకు అండగా ఉంటూ, ఎన్నెన్నో ఉపద్రవాల నుంచి వారిని బయటపడేశాడు. యుద్ధ, రాజనీతి, ధర్మ, వేదాంతశాస్త్రాది అనేక విషయాల్లో శిఖరాగ్ర పాండిత్యం ఉన్న ఆయన... గీతను ఉపదేశించి 'గీతాచార్యుడు' అయ్యాడు. అలాగే భీష్ముడు కూడా కేవలం ధనుర్విద్యనే కాకుండా రాజపరిపాలన, పూర్వ రాజుల చరిత్ర అధ్యయనం చేశాడు. తన వంశం నిర్వంశం అవుతున్న దశలో వ్యాసుణ్ణి ప్రార్థించి, వంశాన్ని నిలబెట్టేలా చేయగలిగాడు. యౌవన గర్వంతో తాను చేసిన మూడు తప్పులకు తనకుతానే అంపశయ్య శిక్ష విధించుకున్నాడు. ధర్మ శాస్త్ర పాండిత్యం కూడా కలిగి 'భీష్మాచార్యుడు' అనిపించుకోగలిగాడు. ద్రోణుడు కూడా భీష్ముడికి దగ్గరై, ఆయన దగ్గర రాజ్య తంత్రాలన్నీ తెలుసుకొని, సర్వ శాస్త్ర పాండిత్యాన్ని సంపాదించిన కారణంగా 'ద్రోణాచార్యుడు' అనే పిలుపును అందుకున్నాడు. ఇలా ఉపాధ్యాయుడు, గురువు, ఆచార్యుడు అనే పదాలకు విస్తృతమైన వేర్వేరు అర్థాలు, ప్రత్యేకతలు ఉన్నాయి.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
(నేడు ఉపాధ్యాయ దినోత్సవం)

దైవమార్గం

క్రీస్తు శిష్యులు

గురుశిష్య బంధం ఎంతో ప్రాచీనమైనది. ఏసు క్రీస్తు ప్రధాన శిష్యులు పన్నెండు మంది. వారందరూ ఆయనను విచిత్రంగా కలిసినవారే. ఈ శిష్యులలో శాస్త్రజ్ఞానం కలిగినవారు ఎవరూ లేరు. చేపలు పట్టుకొనేవారు, చెక్క పని చేసుకొనేవారు, పశువుల కాపరులు... ఇలా వివిధ వృత్తులు చేస్తూ జీవించే నిరక్షరాస్యులు వారు. ఇలాంటి శిష్యులను ఏసు ఎంపిక చేసుకోవడం ఆయన అభ్యుదయ భావాలకు సంకేతం. ఈ శిష్యులందరూ ఏసు పట్ల వినయవిధేయతలు ప్రదర్శించినవారే. ఆయన వెంట నడిచినవారే. ఆ పన్నెండుమందిలో చివరివాడు యోహాను. నలుగురు సువార్తికుల్లో (మత్తయి, మార్కు, లూకా, యోహాను) అతనొకరు. ఏసు జీవన రేఖలను, దైవికమైన వ్యక్తిత్వాన్ని తన సువార్తలో పూసగుచ్చినట్టు యోహాను చిత్రీకరించాడు. ఏసు పన్నెండు మంది శిష్యుల్లో పెద్దవాడు పేతురు. అతణ్ణి తన సందేశ ప్రచారయాత్రకు సారథిగా ఏసు నియమించాడు. "నీవు రాయిలాంటి గట్టివాడివి. నీ మీద ఈ నా సంఘాన్ని నిర్మిస్తాను. దాన్ని నడిపించు" అంటూ బాధ్యతను అప్పగించాడు. ఇక యూదా ఇస్కరియోతు అనే శిష్యుడు ఏసును రోమన్ సైనికులకు పట్టి ఇచ్చాడు. ఏసు మరణానికి హేతువయ్యాడు. తోమాస్ అనే శిష్యుడు మన భారతదేశానికి వచ్చి, క్రీస్తు గురించి బోధించాడు.



ఏసును ఆయన శిష్యులు 'బోధకుడా' అని పిలిచేవారు. గురువుగా సంబోధించేవారు. గురు శిష్య బంధం అంటే గ్రంథాల్లోని పాఠాలు వల్లించడం మాత్రమే కాదని, పరిస్థితులు, మనస్తత్వాల పట్ల అవగాహన ముఖ్యమనీ వారు చాటారు. క్రీస్తు పట్ల ఆరాధనా భావం, భక్తిభావం వారికి ఉండేది. ఎందుకంటే... వారి కళ్ళముందే ఆయన అద్భుతాలు చేశాడు. దివ్య రూపం ధరించాడు. ఎన్నో హితవులు బోధించాడు. ఆ శిష్యుల వ్యక్తిత్వాలను మలిచాడు. వారు కూడా అద్భుతాలు చేసేలా తీర్చిదిద్దాడు. ఏసు ఆదేశం ప్రకారం ఆ శిష్యులు గ్రామాలు గ్రామాలు నడిచారు. ఆకలిని, దప్పికను ఓర్చుకున్నారు. ప్రజలతో బంధాన్ని పెంచుకున్నారు. ఆయన సందేశాన్ని లోకమంతటా వినిపించారు. అశేష ప్రజలు ఆయన మార్గాన్ని అనుసరించేలా చేశారు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్ 9866755024



ఇష్ట దైవానికే భక్తుడి ఇల్లు..!

- యాదాద్రి లక్ష్మి నరసింహుడికి ఇల్లు రిజిస్ట్రేషన్
- ఇంటి విలువ రూ.4 కోట్లు

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆయన పేరు ఎం.వెంకటేశ్వర్లు.. ఒక విశ్రాంత ఉద్యోగి. ఎంతో ముచ్చట పడి కట్టుకున్న ఇంటిని యాదాద్రి-లక్ష్మి నరసింహ స్వామికి విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌లోని తిలక్‌నగర్‌లో 152 గజాల విస్తీర్ణంలో జీ ప్లస్ 3- పెంట్ హౌస్ నిర్మించిన విలువ సుమారు రూ.4 కోట్ల పై మాటే. అంత విలువైన సొంతింటిని విశ్రాంత ఉద్యోగి ఎం.వెంకటేశ్వర్లు తన ఇష్ట దైవం యాదాద్రి లక్ష్మి నరసింహస్వామికి రాసిచ్చారు. ఈ మేరకు చిక్కడపల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం పేరిట గురువారం రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ రిజిస్ట్రేషన్ పత్రాలను చైర్మన్ నరసింహమూర్తి, ఆలయ ఈవో వెంకట్రావు సమక్షంలో దేవాలయ అధికారులకు అందజేశారు. స్వామి వారికి ఇంటిని విరాళంగా ఇచ్చిన భక్తుడిని ఆలయ అధికారులు.. లక్ష్మినరసింహ స్వామి ప్రసాదం అందచేసి సన్మానించారు.

ట్రాఫిక్‌ను గాలికి వదిలేసి చలానాలపై దృష్టా?

- పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణను గాలికి వదిలేశారని, చలాన్లు విధించడం ద్వారా ఆదాయం పెంచుకోవాలనే దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజలను భయాందోళనకు గురిచేసే విధంగా వేల రూపాయలను జరిమానాగా విధిస్తున్నారని వ్యాఖ్యానించింది. చట్టంలో పేర్కొన్న విధంగా కాకుండా అక్రమంగా అధికంగా వసూలు చేస్తున్నారని తెలిపింది. మోటార్ వెహికిల్ యాక్ట్-1988లో పేర్కొన్న విధంగా రూ.100 నుంచి రూ.300 విధించాల్సిన తప్పునకు రూ.1200 చలానా విధించారని, ఇది అక్రమమని పేర్కొంటూ తార్నాకకు చెందిన వి.రాఘవేంద్రచారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. చట్టంలో పేర్కొన్నదానికి భిన్నంగా ఎందుకు జరిమానా విధించారో వివరణ ఇవ్వాలని ట్రాఫిక్ పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. ఇందుకు వారం రోజు సమయం ఇస్తూ విచారణను వాయిదా వేసింది.

మూడో బిడ్డకు ప్రసూతి సెలవు ఎందుకివ్వకూడదు? :హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళా ప్రభుత్వ ఉద్యోగులు మూడో బిడ్డకు జన్మనిస్తే ప్రసూతి సెలవు ఎందుకు ఇవ్వకూడదో చెప్పాలని హైకోర్టు ప్రశ్నించింది. ప్రసూతి సెలవును ఇద్దరు బిడ్డల వరకే పరిమితం చేస్తూ ఉమ్మడి ఏపీలో 2010లో జారీచేసిన జీవో 152ను సవాల్ చేస్తూ సరూర్‌నగర్ మండలం రాజీవ్‌గాంధీనగర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన స్కూల్ అసిస్టెంట్ జీ.శ్వేత హైకోర్టు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహిముద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. ఉమ్మడి ఏపీలో జారీచేసిన ఈ జీవో ప్రస్తుతం తెలంగాణలో అమలులో ఉందని చెప్పారు. ఇద్దరు పిల్లల వరకే 180 రోజుల మెటర్నిటీ లీవ్ ఇచ్చేందుకు అనుమతి ఉందని తెలిపారు. ఆ జీవోను ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో సవరించారని, ఇద్దరు పిల్లల వరకు ఉన్న పరిమితిని ఎత్తివేశారని పేర్కొన్నారు. తెలంగాణలో సైతం ఆ జీవోను సవరించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ అంశంపై ప్రభుత్వ వివరణ తెలియజేయాలని పేర్కొంటూ విచారణను ఈనెల 16కు వాయిదా వేసింది.

5 వేల కోట్లు ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)


కేంద్ర మంత్రి నిర్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తుమ్మల, భట్టి

వరదలు సంభవించి మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన వర్షపాతం సాధారణం కంటే 25 శాతం అధికంగా ఉందని పేర్కొన్నారు. ఎనిమిది జిల్లాల్లో 65 నుంచి 95 శాతం అదనపు వర్షపాతం నమోదైందని, వర్షాలు కొనసాగుతూనే ఉండటంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు, పంటలు, పశువులు, మానవ ప్రాణాలు నష్టపోయాయని వివరించారు. అలాగే, గతేడాది ఖమ్మం, పరిసర జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా రూ.11,713 కోట్ల సహాయం కోరినప్పటికీ.. కేంద్రం నిధులేమీ ఇవ్వలేదని, కేవలం సాధారణ నిధులే విడుదలయ్యాయని గుర్తుచేశారు. దాంతో పునర్నిర్మాణంలో ఇబ్బందులు ఏర్పడ్డాయని అమిత్ షా దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో గతంలో కోరిన రూ.11,713 కోట్లతోపాటు తాజాగా ప్రాథమిక అంచనా ప్రకారం రూ.5,018 కోట్లు కలిపి మొత్తం రూ.16,732 కోట్లను కేంద్రం తక్షణమే విడుదల చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం వనరులను సమీకరించి సహాయక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఏడు ఎన్డీఆర్ఎఫ్, 15 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, సుమారు 100 మంది సైనిక సిబ్బంది సహాయ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని వివరించారు.

తీవ్రంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలు

72 గంటలపాటు కురిసిన వర్షాల తీవ్రతతో రోడ్లు, రైల్వే ట్రాక్‌లు, కల్వర్టులు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల సాధారణ జీవనానికి అంతరాయం ఏర్పడిందని తెలిపారు. ఈ పరిస్థితిని జాతీయ విపత్తుగా పరిగణించాలని కేంద్ర హోంమంత్రిని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన అమిత్ షా.. త్వరలోనే కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందాన్ని తెలంగాణకు పంపి నష్టాలను అంచనా వేయిస్తామని హామీ ఇచ్చారు. కాగా, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. విద్య, పోషకాహార రంగాల్లో తరతరాలుగా అసమానతలు ఉన్నాయని, వాటిని రూపుమాపేందుకే ఈ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమగ్ర విద్యా విధానం కోసం రూ.30 వేల కోట్లు అంచనా వ్యయంగా ఉందన్నారు. ఇందుకు వనరుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణం, అనుబంధ పెట్టుబడుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రయోజన కార్పొరేషన్ ద్వారా రుణాలు సేకరించాలని ప్రతిపాదిస్తోందని చెప్పారు. ఈ రుణాలకు ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల నుంచి మినహాయించాలని, దాంతోపాటు కేంద్రం ప్రత్యేకంగా సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తెలంగాణ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా గత ప్రభుత్వం అధిక వడ్డీతో తీసుకున్న రుణాల పరిమితిని సడలించాలని, లోన్ రీస్ట్రక్చరింగ్ చేయాలని కోరారు. రాష్ట్రంలో పామాయిల్ సాగు ఎక్కువగా ఉన్నందున పామ్ ఆయిల్‌పై విధించే సుంకాన్ని పెంచాలన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులివ్వండి..

రూరల్ రోడ్డు కనెక్టివిటీ ప్రోగ్రాం కింద ఖమ్మంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.110 కోట్లు ఇవ్వాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను మంత్రి తుమ్మల కోరారు. ఢిల్లీలో పెమ్మసానితో తుమ్మల భేటీ అయ్యారు. ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అక్కడ సిమెంట్ కాంక్రీట్ డ్రైనేజింగ్ నెట్‌వర్క్ నిర్మాణానికి ఖమ్మం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ప్రతిపాదనలు రూపొందించిందని తెలిపారు. ఈ ప్రతిపాదనల్లో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో ఆర్థిక సాయం అందించాలని కోరారు.

ఒక ఐఏఎస్ దుర్మార్గం!

- హైదరాబాద్‌లో వివాహేతర సంబంధం
- తీవ్రంగా కొట్టడంతో ఆ మహిళ మృతి
- పోలీసు కేసు కాకుండా గోల్‌మాల్

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆయన సీనియర్ ఐఏఎస్ అధికారి! హైదరాబాద్‌లో ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. అందులోనూ అనుమానాలు, గొడవలు! అది కాస్తా ఘర్షణకు దారి తీసింది. ఆ మహిళను కొట్టడం, తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె మరణించడం జరిగిపోయింది. అయితే.. ఆయన తన పలుకుబడినంతా ఉపయోగించి.. పోలీసు కేసు కాకుండా చూసుకున్నారు. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం ఇవీ ఆ వివరాలు...

ఆ సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకప్పుడు సౌమ్యుడు, మంచివాడే! ఇప్పటికీ పైకి చూడటానికి అలాగే కనిపిస్తారు. ఏపీ కేడర్‌కు చెందిన ఆయన గతంలో ఒక ముఖ్యమంత్రి పేషీలో కూడా పని చేశారు. జగన్ హయాంలో ఒక కీలకమైన శాఖకు ఆయన అధిపతిగా వ్యవహరించారు. అప్పట్లో జగన్ చెప్పినట్టల్లా చేశారు. దీంతో ఆ అధికారికీ తేరగా, భారీగా డబ్బులు వచ్చి పడ్డాయి. డబ్బుతోపాటు కొన్ని అవలక్షణాలూ వంటబట్టాయి. దీంతో.. ఐదు పదుల వయసు దాటిన ఆ ఐఏఎస్ అధికారి పక్కదారి పట్టారు. సొంత కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తూ.. హైదరాబాద్‌లో మరో మహిళతో సన్నిహితంగా మెలగడం మొదలుపెట్టారు. వీలైనంత ఎక్కువగా హైదరాబాద్‌లోనే మకాం! కొద్దికాలం ఇదంతా బాగానే నడిచింది. అయితే, ఇటీవల ఆయన అనారోగ్యానికి గురయ్యారు. అది కొంత తీవ్రమైన సమస్యే అయినప్పటికీ.. ఖరీదైన చికిత్స చేయించుకోవడంతో కోలుకున్నారు. అయితే, తనకు ఆరోగ్యం బాగలేని సమయంలో ఆ మహిళ తనను కాదని, మరొకరితో సన్నిహితంగా ఉంటోందని ఆయనకు అనుమానం వచ్చింది. ఒక్కసారి అనుమానం వచ్చిన తర్వాత ఆగదు కదా! అది గొడవలకు దారి తీసింది. గత శుక్రవారం ఈ సీనియర్ ఐఏఎస్‌కు, ఆ మహిళకు మధ్య మాటామాటా పెరిగింది. ఘర్షణ స్థాయికి చేరింది. కోపం ఆపుకోలేని ఆ అధికారి.. శక్తినంతా కూడగట్టుకుని ఆ మహిళను బలంగా కొట్టారు. తల గోడకు తగలడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. దీంతో సదరు ఐఏఎస్‌లో వణుకు మొదలైంది. సమీపంలోనే ఉన్న ఓ పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్లేసరికే.. ఆమె మరణించింది. ఆమె మృతికి అసలు కారణం చెప్పకుండా.. 'ప్రమాదవశాత్తూ కిందపడటం వల్ల తగిలిన గాయం' (ఫాలెన్ డౌన్) అని ఆస్పత్రి రికార్డుల్లో రాయించారు. తన పలుకుబడి మొత్తం ఉపయోగించి.. అసలు విషయం బయటికి రాకుండా, పోలీసుల దాకా వెళ్లకుండా చూసుకున్నారు. అక్కడేమీ జరగనట్లుగా విజయవాడకు వచ్చేసి.. తన పని తాను చేసుకుంటున్నారు. కానీ.. ఆయన వ్యవహారాలు కొందరు ఐఏఎస్‌లకు ఇప్పటికే తెలుసు. నిజం దాచినంత మాత్రాన దాగదు కదా! హైదరాబాద్‌లో జరిగిన దారుణం గురించి ఆయన సన్నిహితులు కొందరికి తెలిసిపోయిందని సమాచారం!

నా టార్చర్‌కే ప్రత్యర్థి న్యాయవాది గుండెపోటుతో పోయాడు

- నాకు అనుకూలంగా తీర్పు రాయండి
- అనుమతి లేకుండా న్యాయమూర్తి చాంబర్‌కు వెళ్లి కక్షిదారు డిమాండ్
- ఓపెన్ కోర్టులోనే కేసు విచారిస్తానని చెప్పి పంపిన జస్టిస్ నగేశ్ భీమపాక
- విచారణ నుంచి తప్పుకున్న జడ్జి
- సీనియర్ సిటిజన్ కావడంతో ధిక్కరణ చర్యలు చేపట్టని హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా హైకోర్టు న్యాయమూర్తి చాంబర్‌కు వెళ్లడమే కాకుండా తనకు అనుకూలంగా తీర్పు రాయాలంటూ జడ్జిని ఓ కక్షిదారు కోరిన ఘటన హైకోర్టులో కలకలం సృష్టించింది. "మీరు ఎవరు చెప్తే వింటారు? ఎవరితో చెప్పించమంటారు? నేను కేసు కొనసాగిస్తూ టార్చర్ పెట్టడం వల్లే నా ప్రత్యర్థి న్యాయవాది గుండెపోటుతో చనిపోయాడు. నాకు అనుకూలంగా తీర్పు రాయండి" అని అంబర్‌పేట్‌కు చెందిన బి.చెన్నకృష్ణారెడ్డి అనే పిటిషనర్ జస్టిస్ నగేశ్ భీమపాక చాంబర్‌కు వెళ్లి వ్యాఖ్యానించారు. దాంతో, ఓపెన్ కోర్టులోనే కేసు విచారిస్తానని.. ఇలా చాంబర్‌కు వచ్చి కేసు గురించి మాట్లాడటం సమంజసం కాదని జడ్జి సదరు పిటిషనర్‌ను పంపించేశారు. సివిల్ సూట్‌కు సంబంధించి 2008లో అంబర్‌పేట్‌కు చెందిన చెన్న కృష్ణారెడ్డి హైకోర్టులో అప్పీల్ చేశారు. న్యాయవాది లేకుండా ఆయనే (పార్టీ ఇన్ పర్సన్) వాదించుకున్నారు. గతంలో విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక దానిని కొట్టివేశారు. దాంతో, మళ్లీ ఆయన రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. ఇది అదే న్యాయమూర్తి వద్ద విచారణకు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే చెన్నకృష్ణారెడ్డి ఇటీవల జడ్జి చాంబర్‌కు వెళ్లారు. దీనిపై న్యాయమూర్తి అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. ఇలా జడ్జి వద్దకు వచ్చి.. కేసు గురించి మాట్లాడకూడదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా.. సంభాషణ కొనసాగించిన సదరు వ్యక్తి.. తన ఒత్తిడి భరించలేకే ప్రత్యర్థి న్యాయవాది గుండెపోటుతో చనిపోయారని వ్యాఖ్యానించారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన న్యాయమూర్తి.. 'మీ వాదనలు ఓపెన్ కోర్టులో వింటామ'ని చెప్పి బయటకు పంపించారు. తాజాగా గురువారం ఈ పిటిషన్ జస్టిస్ నగేశ్ భీమపాక ఎదుట విచారణకు వచ్చింది. వ్యక్తిగత హోదాలో హాజరైన పిటిషనర్ చెన్నకృష్ణారెడ్డి.. కోర్టు సంప్రదాయాలను పట్టించుకోకుండా.. తీర్పు ఎందుకు ఇవ్వరంటూ ఓపెన్ కోర్టులో దురుసుగా మాట్లాడారు. దీనిపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. "మీరు నా చాంబర్‌కు వచ్చి అనుకూలంగా తీర్పు రాయాలని అడిగారు. కాబట్టి ఈ కేసు విచారణ నుంచి తప్పుకొంటున్నాను. మీ కేసు వేరే జడ్జి విచారిస్తారు. అక్కడికి వెళ్లి మీ వాదనలు వినిపించండి." అంటూ మండిపడ్డారు. సదరు పిటిషనర్ సీనియర్ సిటిజన్ కావడంతో ధిక్కరణ చర్యలు తీసుకోకుండా వదిలేస్తున్నట్లు తెలిపారు. చీఫ్ జస్టిస్ ఆదేశాల మేరకు కేసును వేరే ధర్మాసనానికి బదిలీ చేయాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేశారు.


THE CASE THAT ENDED IT ALL
నేడే విడుదల
ది కంజురింగ్ లాస్ట్ రైట్స్
THE CONJURING LAST RITES
IN ENGLISH, HINDI & TELUGU
EXPERIENCE IT IN IMAX


BOLDEST FILM EVER
FROM THE MAKERS OF
THE KASHMIR FILES & THE TASHKENT FILES
TEJ NARAYAN & SNEHLATA AGARWAL AND I AM BUDDHA PRESENT
ది బెంగాల్ ఫైల్స్
In Telugu | Hindi
A FILM BY VIVEK RANJAN AGNIHOTRI
PRODUCED BY ABHISHEK AGARWAL, PALLAVI JOSHI & VIVEK RANJAN AGNIHOTRI
IN CINEMAS TODAY
For Bulk Booking Contact +91 97696 27921
THE BENGAL FILES
SCAN THIS CODE & BOOK YOUR TICKETS ON
A 7 STUDIOS WORLDWIDE RELEASE


A ETV WIN ORIGINAL PRODUCTION
లిటిల్ హార్ట్స్
NO TOUCHING, ONLY HEART-TOUCHING
నేడే విడుదల
SAINIKPURI
VAYUPURI
SAI MARTHAND
ADITYA HASAN


SHINE SCREENS
RELEASING WORLDWIDE SEP 12 2025
కిష్కింధపురి
SAHU GARAPATI
KOUSHIK PEGALLAPATI


నేడే విడుదల
SRI LAKSHMI MOVIES
N.SRILAKSHMI PRASAD
SIVAKARTHIKEYAN IN
మదరాసి
MADHARAASI
AN A.R. MURUGADOSS FILM
AN ANIRUDH MUSICAL
SUDEEP ELAMON SREEKAR PRASAD
TAMIL TELUGU HINDI KANNADA MALAYALAM


UV creations
FIRST FRAME ENTERTAINMENTS
నేడే విడుదల
VICTIM. CRIMINAL. LEGEND.
ఘాటి
A KRISH JAGARLAMUDI FILM
PRODUCED BY RAJEEV REDDY, SAI BABU JAGARLAMUDI
amazon prime
UA

జీపీవోలకు నేడు నియామక పత్రాలు

» హామీని నిలబెట్టుకున్నాం: పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని గ్రామ పాలనాధికారుల (జీపీవో) నియామకంతో నిలబెట్టుకున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జీపీవోలకు హైటెక్స్‌లో శుక్రవారం నియామక పత్రాలను అందజేస్తామన్నారు. సచివాలయంలో రెవెన్యూ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. భూభారతి చట్టం ద్వారా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పని సరి చేసిన నేపథ్యంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను కూడా వచ్చేనెల మొదటివారం నాటికి అందుబాటులోకి తీసుకురాబోతున్నామని మంత్రి ప్రకటించారు.

ఉత్తమ టీచర్లుగా 49 మంది

» నేడు పురస్కారాలు ప్రదానం చేయనున్న సీఎం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నేడు అధికారికంగా నిర్వహించనుంది. 2025సంవత్సరానికి గాను 49మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. గచ్చిబౌలి శిల్పారామంలో జరగనున్న వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీరికి పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. మొత్తం 161 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 49 మందికి అవార్డులు ప్రకటించారు. వీరిలో 10మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, 21 మంది స్కూల్ అసిస్టెంట్లు, 12 మంది ఎస్‌జీటీలున్నారు. ఎయిడెడ్, మోడల్ స్కూల్స్, కస్తూర్బా బాలికల విద్యాలయాల నుంచి ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఖేరా భార్య నీలిమకు ఈసీ నోటీసు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4: కాంగ్రెస్ నేత పవన్ ఖేరా భార్య కోటా నీలిమకు ఎన్నికల సంఘం గురువారం నోటీసులు జారీ చేసింది. నీలిమ రెండు అసెంబ్లీ నియోజక వర్గాల ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకున్న నేపథ్యంలో ఢిల్లీ ఎన్నికల యంత్రాంగం సమాధానం కోరింది. ఢిల్లీలో ఓ నియోజకవర్గంతో పాటు తెలంగాణలోని ఖైరతాబాద్‌లో ఓటరుగా నమోదై ఉన్నట్లు అధికారులు నోటీసులో పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు, కాంగ్రెస్ మీడియా విభాగం ఇన్‌చార్జి అయిన పవన్ ఖేరాకు మాత్రమే కాదు ఆయన భార్య నీలిమకు రెండు ఓటరు ఫొటో గుర్తింపు కార్డులు (ఎపిక్‌లు) ఉన్నాయని బుధవారం బీజేపీ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై ఎన్నికల కమిషన్ (ఈసీ) ఇప్పటికే పవన్ ఖేరాకు నోటీసులు జారీ చేసింది. తాజాగా, ఆయన భార్య నీలిమకు జారీ చేసిన నోటీసుల్లో.. సెప్టెంబర్ 10లోపు వివరణ ఇవ్వాలని గడువు విధించింది.




కామారెడ్డి జీఆర్ కాలనీలో వరద బాధితులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, గురుగిద్ద గ్రామంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న రేవంత్ రెడ్డి

ఆదుకుంటాం!

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి గురువారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. బాధిత ప్రజలను పరామర్శించారు. లింగంపేట మండలం బురిగిద్ద గ్రామంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంట నష్టంపై మహిళా రైతులను అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు కన్నీటి పర్యంతం కావడంతో అండగా ఉంటామని, పంట నష్టపరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కుర్దు గ్రామం వద్ద వరదలకు తెగిన బ్రిడ్జిని పరిశీలించారు. కామారెడ్డిలోని జీఆర్ కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీలో బాధితులను పరామర్శించి భరోసా ఇచ్చారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో వరద నష్టంపై ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ.. వందేళ్లలో ఎప్పుడూ రానంతగా కామారెడ్డిలో భారీ వరదలు వచ్చాయని, జిల్లాలో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడ్డారని, వారికి జరిగిన నష్టాలను చూడడానికే ప్రత్యక్షంగా ఇక్కడికి వచ్చానని తెలిపారు. బాధిత రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వరద నష్టంపై ప్రణాళికాబద్ధంగా అంచనాలు తయారు చేసి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్ని వస్తే అన్ని నిధులు రాబట్టుకోవాలని ప్రభుత్వ యంత్రాంగానికి సూచించారు. "కేంద్రం నుంచి వచ్చిన ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులను సద్వినియోగం చేసుకోవాలి. విపత్తు సమయంలోనూ వాటిని వినియోగించుకోవడం చేతకాకపోతే ఎలా!? ప్రస్తుతం రాష్ట్రంలో రూ.1300 కోట్ల ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు ఉన్నాయి. అయినా, వాటిని సద్వినియోగం చేయకుండా రాష్ట్ర నిధుల కోసమే బిల్లులు పెడుతున్నారు. వాటిని ఖర్చు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. రోడ్ల మరమ్మతుల్లో కిలోమీటరుకు ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద లక్ష రూపాయల వరకూ సాయం అందుతుంది. దానిని కూడా వినియోగించుకోకపోతే ఎలా!?" అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఏ పనికి ఎంత వర్తిస్తే అంత మొత్తం నిధులను వినియోగించుకునేలా బిల్లులు పెట్టాలని.. అలా కాకుండా మొత్తం నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచే తీసుకునేలా పంపితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులకు వేర్వేరుగా బిల్లులు పెట్టేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. వరదల సమయంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా.. తగిన విధంగా వంతెనలు నిర్మించుకోవాలని సూచించారు. కేంద్రం నుంచి నష్ట నివారణ నిధులు రాకపోతే రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తుందని చెప్పారు. వరదల సమయంలో ప్రధాన శాఖల మధ్య సమన్వయం కొరవడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అన్ని శాఖల ఉన్నతాధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు నష్టం వాటిల్లకుండా చూడాలని సూచించారు. సమస్య వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. రాబోయే 15 రోజుల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరద నష్టంపై హైదరాబాద్‌లో జిల్లాల ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో ఉన్న ప్రధాన సమస్యలతో నివేదికలు తయారు చేసుకుని రావాలని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ముఖ గుర్తింపు హాజరు అక్కరలేదా అని ప్రశ్నిస్తూ.. దీన్ని వెంటనే అమలు చేయాలని నిర్దేశించారు.



కామారెడ్డిలో సీఎంకు గోడు వినిపిస్తున్న వరద బాధితులు

కొడంగల్‌తో సమానంగా కామారెడ్డిని అభివృద్ధి చేస్తాం

'గతంలో చెప్పాను. ఇప్పుడూ చెబుతున్నా. కొడంగల్‌కు ఎంత సాయం చేస్తున్నానో కామారెడ్డికీ అంతేసాయం చేస్తా' అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తాత్కాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించానన్నారు. సమావేశంలో యూరియా సరఫరాపైనా చర్చ జరిగింది. ఈ ప్రాంతంలో యూరియా వినియోగం ఎక్కువ ఉంటుందని.. ఒక్క బస్తా దారి మళ్లించినా ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. ప్రతి బస్తా రైతులకు అందేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు.

గత ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టులపై మాట్లాడదలచుకోలేదు

ఎంత పెద్ద ఉపద్రవం వచ్చినా.. జిల్లాలో 103 ఏళ్ల కిందట రూ.26 లక్షలతో కట్టిన పోచారం ప్రాజెక్ట్ తెగకుండా ఉందని, ఇక గత ప్రభుత్వంలో కట్టిన ప్రాజెక్టల గురించి తాను మాట్లాడదలచుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పోచారం ప్రాజెక్ట్ వరదలకు తట్టుకుని నిలబడి ఇక్కడి ప్రజలను కాపాడిందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, మదన్‌మోహన్‌రావు, తోట లక్ష్మీకాంతారావు, భూపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీలమండలో 3డీ ప్రింటెడ్ ఎముక ఏర్పాటు

» కస్టమ్-మేడ్ 3డీ ప్రింటెడ్ టైటానియం టాలస్ తయారీ

» యశోద ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసి మార్పిడి.. తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చీలమండకు గాయమై తీవ్రమైన నొప్పితో నడవలేక బాధపడుతున్న ఓ వ్యక్తికి యశోద ఆస్పత్రిలో 'కస్టమ్-మేడ్ 3డీ ప్రింటెడ్ టైటానియం టాలస్' ఎముకను రూపొందించి మార్పిడి చేశారు. సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో గురువారం ఆర్థోపెడిక్ విభాగం సీనియర్ సర్జన్ డాక్టర్.సునీల్ దాచేపల్లి దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా 3డీ ప్రింటెడ్ టైటానియం టాల్‌సతో చీలమండలోని మధ్య భాగం ఎముక మార్పిడి శస్త్ర చికిత్స చేసినట్టు చెప్పారు. కరీంనగర్ జిల్లాకు చెందిన పంకజ్ అనే వ్యక్తి గతేడాది ప్రమాదవశాత్తు జారిపడటంతో అతని కుడి కాలి చీలమండకు తీవ్ర గాయమైంది. క్రమంగా చీలమండలోని మధ్య భాగం ఎముక (టాల్‌స)కు రక్త ప్రసరణ నిలిచిపోవడంతో చీలమండ ఎముక కుళ్లిపోయింది. తీవ్రమైన నొప్పితో నడవలేని స్థితిలో ఆయన గత నెలలో తమను సంప్రదించారని డాక్టర్ సునీల్ తెలిపారు. పంకజ్ ఎడమ కాలి చీలమండ సిటీ స్కాన్ నివేదికను ఉపయోగించి బయోకాంపాజిబుల్, టైటానియంతో అత్యాధునిక 3డీ టెక్నాలజీ సాయంతో కస్టమ్ మేడ్ 3డీ ప్రింటెడ్ టైటానియంతో చీలమండ మధ్య భాగ ఎముకను రూపొందించామన్నారు. ఇటీవల శస్త్రచికిత్స చేసి పంకజ్‌కు చీలమండలో ఎముక మార్పిడి చేశామని, ఆయన ఇప్పుడు నొప్పిలేకుండా నడవగలుగుతున్నట్టు సునీల్ తెలిపారు.

రెండేళ్లలో ఎస్‌ఎల్‌బీసీ

2027 డిసెంబరు 9 నాటికి పూర్తి కావాలి

» గ్రీన్ చానల్ ద్వారా నిధులు ఇచ్చేందుకు సిద్ధం

» ఎస్‌ఎల్‌బీసీపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్‌ఎల్‌బీసీ) టన్నెల్ తవ్వకాన్ని 2027 డిసెంబరు 9వ తేదీకల్లా పూర్తి చేయాలని , అదే రోజున తెలంగాణ ప్రజలకు అంకితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పనులు ఒక్కరోజు కూడా ఆలస్యం కావడానికి వీల్లేదని నిర్దేశించారు. జూబ్లీ హిల్స్‌లోని సీఎం నివాసంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పునరుద్ధణ చేపట్టిన తర్వాత ఒక్కరోజు కూడా పనులు ఆలస్యం కారాదని నిర్దేశించారు. ఈ ప్రాజెక్టు కేవలం ఫ్లోరోసిస్ పీడిత నల్గొండ జిల్లాకే కాకుండా యావత్ తెలంగాణకు అత్యంత కీలకమని చెప్పారు. ఎస్‌ఎల్‌బీసీ పూర్తయితే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా గ్రావిటీతో నీరు అందే అవకాశం ఉందన్నారు. శ్రీశైలం నుంచి అక్కపల్లి రిజర్వాయర్ దాకా ఉన్న సమస్యలన్నీ పరిష్కారం కావాలన్నారు. "టన్నెల్ తవ్వకాన్ని ఇన్‌లెట్ (శ్రీశైలం) నుంచి టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) ద్వారా కాకుండా టన్నెలింగ్ బ్లాస్టింగ్ మెథడ్‌తో చేపట్టాలి. ఇందుకు అవసరమైన అనుమతులు సాధించాలి. సొరంగం తవ్వకానికి నిర్మాణ సంస్థ జేపీ అసోసియేట్స్ సర్వ సన్నద్ధంగా ఉండాలి. సింగరేణి నిపుణుల సేవలనూ వినియోగించుకోవాలి. టన్నెల్ తవ్వకానికి, నిరంతరం సీపేజీ నీటిని బయటికి తరలించడానికి విద్యుత్ సరఫరా చేయాలి. గతంలో జరిగిన తప్పులు, లోటుపాట్లు పునరావృతం కావద్దు. పకడ్బందీగా రక్షణ చర్యలు చేపట్టి ముందుకు సాగాలి" అని నిర్దేశించారు. ఆర్మీ సహా ఆయా రంగాల్లో నిష్ణాతుల సేవలను వినియోగించుకోవాలని, యుద్ధ ప్రాతిపదికన పనులు చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో దేశ విదేశాల్లో చేపట్టే టన్నెల్ ప్రాజెక్టులకు ఆదర్శంగా ఉండేలా ఎస్‌ఎల్బీసీ నిర్మాణం పూర్తి చేయాలని.. ఇదొక కేస్ స్టడీగా ఉండాలని చెప్పారు. ఇందుకు అవసరమైన అన్ని అనుమతులు, నిర్ణయాలు తీసుకునేందుకు ఈనెల 15లోగా క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేయాలని సీఎస్‌ను ఆదేశించారు. అటవీ శాఖ అనుమతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇన్‌లెట్.. ఔట్‌లెట్.. రెండు వైపుల నుంచి పనులు చేపట్టాలని.. అందుకు అవసరమైన యంత్ర పరికరాలతోపాటు సరిపడ నిపుణులు, కార్మికులను రంగం లోకి దింపాలని సూచించారు.

గ్రీన్ చానల్‌లో నిధులు

ఎస్‌ఎల్‌బీసీ పనులకు గ్రీన్ చానల్‌లో నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. మొత్తం 44 కిలోమీటర్ల సొరంగ మార్గానికి గాను ఇప్పటికే 35 కిలో మీటర్ల తవ్వకం పూర్తయిందని, మిగిలిన తొమ్మిది కిలోమీటర్లకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నట్టు ఇండియన్ ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా వివరించారు. ప్రతి నెల 178 మీటర్ల సొరంగం తవ్వడం లక్ష్యంగా పెట్టుకుని జనవరి 2028 నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచంలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన హెలీ-బోర్న్ సర్వే నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఎన్‌జీఆర్‌ఐ ద్వారా దీనిని నిర్వహించనున్నారు. దీంతో సొరంగం తవ్వకాల సమయంలో ముందుగానే ప్రమాదాలను పసిగట్టే వీలుంటుంది.

సీఎంతో లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్‌సింగ్ భేటీ

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకంపై సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సరిహద్దు రోడ్డు సంస్థ (బీఆర్‌వో) మాజీ డీజీ, ఆర్మీ మాజీ ఈఎన్‌సీ లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్ సింగ్ కలిశారు. ఆయన్ను ప్రభుత్వం గౌరవ సలహాదారుగా నియమించిన విషయం విదితమే. సమీక్షలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సలహాదారులు ఆదిత్యానాథ్‌దాస్, ఈఎన్‌సీలు మహ్మద్ అంజత్ హుస్సేన్, ఎన్జీఆర్ఐ డైరెక్టర్ ప్రకాశ్ కుమార్, చీఫ్ సైంటిస్ట్ హెచ్‌వీఎస్ సత్యనారాయణ, జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కేవీ మారుతి, డైరెక్టర్ శైలేంద్ర కుమర్ సింగ్, నల్గొండ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి, జెన్‌కోలకు 'ఫైవ్ స్టార్' !

» 4 బొగ్గు గనులకు, జెన్‌కోకు జాతీయ అవార్డులు

» అవార్డులు ప్రదానం చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, కొత్తగూడెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జెన్‌కో, సింగరేణి యాజమాన్యాలకు జాతీయ అవార్డులు వరించాయి. పర్యావరణ హిత చర్యలు, సంక్షేమం, సౌకర్యాల కల్పనలో ఉత్తమ సంస్థగా ఉన్న సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరానికి జాతీయస్థాయిలో 4 బొగ్గు గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్‌ను సాధించి తన ప్రతిభను మరోసారి చాటుకుంది. గురువారం ముంబైలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల మంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఈ అవార్డులను అందుకున్నారు. అలాగే, తెలంగాణ జెన్‌కో కూడా 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను తాడిచర్ల ఓపెన్‌కాస్టు-1కు ఫైవ్‌స్టార్ రేటింగ్‌తో పురస్కారాన్ని సాధించింది. జెన్‌కో అధికారులు ఈ అవార్డును కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.




జి.కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న సింగరేణి, జెన్‌కో, అధికారులు

సంతోష్‌రావు, పోలీసు అధికారులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

» పోలీసులకు నేరెళ్ల బాధితుడు కోల హరీశ్ ఫిర్యాదు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నేత, రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌రావు, ఐపీఎస్ అధికారి విశ్వజిత్ కంపాటి, సీఐ రవీందర్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నేరెళ్ల బాధితుడు కోల హరీశ్ డిమాండ్ చేశాడు. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. నేరెళ్ల సంఘటన సంతోష్‌రావు ప్రమేయంతో జరిగిందని కల్వకుంట్ల కవిత ప్రెస్‌మీట్‌లో ప్రకటించిన నేపథ్యంలో, గతంలో కోర్టులో వేసిన పిటిషన్ ఆధారంగా వారిపై ఈమేరకు ఫిర్యాదు చేశానని చెప్పాడు.

వాట్సా‌ప్‌లో ఐఐటీ, మెడికల్ స్టడీ మెటీరియల్

ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం 'కోటా'-2026 స్కూల్ లెవెల్ ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ డిజిటల్ స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్స్ సిద్ధం చేసినట్లు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం తెలిపింది. మ్యాథ్స్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌండేషన్ మెటీరియల్‌ను వాట్సాప్ ద్వారా పొందవచ్చని వెల్లడించింది. సమాచారం కోసం IITF, MEDF అని టైపు చేసి వాట్సాప్ నం:9849016661కు మెసేజ్ చేయాలని సూచించింది.

కన్నతండ్రే కాలయముడు

(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి(6), కుమారుడు శివధర్మ(4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు మోక్షిత, వర్షిణి, శివధర్మ ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని గుర్తించారు. అతను పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. అక్కడే ఉన్న అతని బైక్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దాంతో పిల్లల సంగతి తెలిసి.. వారి జాడ కనుగొనేందుకు కల్వకుర్తి డీఎస్పీ సైరెడ్డి వెంకట్ రెడ్డి, వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, వెల్దండ ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో సీసీటీవీ ఫుటేజ్‌లను జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలతో జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు పూర్తిగా కాలిపోయిన స్థితిలో కన్పించాయి. కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం లభ్యమైంది. ఆమె మృతదేహం కూడా కాలిపోయి ఉంది. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు నిర్ధారణ అయింది. పురుగులమందు తాగించి చంపి, పెట్రోల్ పోసినట్టు దహనం చేశాడని పోలీసులు భావిస్తున్నా రు. ముగ్గురు పిల్లల మృతదేహాలను పోస్టుమార్టంకు కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

'గ్లోబల్ డిజిటల్, ఇన్నోవేషన్ హబ్'గా తెలంగాణ

» 'ఏఐ' ఆర్‌అండ్‌డీ సెంటర్ ఏర్పాటు చేయండి

» డీప్-టెక్, ఏఐ స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టండి

» యూఏఈ ప్రభుత్వాన్ని కోరిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను 'గ్లోబల్ డిజిటల్, ఇన్నోవేషన్ హబ్'గా మార్చాలన్న తమ ప్రభుత్వ లక్ష్య సాధనలో యూఏఈ భాగస్వామ్యం కావాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. యూఏఈ పర్యటనలో భాగంగా ఆ దేశ ఏఐ, డిజిటల్ ఎకానమీ అండ్ రిమోట్ వర్క్ అప్లికేషన్స్ మంత్రి ఓమర్ బిన్ సుల్తాన్ అల్ ఓలామాతో గురువారం శ్రీధర్ బాబు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో తెలంగాణ భాగస్వామ్యంతో 'ఏఐ' ఆర్ అండ్ డీ సెంటర్ ను ప్రారంభించేందుకు ముందుకురావాలని మంత్రి ఓమర్ బిన్ సుల్తాన్ అల్ ఓలామాను ఆహ్వానించారు. డీప్-టెక్, ఏఐ స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టడానికి యూఏఈ సావరిన్ ఫండ్స్, వెంచర్ క్యాపిటల్ సంస్థలకు మంచి అవకాశాలున్నాయన్నారు. గేమింగ్‌లో 'తెలంగాణ-యూఏఈ ఫ్యూచర్ స్కిల్స్ అకాడమీ' ఏర్పాటుకు ముందుకురావాలని యూఏఈ ప్రభుత్వాన్ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా యూఏఈ మంత్రి ఓమర్ బిన్ సుల్తాన్ అల్ ఓలామా మాట్లాడుతూ.. ఏఐ, డిజిటల్ ఎకానమీ, క్లౌడ్, క్వాంటమ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, గేమింగ్ తదితర రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. యూఏఈ ప్రభుత్వ ఏఐ ఆధారిత 'స్టార్ గేట్' ప్రాజెక్టులో తెలంగాణ కీలక భాగస్వామిగా మారాలని ఆకాంక్షించారు. త్వరలో యూఏఈలో నిర్వహించనున్న 'ఫిన్ టెక్ స్టార్టప్స్' సమ్మిట్‌లో తెలంగాణ కంపెనీలను భాగస్వాములను చేస్తామని చెప్పారు.



యూఏఈ మంత్రి ఓమర్ బిన్ సుల్తాన్ అల్ ఓలామాతో మంత్రి శ్రీధర్ బాబు

సాంకేతిక లోపంతో 3 విమానాలు రద్దు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక లోపంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి వేర్వేరు మార్గాల్లో వెళ్లాల్సిన 3 విమాన సర్వీసులు రద్దయ్యాయి. హైదరాబాద్- తిరుపతి వెళ్లాల్సిన ఎస్‌జీ స్పైస్‌జెట్-2138 సర్వీసు, శంషాబాద్-శివమొగ్గ మధ్య తిరిగే ఎస్‌జీ 2708 విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో సర్వీసు రద్దు చేసినట్లు జీఎంఆర్ అధికారులు చెప్పారు. ఖతార్-ఫిలిప్పీన్స్ వెళుతున్న సర్వీసు 'క్యూఆర్ 936' విమాన ప్రయాణికుడొకరు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. మరమ్మత్తు తర్వాత సాంకేతిక లోపంతలెత్తడంతో ఆ విమాన సర్వీస్‌నూ రద్దు చేశారు. మరోవైపు, ఢిల్లీలో భారీ వర్షాల వల్ల ఢిల్లీ- శంషాబాద్ మధ్య నడిచే విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయి.

ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఆయన పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఐటీసీ పేరు ప్రఖ్యాతులు, విశ్వసనీయతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీలో చేరకముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. మార్కెటింగ్ రంగంలో 30 ఏళ్ల అనుభవం ఉన్న కరుణేష్ బజాజ్.. తన పదవీ కాలంలో ఏబీసీ పురోగతికి మార్గదర్శిగా నిలుస్తారని ఆ సంస్థ సెక్రటరీ జనరల్ ఆదిల్ కసద్, ప్రతినిధులు పేర్కొన్నారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు

- ఒకే దేశం ఒకే పన్ను పేరిట ఇప్పటిదాకా 9 పన్నులు వేశారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కొత్త జీఎస్టీ శ్లాబులతో రాష్ట్రాలు ఆదాయాన్ని నష్టపోతున్నందున 2024-25 నుంచి ఐదేళ్లపాటు కేంద్రం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందిస్తూ.. చిన్న, మధ్యతరగతి పరిశ్రమలను, ప్రజానీకాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన జీఎస్టీని సరళీకరించాలని తాము దాదాపు పదేళ్లుగా కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని గుర్తు చేశారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, దేశ చరిత్రలో రైతుల మీద పన్ను విధించటం ఇదే తొలిసారన్నారు. మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని, కేవలం 3 శాతం మాత్రమే శత కోటీశ్వరుల నుంచి వస్తోందని, అయినప్పటికీ, మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

- జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. జీఎస్టీ తగ్గింపు లబ్ధిని పూర్తి స్థాయిలో ప్రజలకు అందించాలని పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని మంత్రి పేర్కొన్నారు. దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. జీఎస్టీ సంస్కరణల వల్ల దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందన్నారు. ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ సంస్కరణలు దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడతాయని గోయల్ చెప్పారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర మంత్రి గోయల్ మాట్లాడారు

13న మణిపూర్‌కు మోదీ!

మిజోరంలోనూ పర్యటించనున్న ప్రధాని

ఐజ్వాల్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ప్రధానమంత్రి మోదీ ఈనెల 13న మిజోరం, మణిపూర్ రాష్ట్రాల్లో పర్యటించే అవకాశం ఉంది. ఈ మేరకు తమకు సమాచారం అందిందని మిజోరంలోని పలువురు ప్రభుత్వ అధికారులు గురువారం వెల్లడించారు. అయితే, తుది ప్రయాణ ప్రణాళిక తమకు ఇంకా అందలేదని తెలిపారు. కాగా, మణిపూర్ అధికారులు మాత్రం ప్రధాని పర్యటనను నిర్ధారించలేదు. 2023 మే నెలలో మణిపూర్‌లో కుకీ, మైతీ తెగల మధ్య హింస చెలరేగిన తర్వాత ప్రధాని తొలిసారిగా ఆ రాష్ట్రంలో పర్యటించనున్నారు.

శాంతి ఒప్పందంపై సంతకాలు..

మణిపూర్‌లో శాంతి పునరుద్ధరణకు రెండు ప్రముఖ కుకీ-జో గ్రూపులతో ప్రభుత్వం గురువారం ఒప్పందం చేసుకుంది. మణిపూర్ ప్రాదేశిక సమగ్రతను కొనసాగించడం, దుర్బల ప్రాంతాల నుంచి శిబిరాలను తరలించడం, రాష్ట్రంలో శాంతి-స్థిరత్వం పునరుద్ధరణ కోసం కలిసి పనిచేయడానికి అంగీకరించిన నిబంధనలు, షరతులను ఒప్పందంలో పొందుపరిచారు. ఒప్పందంపై కేఎన్‌వో(కుకీ నేషనల్ ఆర్గనైజేషన్), యూపీఎఫ్(యునైటెడ్ పీపుల్స్ ఫ్రంట్) సంతకాలు చేశాయి. కేంద్ర హోంశాఖ, మణిపూర్ ప్రభుత్వం, కేఎన్‌వో, యూపీఎఫ్ ప్రతినిధులు గురువారం ఢిల్లీలో సమావేశమై ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రుల పైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రుల పైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.



పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్లచరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

లోకం తీరు



కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

దాడులు నిర్వహించారు. ఐదు విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. వీరేంద్రకు 9 బ్యాంకు ఖాతాలు, ఒక డీమ్యాట్ అకౌంట్, 262 మ్యూల్ ఖాతాలు ఉన్నట్లు ఈడీ గుర్తించింది. చెళ్లకెర నగరంలోని కొటక్ మహీంద్ర బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లో ఈడీ అధికారులు సోదాలు చేశారు. వీరేంద్ర పప్పీతో పాటు ఆయన కుటుంబీకుల బ్యాంకు ఖాతాలను పరిశీలించారు. వారికి ఎక్కడి నుంచి నగదు జమ అయ్యింది, ఏఏ ఖాతాలకు బదిలీ చేశారనే వివరాలను సేకరించారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి దాన్ని 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారంగా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో విండో డెకరేటర్‌గా పనిచేశారు. అనంతరం ఫ్యాషన్ రంగంపై దృష్టి సారించి విజయం సాధించారు.

కవితను బీజేపీలోకి తీసుకోం

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే యూరియా కొరత

- ఏమీ సాధించలేకే మోదీపై విమర్శలు: రాంచందర్‌రావు
- జీఎస్టీ శ్లాబ్‌ల తగ్గింపుతో సామాన్యులకు మేలు
- మోదీ చిత్రపటానికి మహిళా మోర్చా పాలాభిషేకం



హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన కల్వకుంట్ల కవితను తమ పార్టీలోకి తీసుకోబోమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. బీజేపీలో అవినీతిపరులకు చోటు లేదన్నారు. కవిత సస్పెన్షన్, రాజీనామా అంతా వారి కుటుంబ గొడవ అని, వాటిపై స్పందించాల్సిన అవసరం తమకు లేదని పేర్కొన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కవల పిల్లలు అని, రాష్ట్రాన్ని లూటీ చేసిన పార్టీని మరో పార్టీ కాపాడుతోందని ఆరోపించారు. సీబీఐ విచారణ ఒక్క మేడిగడ్డపై మాత్రమే కాకుండా మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుపై జరపాలని డిమాండ్ చేశారు. "సామాన్యులు, రైతులు, మధ్యతరగతి, యువతకు నేరుగా ఆర్థిక ఊరట కలిగించేలా జీఎస్టీ స్లాబ్‌లను సులభతరం చేసి ప్రధాని మోదీ చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. అత్యవసర వస్తువులపై పన్ను తగ్గింపును స్వాగతిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ ఏమీ సాధించలేక.. ప్రధాని మోదీపై విమర్శలు చేస్తోంది. మోదీ మాతృమూర్తిని దూషించేలా చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది" అని రాంచందర్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు. కేంద్రం సరఫరా చేసిన యూరియా బ్లాక్‌మార్కెట్‌కు తరలకుండా, దళారుల చేతికి అందకుండా చూడడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మహబూబ్‌నగర్‌లో కొంతమంది కాంగ్రెస్ నాయకులే యూరియా బస్తాలను ఎత్తుకుపోయినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. కాగా, జీఎస్టీ శ్లాబులు తగ్గించి మోదీ ప్రభుత్వం సామాన్యులకు మేలు చేసిందంటూ బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

బీఆర్ఎస్‌కు దోచిపెడుతున్న గ్రానైట్ వ్యాపారులు: బండి

కరీంనగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రానైట్ వ్యాపారులు బీఆర్ఎస్ పార్టీకి 20 ఏళ్లుగా డబ్బులు దోచి పెడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. వందల కోట్లు దోచి పెట్టారని, ఇంకెన్నాళ్లు దోచి పెడతారని ప్రశ్నించారు. గురువారం కరీంనగర్‌లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించడానికి వచ్చిన కేంద్ర మంత్రిని గ్రానైట్ వ్యాపారులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "సమాజానికి సేవ చేయాలన్న ఆలోచన మాత్రం మీకు రావడంలేదు. ఒక్కో గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీ నుంచి సభ్యత్వం పేరుతో గ్రానైట్ అసోసియేషన్ నాయకులు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వసూలు చేశారు. 500 ఫ్యాక్టరీల నుంచి వసూలు చేసినట్లు సమాచారం ఉంది. వాటిని ఏం చేశారో చెప్పాలి" అని సంజయ్ అన్నారు.

కేసీఆర్‌కు మచ్చ తెచ్చింది కవితే!

(మొదటిపేజీ తరువాయి)



మాయని మచ్చ తెచ్చారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో ఉంటూనే.. మూడు నెలలుగా కవిత వ్యవహరించిన తీరు, చేసిన విమర్శలతో పార్టీకి ఎంతో నష్టం కలిగిందన్నారు. ఈ సమయంలో పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయం గొప్పదని, కవితపై సస్పెన్షన్‌ను స్వాగతిస్తున్నామని తెలిపారు. కవిత చేసిన వ్యాఖ్యలను ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కేసీఆర్ కూతురుగా కవిత ఎక్కడికి వెళ్లినా ప్రజలు గౌరవించి ఘనంగా ఆదరించారని, కానీ.. ఆ గౌరవాన్ని ఆమె నిలుపుకోలేకపోయారని పేర్కొన్నారు. "అందరికీ అందుబాటులో ఉండి పనులు చేసే హరీశ్‌ను బలహీనపరిచేలా వ్యాఖ్యలు చేస్తే తెలంగాణకు నష్టం కాదా? కవిత చేస్తున్న అసత్య ఆరోపణలను తెలంగాణ సమాజం నమ్ముతుందా?" అని పద్మా దేవేందర్‌రెడ్డి ప్రశ్నించారు.

మత్స్యకార సభ్యత్వాలకు 20 వేలు లంచం

- ఏసీబీకి చిక్కిన నల్లగొండ మత్స్యశాఖ ఏడీ




లంచం తీసుకుంటూ పట్టుబడ్డ చరితారెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార సొసైటీలో నూతన సభ్యత్వాలను నమోదు చేయడం కోసం రూ.20 వేలు లంచం తీసుకుంటూ నల్లగొండ జిల్లా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని ఓ మత్స్యకార సొసైటీలో సభ్యత్వాల నమోదు కోసం 17 మంది జిల్లా కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ కార్యాలయం చుట్టూ కొన్నిరోజులుగా తిరుగుతున్నారు. వారి అభ్యర్థనను పదేపదే తిరస్కరిస్తూ వచ్చిన మత్స్యశాఖ జిల్లా అధికారి చరితారెడ్డి రూ.70 వేలు ఇస్తేనే సభ్యత్వాలు ఇస్తానంటూ స్పష్టం చేశారు. దీంతో బాధితుడు శ్రీనివాస్ రూ.50 వేలు ఇస్తానని ఆమెతో ఒప్పందం కుదుర్చుకుని, గత నెల 29న ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఒప్పందంలో భాగంగా గురువారం రూ.20 వేలు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు అధికారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హైదరాబాద్ వనస్థలిపురంలో ఉన్న ఆమె నివాసంలోనూ సోదాలు చేశారు. చరితారెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చందర్ తెలిపారు. ప్రభుత్వ అధికారులు లంచాలు డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 1064కు సంప్రదించాలని, బాధితుల పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కాగా చరితారెడ్డిపై ఇదివరకే పలు అవినీతి ఆరోపణలున్నాయి. 2016-17 సంవత్సరంలోనూ చేపపిల్లల పంపిణీలో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో అప్పుడు విజిలెన్స్ విచారణను ఎదుర్కొన్నట్లు తెలిసింది.

నాకు మంచి గుర్తింపు తెచ్చే సినిమా

- మనోజ్ మంచు



"మిరాయ్' నాకు కమ్‌బ్యాక్ ఫిల్మ్ అవుతుంది. ట్రైలర్ విడుదలయ్యాక నా నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇంత అద్భుతమైన పాత్రను ఇచ్చిన దర్శకుడు కార్తీక్ ఘట్టమనేనికి రుణపడి ఉంటాను' అని మంచు మనోజ్ అన్నారు. తేజ సజ్జా కథానాయకుడిగా టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన 'మిరాయ్' ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రతినాయక పాత్ర పోషించిన మనోజ్ మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

- ఈ చిత్రం కథానేపథ్యం కొత్తగా ఉంటుంది. శ్రీరాముని జీవితం, తొమ్మిది పుస్తకాలు, ఇతిహాసాలను మిళితం చేస్తూ సినిమాను అద్భుతంగా రూపొందించారు. ఇందులో నా పాత్ర చాలా శక్తిమంతంగా ఉంటుంది. బద్ధకస్తుడు బతికి ఉండకూడదు అనే తాత్వికతతో ప్రవర్తించే పాత్ర నాది.
- ఈ సినిమా కోసం ముందుస్తుగా సన్నద్ధమయ్యాను. దాదాపు మూడేళ్లు షూట్ చేశాం. మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నాను. తేజ పడిన కష్టం తెరపైన మీకు కనిపిస్తుంది. కార్తీక్ సాంకేతికతను ఉపయోగించుకోవడంలో దిట్ట. మరో దర్శకుడు ఈ చిత్రాన్ని తీయాలంటే ఈ బడ్జెట్‌లో అసాధ్యం. తన అనుభవంతో కార్తీక్ హాలీవుడ్ స్థాయిలో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడు. దాదాపు సినిమా అంతా రియల్ లొకేషన్లలోనే షూట్ చేశాం. కార్తీక్ గారు ప్రత్యేక శ్రద్ధతో నా పాత్రను తీర్చిదిద్దారు. విశ్వప్రసాద్ గారి విజన్ చాలా గొప్పగా ఉంటుంది. 'మిరాయ్'ను గ్రాండ్ స్కేల్లో నిర్మించారు. ప్రస్తుతం డేవిడ్ రెడ్డి, రక్షక్ చిత్రాల్లో నటిస్తున్నాను.

నేను చేసిందల్లా వారికి స్వేచ్ఛనివ్వడమే

- దుల్కర్ సల్మాన్



ప్రతిభావంతులైన నటీనటులు, గొప్ప సాంకేతిక నిపుణుల పనితనంతోనే 'లోక-చాప్టర్ 1: చంద్ర' లాంటి మంచి చిత్రాన్ని నిర్మించగలిగాం. నిర్మాతగా నేను చేసిందల్లా వారికి స్వేచ్ఛనివ్వడమే. ఒక్కసారి మాత్రమే షూటింగ్‌కు వెళ్లాను అంటే నేను వారిని ఎంతలా నమ్మానో మీరు అర్థం చేసుకోవచ్చు' అని దుల్కర్ సల్మాన్ అన్నారు. ఆయన నిర్మాతగా డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'మలయాళంలో ఓ చిన్న సినిమా చేస్తున్నాను' అని కల్యాణి ప్రియదర్శన్ ఓ సందర్భంలో చెప్పారు. ఇప్పుడు ఆ సినిమా రూ. 100 కోట్ల వసూళ్లను సాధించి మంచి ఆదరణతో కొనసాగుతోంది. సినిమా సాంకేతికంగా ఉన్నతంగా ఉంది. రెండో భాగం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని చెప్పారు. 'ఒక సూపర్‌హిట్ సినిమాను తెలుగులో విడుదల చేసినందుకు ఆనందంగా ఉంది' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. 'కొత్తలోక' చిత్రాన్ని తెలుగు సినిమాలా ఆదరిస్తున్న ప్రేక్షకులకు రుణపడి ఉంటాను అని కల్యాణి ప్రియదర్శన్ అన్నారు. మా సినిమాకు ఈ స్థాయి స్పందనను ఊహించలేదు, ప్రేక్షకాదరణకు చాలా సంతోషంగా ఉందని డొమినిక్ అరుణ్ తెలిపారు.

ఇద్దరి అభిరుచులు ఒకటే

-శివకార్తికేయన్



'అమరన్'తో భారీ విజయాన్ని అందుకున్న శివకార్తికేయన్ నటించిన తాజా చిత్రం 'మదరాసీ'. మురుగదాస్ దర్శకత్వంలో ఎన్వీ ప్రసాద్ నిర్మించారు. ఈ రోజు సినిమా విడుదలవుతోన్న సందర్భంగా శివకార్తికేయన్ మీడియాతో ముచ్చటించారు. 'ఈ సినిమా కథ చాలా కొత్తగా ఉంటుంది. ఇందులో లవ్, యాక్షన్ రెండు పిల్లర్స్ లాంటివి. బిగ్‌స్క్రీన్‌పై సెలబ్రేట్ చేసుకునేలా ఉండే ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. మురుగదాస్ చాలా కూల్‌గా ఉంటారు. ఎంతో మంది పెద్ద స్టార్స్‌తో సినిమాలు చేసిన ఆయన నాతో వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తా. రుక్మిణీ వసంత్ పాత్ర చాలా కీలకంగా ఉండి సినిమాను మలుపు తిప్పుతుంది. విజువల్స్ ప్రత్యేకార్షణగా నిలుస్తాయి. అనిరుధ్ సంగీతం సినిమాను మరోస్థాయికి తీసుకువెళ్తుంది. సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుంది' అని చెప్పారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ఆసక్తికరంగా 'ఆల్కహాల్'



అల్లరి నరేశ్ కథానాయకుడిగా మెహర్ తేజ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఆల్కహాల్'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 1న విడుదల కానుంది. తాజాగా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఉత్కంఠభరితమైన థ్రిల్లర్ డ్రామా అని తెలిసేలా టీజర్‌ను అద్భుతంగా రూపొందించారు. మద్యం కథానాయకుడి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో, తాగడానికి ముందు, తాగిన తర్వాత అతని ప్రవర్తన, ఆ సమయంలో జరిగే సంఘటనల సమాహారాన్ని టీజర్ సూచిస్తోంది.

పరిసరాలే కథా వస్తువులు

- చింతకింది శ్రీనివాసరావు



'ప్రపంచస్థాయి కథలైనా మన పరిసరాల్లోనే ఉంటాయి. అవి మనిషి కేంద్రంగా తిరుగుతుంటాయి. మన చుట్టూ నిత్యం నడయాడుతున్న ఘటనలు, సంఘటనలే నా రచనలకు ప్రేరణగా నిలుస్తాయి' అని అన్నారు రచయిత చింతకింది శ్రీనివాసరావు. ఆయన కథను అందించిన 'ఘాటి' సినిమా నేడు విడుదలవుతోంది. అనుష్కశెట్టి, విక్రమ్ ప్రభు జంటగా నటించారు. ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు 'చిత్రజ్యోతి'తో మాట్లాడుతూ 'మనిషి కథ చెప్పడం వర్తమాన సాహితీ రంగంలో అత్యంత ఆవశ్యకం. మానవ జీవితంలో సామాజిక స్వభావం తెస్తున్న మార్పులు, తన చుట్టూ జరుగుతున్న పరిణామాలు కథలుగా రావాలి. వలస జాలర్ల జీవితాన్ని అక్షరబద్ధం చేసిన 'మున్నీటి గీతలు' నవల, ఇప్పుడీ 'ఘాటీ' చిత్ర కథ ఆ స్ఫూర్తితోనే రాశాను. 'మున్నీటి గీతలు' నవల 'అరేబియా కడలి' వెబ్‌సిరీస్‌గా రూపుదిద్దుకుంది. సాహితీ రంగానికి చెందిన నన్ను 'ఘాటి' చిత్రం ద్వారా తెలుగు సినిమా తెరకు పరిచయం చేస్తున్న దర్శకుడు క్రిష్‌కు కృతజ్ఞతలు' అని అన్నారు.



పాప్‌కార్న్ ఓకే.. 'కారమెల్'కు ఎఫెక్ట్

పాప్‌కార్న్‌పై ఇటీవలి వరకు ఉన్న విమర్శలకు తాజాగా చెక్ పడింది. ఇంతకుముందు పాప్‌కార్న్ విడిగా అమ్మితే 5%, ప్యాక్ చేస్తే 12%, కారమెల్ (తీపి) ఫ్లేవర్ కలిపితే 18% పన్ను ఉండేది. ఇకపై విడిగా, ప్యాక్ చేసినా 5శాతమే పన్ను ఉంటుంది. కారమెల్‌పై మాత్రం 18% పన్ను కొనసాగుతుంది.



ఫిట్‌నెస్‌కు, అందానికి ఖర్చు తగ్గినట్టే!

జిమ్‌లు, యోగా కేంద్రాలు, హెల్త్ క్లబ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్లు, సెలూన్లు, బార్బర్లు తదితర సేవలపై ఇప్పటివరకు 18శాతం పన్ను ఉండగా.. ఇప్పుడు 5శాతానికి తగ్గించారు. దీనితో ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం, అందం కోసం చేసే ఖర్చు కాస్త తగ్గనుంది.



ఫుడ్ డెలివరీ మరికొంత భారం!

స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీతోపాటు బ్లింక్ ఇట్, స్విగ్గీ ఇన్‌స్టా వంటి గ్రోసరీ డెలివరీ సేవలపై కొత్తగా 18% జీఎస్టీ విధించారు. డెలివరీ చార్జీలపై ఈ పన్ను వర్తిస్తుంది. ప్రస్తుతం ఒక్కో జొమాటో ఆర్డర్‌పై రూ.2, స్విగ్గీ ఆర్డర్‌పై రూ.2.6, ఇన్‌స్టామార్ట్ ఆర్డర్‌పై రూ.1 వరకు భారం పడుతుంది.




రూ.100లోపు సినిమా టికెట్లపై తగ్గిన పన్ను

సినిమా థియేటర్లలో రూ.100 లోపు ధర ఉండే టికెట్లపై పన్నును 12% నుంచి 5%కు తగ్గించారు. అంటే సింగిల్ స్క్రీన్ థియేటర్లకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా చిన్న నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లోని థియేటర్లలో టికెట్ రేట్లకు ఉపశమనం ఎక్కువగా ఉండనుంది.



ఐపీఎల్ టికెట్లపై పన్ను మోత

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు, ఇతర గుర్తింపు లేని క్రీడా కార్యక్రమాల టికెట్లపై జీఎస్టీని 28% నుంచి 40 శాతం ప్రత్యేక పన్నురేటులోకి మార్చారు. దీనితో వాటి టికెట్ల ధరలు బాగా పెరుగుతాయి. ఉదాహరణకు రూ.1000 ఐపీఎల్ టికెట్‌పై పన్ను కలిపి రూ.1,400 అవుతుంది. ప్రత్యేకంగా గుర్తించిన క్రీడా కార్యక్రమాలకు 18% జీఎస్టీ కొనసాగనుంది.



రాష్ట్రపతి బీఎండబ్ల్యూ కారుకు జీఎస్టీ మినహాయింపు

కేంద్రం రాష్ట్రపతి కోసం కొనుగోలు చేస్తున్న బీఎండబ్ల్యూ 7 సిరీస్ కారుకు జీఎస్టీ మినహాయింపు ఇచ్చారు. దీని విలువ సుమారు రూ.3.66 కోట్లు. అత్యాధునిక భద్రత సదుపాయాలు ఉన్న ఈ కారును రాష్ట్రపతి భద్రత కోసం కొనుగోలు చేస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు జీఎస్టీ కౌన్సిల్ పేర్కొంది. రాష్ట్రపతి ప్రస్తుతం మెర్సిడెస్ బెంజ్ ఎస్600 పుల్‌మన్ లిమోజిన్ వాడుతున్నారు.



బీడీలు చవక.. సిగరెట్లపై మోత!

సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులను 40 శాతం ప్రత్యేక పన్ను రేటులోకి చేర్చిన జీఎస్టీ కౌన్సిల్.. బీడీలను మాత్రం 28శాతం నుంచి 18శాతం పన్నురేటుకు మార్చింది. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. బీడీల ధరలు మాత్రం తగ్గే అవకాశం ఉంది. మన దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది మంది బీడీల తయారీపై ఆధారపడి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు.

చక్కెర కలిపితే 'ధర' చేదు!

సహజ, కృత్రిమ చక్కెరలు కలిపిన శీతల పానీయాలు, కృత్రిమ పళ్ల రసాలు, ఇతర పానీయాలను 'హానికర పదార్థాల కేటగిరీతోపాటు 40శాతం ప్రత్యేక పన్ను రేటులో చేర్చడం గమనార్హం. దీనితో శీతల పానీయాలు, ఐస్ టీలు, కెఫీన్ కలిపిన పానీయాలు, ఎనర్జీ డ్రింకులు వంటివాటి ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇదే కారణంతో కారమెల్ తీపి పదార్థం కలిపిన పాప్‌కార్న్‌ను కూడా 18శాతం పన్ను రేటులో కొనసాగించారు. సాధారణ పాప్‌కార్న్‌పై 5శాతమే పన్ను వేశారు. మరోవైపు చక్కెర కలిపేవే అయినా.. పళ్ల రసాలు, పాల ఆధారిత పానీయాలు, ఐస్ క్రీమ్, పేస్ట్రీలు, సంప్రదాయ మిఠాయిలపై పన్ను రేటును 5శాతానికే పరిమితం చేశారు.



ఐస్‌క్రీమ్‌లు మరింత తీపి..

పాలు, పాల ఉత్పత్తులపై వసూలు చేస్తోన్న జీఎస్టీ అంశంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఐస్‌క్రీమ్‌ల ధరలు బాగా తగ్గనున్నాయి. ఉత్పత్తిదారు లేదా ఐస్‌క్రీమ్ పార్లర్లు, రిటైల్ దుకాణాల్లో విక్రయించే ఐస్‌క్రీములపై జీఎస్టీని 18% నుంచి 5 శాతానికి తగ్గించారు. ఉదాహరణకు ఓ ఐస్‌క్రీమ్ ధర రూ.100 అయితే 18 శాతం జీఎస్టీ కలిపి రూ.118 అయ్యేది. ఇప్పుడు రూ.105కు తగ్గుతుంది. ఇక నెయ్యి, వెన్న, చీజ్ వంటి వాటిపై ప్రస్తుతం 12% ఉన్న పన్నును ఐదు శాతానికి తగ్గించారు. ఈ నిర్ణయాలు వినియోగదారులతోపాటు పాడి రైతులకు, డెయిరీ పరిశ్రమకు లబ్ధి చేకూరుస్తాయని కేంద్రం ప్రకటించింది. వెన్న, నెయ్యి, పాలు విక్రయానికి వాడే ఇనుము, స్టీల్, అల్యూమినియం డబ్బాలపై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించడం కూడా డెయిరీ రంగానికి ఊరటనిచ్చే అంశమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.



తగ్గనున్న హోటల్ గదుల అద్దెల భారం.. పర్యాటకానికి ఊతం

రోజుకు రూ.7,500లోపు అద్దె ఉండే హోటల్ గదులపై జీఎస్టీని ప్రభుత్వం 5 శాతానికి తగ్గించింది. ఈ నిర్ణయం పర్యాటక రంగానికి ఊతమిస్తుందనే హర్షం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం రూ.వెయ్యి- 7,500 లోపు అద్దె గదులపై 12% జీఎస్టీ ఉంది. తాజా తగ్గింపుతో పర్యాటకులపై అద్దె భారం తగ్గనుంది. ప్రస్తుతం రూ.6వేలు అద్దె అయితే 12% జీఎస్టీ కలిపి రూ.6,720 చెల్లించాలి. అదే సెప్టెంబరు 22 నుంచి రూ.6,300 చెల్లిస్తే చాలు. కాగా, సెప్టెంబరు 22నుంచి రూ.7500 పైబడిన అద్దె ఉండే గదులను 18 శాతం జీఎస్టీ పరిధిలోకి వస్తాయి.





బిజినెస్ క్లాస్ ఫ్లైట్ టికెట్లు మరింత ప్రియం

ఈ నెల 22 నుంచి విమానాల్లో ఎకానమీ మినహా బిజినెస్, ఫస్ట్ క్లాస్ టికెట్ల ధరలు పెరగనున్నాయి. ఎకానమీ టికెట్లపై జీఎస్టీ 5% మార్చలేదు. బిజినెస్, ఫస్ట్ క్లాస్ టికెట్లపై జీఎస్టీని 12 శాతం నుంచి 18 శాతానికి పెంచారు. ఫలితంగా విమానాల్లో సౌకర్యవంతంగా, విలాసవంతంగా ప్రయాణించాలంటే మరింత డబ్బు చెల్లించాల్సిందే. అయితే, ధరలు పెరిగితే ఎకానమీ క్లాస్ టికెట్లకు డిమాండ్ పెరుగుతుందని విమానయాన రంగానికి చెందిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

షికారు కోసం కాస్త ఆగండి!



ఈ నెల 22 నుంచి కొత్త పన్ను రేట్లతో గణనీయంగా తగ్గనున్న కార్ల ధరలు

- రూ.80 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ఆదా
- జీవితకాల పన్ను, రిజిస్ట్రేషన్ చార్జీల ఉపశమనం కూడా
- రూ. 10లక్షల్లోపు కార్ల విక్రయాలు పెరుగుతాయని అంచనా
- ద్విచక్ర వాహనాలపై రూ.10-25 వేల వరకు మిగిలే చాన్స్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొత్త కారు కొనుక్కుని షికారు చేయాలను కుంటున్నారా? షోరూమ్‌కు వెళ్లడానికి సిద్ధమవుతున్నారా?.. కాస్త ఆగండి. జీఎస్టీ పన్ను రేట్ల మార్పు ప్రయోజనాన్ని పొందేందుకు కాస్త ఓపిక పట్టండి. ఈనెల 22 తర్వాత కార్ల ధరలు తగ్గనున్నాయి. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఆదరించే చిన్న, మధ్యతరహా కార్లపై రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు మిగలనున్నాయి. అయితే జీఎస్టీ మార్పుతో కొన్నికార్ల ధరలు పెరుగుతాయని, ఇప్పుడే కొనుక్కోండి అని కొందరు డీలర్లు గందరగోళానికి గురిచేస్తున్నారని, దీనిపై జాగ్రత్తగా ఉండాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

కొన్ని నెలలుగా మందకొడిగా విక్రయాలు..

రాష్ట్రంలో గత ఏడాదితో పోలిస్తే ఈసారి కార్ల కొనుగోళ్లు తగ్గాయి. తాజాగా కార్లపై జీఎస్టీ 28శాతం నుంచి 18శాతానికి తగ్గుతుండటంతో కొనుగోళ్లు తిరిగి పుంజుకుంటాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాలు కొనుగోలు చేసే చిన్న కార్లకు మార్కెట్‌లో గిరాకీ పెరగనుంది. మారుతి స్విఫ్ట్, వ్యాగన్ ఆర్, బాలెనో, టాటా పంచ్, టియాగో, ఆల్ట్రోజ్, రెనో క్విడ్, హ్యుందాయ్ ఐ10 తదితర వాహనాలపై సుమారు రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు తగ్గుతాయని డీలర్లు చెబుతున్నారు. ఇక ప్రస్తుతం జీఎస్టీ, అదనపు సెస్‌లు కలిపి 42-50% వరకు పన్ను విధించిన విలాసవంతమైన కార్ల 40% జీఎస్టీ వేయడం, సెస్‌లు ఎత్తివేస్తుండటంతో భారీ ప్రయోజనం ఉంటుందని డీలర్లు చెబుతున్నారు. హ్యుందాయ్ క్రెటా, మారుతీ గ్రాండ్ విటారా, మహీంద్రా ఎక్స్‌యూవీ 700, టయోటా ఇన్నోవా, టాటా హారియర్ వంటి కార్ల కొనుగోలు దారులకు ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు. వీరికి రూ.2 లక్షల నుంచి 4 లక్షల వరకు ప్రయోజనం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

జీఎస్టీతోపాటు ఇతర పన్నుల ఉపశమం

వాహనం మూల ధరపై జీఎస్టీని కలిపి ఎక్స్‌షోరూం ధరను నిర్ణయిస్తారు. ఈ ఎక్స్‌షోరూం ధరపైనే రవాణాశాఖ జీవితకాల పన్ను, రిజిస్ట్రేషన్, ఇతర చార్జీలను వసూలు చేస్తుంది. ప్రస్తుతం జీఎస్టీ తగ్గుతుండటంతో రవాణాశాఖ పన్నులు, చార్జీలు కూడా తగ్గుతాయి. బీమా సంస్థలు కూడా వాహనం ధర ఆధారంగా ప్రీమియం నిర్ణయిస్తాయి. ఈ లెక్కన బీమా ప్రీమియం కూడా తగ్గుతుంది. దీనితో మొత్తంగా వాహనం కోసం వినియోగదారులు చేసే ఖర్చు తగ్గనుంది.



మధ్య స్థాయి కార్ల ధరలు పెరగొచ్చు!

1200 సీసీ సామర్థ్యం, 4 మీటర్ల పొడవు లోపున్న కార్లపై జీఎస్టీని 18శాతానికి తగ్గించిన ప్రభుత్వం.. ఆపై సామర్థ్యం, పొడవు ఉన్న కార్లను 40శాతం పన్నురేటుకు మార్చింది. అయితే విలాసవంతమైన కార్లపై ఉన్న అదనపు సెస్‌ల కారణంగా వాటిపై ఇప్పటికే 42-50శాతం వరకు పన్నులు ఉన్నాయి. ఇప్పుడు సెస్‌లు తగ్గించడంతో ఈ కార్లపై భారం తగ్గుతుంది. అయితే నిర్ధారిత సీసీ సామర్థ్యం, పొడవు కన్నా ఎక్కువగా ఉండి.. సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల మధ్య ధర ఉన్న పలు కార్లపై ప్రస్తుతం 28శాతం జీఎస్టీ మాత్రమే ఉందని, సెస్‌లు లేవని రవాణాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడవి 40శాతం పన్ను రేటులోకి మారడం వల్ల వాటి ధరలు పెరిగే అవకాశం ఉందని అంటున్నాయి. అయితే అవి ఏయే మోడళ్లు అన్నదానిపై పూర్తి స్పష్టత లేదు.

ఆఫర్లు చూపుతూ అమ్ముకునే యత్నంలో డీలర్లు

జీఎస్టీ తగ్గింపుతో ఇప్పటికే కార్లను బుక్ చేసుకున్న వారు కూడా డెలివరీ తీసుకోవడానికి ముందుకు రావడం లేదని డీలర్లు చెబుతున్నారు. ఈ నెల 22 తర్వాత పూర్తి సొమ్ము చెల్లించి, కొత్త జీఎస్టీ ప్రకారం తక్కువ ధరకు తీసుకోవాలని భావిస్తున్నారని అంటున్నారు. కొత్తగా కొనుగోలు చేసేందుకు ఎవరూ రావడం లేదని చెబుతున్నారు. ఈ క్రమంలో కొందరు డీలర్లు మధ్యస్థాయి, పెద్ద కార్లపై సెస్‌లు కొనసాగుతాయని, ధరలు పెరుగుతాయని.. ఇప్పుడే కారు కొనడం మంచిదని చెబుతున్నట్టు తెలిసింది. కానీ ప్రభుత్వం సెస్‌లను తొలగించనుందని రవాణాశాఖ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ద్విచక్ర వాహన కొనుగోలుదారులు కూడా వేచి చూసే ధోరణిలోనే ఉన్నారని.. రూ.10-25వేల వరకు కలిసి వస్తున్నప్పుడు హడావుడిగా కొనడం ఎందుకనే భావనలో ఉన్నారని చెబుతున్నారు.



బీమాపై భారం తగ్గేది కొంతే..!

అన్ని రకాల జీవిత, ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంపై పన్నును జీఎస్టీ పాలకమండలి పూర్తిగా ఎత్తేసింది. దీంతో పాలసీ ధరలు దిగిరానున్నాయి. పాలసీ కొనుగోలుదారులకు ఇది శుభవార్త అని, పాలసీ కొనుగోళ్ల దిశగా ప్రజలను ప్రోత్సహించినట్టు అవుతుందని బీమా సంస్థల వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, జీఎస్టీని రద్దు చేయడం వల్ల పాలసీ కొనుగోలుదారులకు పూర్తి ప్రయోజనం దక్కుతుందా? అంటే ప్రస్తుతానికి కాదు అనే సమాధానమే వస్తుంది. బీమా కంపెనీలు చేసే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్‌లే ఇందుకు కారణమని బీమా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. బీమా పాలసీ కొనుగోలుపై ప్రస్తుతం 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్నారు. అంటే ఏదైనా ఓ బీమా ప్రీమియం ధర రూ.10వేలు అయితే పాలసీ కొనుగోలుదారు 18 శాతం జీఎస్టీ కలుపుకొని రూ.11,800 చెల్లించాలి. పాలసీ కొనుగోలుదారు నుంచి జీఎస్టీ కింద వసూలు చేసిన సొమ్మును బీమా సంస్థలు ప్రభుత్వానికి చెల్లిస్తాయి. దానికంటే ముందు బీమా సంస్థ తాను అప్పటికే ప్రభుత్వానికి చెల్లించిన జీఎస్టీని లెక్కించి మిగిలిన మొత్తాన్ని మాత్రమే చెల్లిస్తుంది. దీనినే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ) క్లెయిమ్ అంటారు. బీమా సంస్థలు సేవా రంగంలోకి వస్తాయి. కార్యాలయాల అద్దె, సాఫ్ట్‌వేర్ లైసెన్సులు, ప్రచారం, మార్కెటింగ్, ఆడిటింగ్ వంటి వాటికి జీఎస్టీని చెల్లిస్తాయి. ఈ మొత్తాన్ని ఐటీసీ కింద క్లెయిమ్ చేసుకుంటాయి. ఇప్పుడు పాలసీ కొనుగోళ్లపై జీఎస్టీని ఎత్తేయడంతో ఐటీసీ భారాన్ని బీమా సంస్థలు పాలసీ కొనుగోలుదారులపై వేసే అవకాశం ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం, బీమా సంస్థల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

జీఎస్టీ భేటీలో హైడ్రామా!

(మొదటిపేజీ తరువాయి)

తెలిసింది. వాస్తవానికి బుధవారం రాత్రి 7 గంటలకే జీఎస్టీ మండలి భేటీ ముగియాల్సి ఉంది. కానీ, బెంగాల్, కేరళ, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. రాత్రి 9.30 గంటల వరకు సమావేశం కొనసాగినట్లు తెలిసింది. వారి అభ్యంతరాలపై కేంద్ర మంత్రి నిర్మల స్పందిస్తూ.. రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. సుదీర్ఘంగా జరిగిన ఈ భేటీలో తొలుత బెంగాల్, పంజాబ్ రాష్ట్రాల మంత్రులు జీఎస్టీ తగ్గింపునకు అంగీకరించినట్లు తెలిసింది. కర్ణాటక, కేరళ మంత్రులు మాత్రం పరిహారం ఇవ్వాల్సిందేనంటూ పట్టుబట్టినట్లు సమాచారం. ఈ అంశంపై చర్చను గురువారానికి వాయిదా వేయాలని కోరినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ ఆర్థిక మంత్రి కల్పించుకొని.. జీఎస్టీ రేట్ల తగ్గింపునకు కర్ణాటక, కేరళ అంగీకరించకపోతే ఓటింగ్‌కు వెళ్దామని ప్రతిపాదించినట్లు సమాచారం. నిర్మల కూడా దానికి అంగీకరించగా.. బెంగాల్ మంత్రి కలగజేసుకొని కర్ణాటక, కేరళ మంత్రులకు నచ్చజెప్పినట్లు తెలిసింది. ఈ తతంగం వల్లే జీఎస్టీ తగ్గింపు ప్రకటన ఆలస్యంగా వెలువడినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

జీఎస్టీ 2.0తో డబుల్ డోస్ అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

స్వాగతించకపోతే దేశాన్ని సరైన దారిలో నడిపించలేమని ప్రధాని అన్నారు. భారత్ ఆత్మనిర్భర్‌గా మారాలంటే నూతన సంస్కరణలు చేపట్టడం అవసరమనే విషయాన్ని తాను ఎర్రకోట పైనుంచి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో చెప్పానని గుర్తు చేశారు. అంతేకాకుండా.. రానున్న దీపావళి, ఛట్ పూజకు ముందు రెండింతల సంతోషాన్ని పంచుతానని దేశ ప్రజలకు హామీ ఇచ్చానని చెప్పారు. కాగా, కాంగ్రెస్ హయాంలో నిత్యావసర వస్తువులపై కూడా భారీగా పన్నులు విధించారని, వాటిని తగ్గించేందుకు తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు.

లబ్ధి వినియోగదారుడికి అందేనా?

- వ్యాపారులు కొర్రీలు పెడతారంటూ ప్రజల్లో అనుమానాలు
- ఈనెల 22 తర్వాత కొత్త జీఎస్టీ శ్లాబుల మేరకే బిల్లులు



హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రముఖ కంపెనీకి చెందిన సిమెంట్ బస్తా ధర రూ.250 ఉండగా 28 శాతం జీఎస్టీ కలుపుకొని రూ.320కు లభిస్తుంది. సిమెంట్‌పై జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో సెప్టెంబరు 22న ఆ బస్తా రూ.295కే లభ్యం కావాలి. కానీ ఆ ధరకు అమ్ముతారా? దుకాణదారులు జీఎస్టీ మార్పులను కచ్చితంగా అమలు చేస్తారా? లేదా కంపెనీ ధర పెంచిందని, పాత సరుకని ఏదో ఓ కారణం చెప్పి మాయ చేస్తారా?.. ఒక్క సిమెంట్ విషయంలోనే కాదు జీఎస్టీ తగ్గిన అన్ని ఉత్పత్తుల విషయంలో సామాన్య ప్రజలకు ప్రస్తుతం ఈ సందేహాలు ఉన్నాయి. ఉత్పత్తి సంస్థలు జీఎస్టీ తగ్గింపు ఫలాలను కొనుగోలుదారులకు అందిస్తాయా? అనే చర్చ జరుగుతోంది. అయితే, జీఎస్టీ నిబంధనల ప్రకారం ఈనెల 22వ తేదీ తర్వాత వస్తువులను తగ్గిన పన్నుల ప్రకారమే విక్రయించాలని జీఎస్టీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే, జీఎస్టీ తగ్గింపు అమలు అనేది వినియోగదారులకు వస్తువులను విక్రయించే సంస్థల నైతికతపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. లాభాలే ధ్యేయంగా పనిచేసే సంస్థలు కొనుగోలుదారులకు ఫలాలు అందించవని, తాము కోల్పోయే ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను ఏదో విధంగా ఆర్జించేందుకు ఎత్తుగడలు వేస్తాయని అంటున్నారు. వ్యాపారులు ఎవరైనా తగ్గించిన పన్ను ప్రకారం అమ్మకాలు చేయకపోతే కొనుగోలుదారులు నేషనల్ యాంటీ ప్రాఫెటీరింగ్ అథారిటీకి ఫిర్యాదు చేయవచ్చని జీఎస్టీ అధికారులు వెల్లడించారు. జీఎస్టీ అమలులోకి వచ్చిన కొత్తల్లోనే ఈ అథారిటీని అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసే సదుపాయం ఉందని, ఈ విధానాన్ని దేశమంతా అమలు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని వివరించారు.

ప్రజలకు ప్రయోజనాలు అందాల్సిందే

తగ్గిన పన్నుల మేర ఆ లాభాలను కొనుగోలుదారులకు అందించాల్సిందే. సామాన్య ప్రజలు నిత్యం ఉపయోగించే టూత్‌పేస్టు, బ్రష్, పౌడర్, సైకిళ్లు, వ్యవసాయ పరికరాలు, ఔషధాలను 5 శాతం పన్ను పరిధిలోకి తీసుకొచ్చారు. ప్రజారోగ్యం దృష్ట్యా కొన్ని రకాల ఔషధాలకు, ఆరోగ్య బీమా పాలసీలకు జీఎస్టీ లేకుండా చేశారు. ఈ ప్రయోజనాలు వినియోగదారులకు అందాలంటే ఉత్పత్తి సంస్థలు, విక్రయదారులు సహకరించాలి. జీఎస్టీ ప్రయోజనాలు అందించని విక్రయదారులపై ప్రజలు ఫిర్యాదులు చెయ్యాలి.

- జీఎస్టీ కమిషనర్, అప్పీల్స్, హైదరాబాద్

మోదీ బ్రహ్మాస్త్రం జీఎస్టీ!


- ప్రతిపక్షాలను ఆత్మరక్షణలోకి నెట్టిన నిర్ణయం
- బిహార్ సహా త్వరలో జరిగే ఎన్నికల్లో బీజేపీకి లబ్ధి
- రాజకీయ విశ్లేషకుల అంచనా



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు ఊరటనిచ్చేలా జీఎస్టీ రేట్లను సవరిస్తూ జీఎస్టీ కౌన్సిల్ చేసిన ప్రకటన ప్రధాని మోదీ వేసిన బ్రహ్మాస్త్రమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కేంద్రంతోపాటు రాష్ట్రాలపై అదనపు భారం పడుతున్నా.. కేంద్రం, ప్రధాని మోదీ రాజకీయంగా లబ్ధి పొందనున్నారని చెబుతున్నారు. దీపావళికి ముందే బిహార్ ఎన్నికల షెడ్యూల్ వెలువడనుండడంతో జీఎస్టీ రేట్ల తగ్గింపు నిర్ణయాన్ని ముందుగానే ప్రకటించారని, దీంతో ప్రతిపక్షాలన్నీ ఒక్కసారిగా ఆత్మరక్షణలో పడ్డాయంటున్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు వల్ల రాష్ట్రాల ఆదాయం తగ్గుతుందని, తమకు నష్టపరిహారం చెల్లించాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు తొలుత నిర్ణయించాయి. కానీ, జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రకటన తర్వాత వెనక్కి తగ్గాయి. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సహా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల నేతలు తొలుత విడుదల చేసిన పత్రికా ప్రకటనలను వెనక్కి తీసుకుని సవరించిన ప్రకటనలను విడుదల చేయడమే ఇందుకు నిదర్శనం. తెలంగాణ మంత్రి భట్టి విక్రమార్కతోపాటు తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నెరసు జీఎస్టీ తగ్గింపును స్వాగతించారు. ఇక, గత బడ్జెట్‌లో ఆదాయ పన్నును తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న తర్వాత జీఎస్టీ రేట్లపై కోత విధించడం కేంద్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన రెండో అతి పెద్ద బహుమతి అని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. రానున్న బిహార్, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో జీఎస్టీ అంశం బీజేపీకి బాగా కలిసొస్తుందని అంచనా వేస్తున్నారు.

ఏసీలు, ఫ్రిజ్‌లు మరింత కూల్..

- 1.5 టన్ ఏసీపై 4 వేల వరకు తగ్గింపు
- 43 అంగుళాల టీవీలపై 2,500 వరకు..
- వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్ల ధరలు 1,500 నుంచి 5000 వరకు తగ్గే చాన్స్



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పండుగ సమయంలో కొత్తగా గృహోపకరణాలు కొనుగోలు చేయాలనుకునేవారికి జీఎస్టీ పన్నుల మార్పు బంపర్ ఆఫర్‌గా మారింది. టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లపై పన్ను 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గుతుండటం లాభం చేకూర్చనుంది. ఉదాహరణకు 43 అంగుళాల ఎల్‌ఈడీ టీవీలపై సుమారు రూ.2,500 నుంచి రూ.4 వరకు, అంతకన్నా పెద్ద టీవీలపై రూ.8 వేల వరకు ప్రయోజనం కలగనుంది. 1.5 టన్నుల సామర్థ్యమున్న ఏసీల ధర సుమారు రూ.5 వేల వరకు తగ్గే వీలుంది. వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్ల ధరలూ రూ.1,500 నుంచి రూ.7 వేల వరకు దిగిరానున్నాయి. ఐదు దశాబ్దాలకు పైనే తాము ఈ వ్యాపారంలో ఉన్నామని, ఎప్పుడూ పన్ను తగ్గింపు రూపంలో ఇంత ప్రయోజనం కలగలేదని హైదరాబాద్‌లో ప్రముఖ ఏసీ కంపెనీలకు డీలర్‌గా వ్యవహరించే సాయిరాం ఎయిర్ కండీషనింగ్ కంపెనీ అధినేత ప్రతీక్ పేర్కొన్నారు.

ఇప్పటికే కొనుగోళ్లు బంద్..

జీఎస్టీ తగ్గింపు ఉంటుందన్న వార్తల నేపథ్యంలో కొన్నిరోజులుగా ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లు బాగా తగ్గిపోయాయని డీలర్లు, షోరూమ్‌ల మేనేజర్లు చెబుతున్నారు. ముఖ్యంగా జీఎస్టీ తగ్గింపు ప్రకటన తర్వాత ఒక్కసారిగా నిలిచిపోయాయని అంటున్నారు. ఇటీవల ఆర్డర్లు ఇచ్చిన వారు కూడా డెలివరీ తీసుకోకుండా రద్దు చేసుకుంటున్నారని చెబుతున్నారు. పండుగ విక్రయాల కోసం తాము పెద్ద ఎత్తున స్టాక్ సిద్ధం చేసుకున్నామని.. మరి వాటిపై చెల్లించిన పన్ను విషయంలో ప్రభుత్వం నుంచి ఊరట కలిగించే నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నామని అంటున్నారు. "సెప్టెంబరు 22 తర్వాత కొనుగోలు చేసే ప్రతి ఎలక్ట్రానిక్ వస్తువుకు తగ్గిన శ్లాబుల మేరకు బిల్ చేయాల్సి ఉంటుంది. వినియోగదారులకు ప్రయోజనం అందుతుంది. వ్యాపారుల విషయంలో ప్రభుత్వం, కంపెనీలు తగిన నిర్ణయం తీసుకుంటాయని ఆశిస్తున్నాం" అని ప్రముఖ బ్రాండ్ షోరూం మేనేజర్ పేర్కొన్నారు.



స్కై వే కేబుల్ కార్ ప్రాజెక్టుకు..
మూడు కంపెనీల నుంచి బిడ్లు

- సెవెన్ టూంబ్స్, గోల్కొండ ప్రాంతంలో.. ఎంపీ అసద్, టూరిజం ఎండీ పర్యటన

నార్సింగ్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో గోల్కొండ కోట-సెవెన్ టూంబ్స్ మధ్య నిర్మించనున్న స్కై వే కేబుల్ కారు ప్రాజెక్టులో కీలక అడుగు పడింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సమర్పించాలంటూ హెచ్ఎండీఏ గతంలో టెండర్ నోటిఫికేషన్ ప్రకటించగా.. మూడు కంపెనీలు ముందుకు వచ్చాయి. సాంకేతిక కమిటీ పరిశీలన అనంతరం ఏజెన్సీ ఎంపిక జరగనుంది. ఇదిలా ఉండగా గురువారం గోల్కొండ కోట, సెవెన్ టూంబ్స్ ప్రాంతాలను ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్, పర్యాటక శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. కేబుల్ కార్ నిర్మాణం ఎలా ఉండాలి..? క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎలా ఉన్నాయి..? ఎప్పటిలోపు పనులు పూర్తవుతాయి..? తదితర అంశాలపై చర్చించారు. ఈ ప్రాంతాలకు మరిన్ని పర్యాటక హంగులు అద్దేందుకు కేబుల్ కార్ ప్రతిపాదనను అసదుద్దీన్ ప్రతిపాదించారు. 2026లో ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కేబుల్ కారు అందుబాటులోకి వస్తే పాత బస్తీ పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందని అసదుద్దీన్ పేర్కొన్నారు.

ఉపాధి కల్ప తరువు అరబ్ గల్ఫ్: మంత్రి వివేక్

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

గల్ఫ్ దేశాలు తెలంగాణకు ఉపాధి కల్ప తరువు అని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. రాష్ట్రం బయట తెలంగాణ వాసులు ఎక్కువ సంఖ్యలో ఉపాధి పొందుతోంది అరబ్ గల్ఫ్ దేశాల్లో మాత్రమేనని చెప్పారు. గురువారం దుబాయ్‌లో ఆయన ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధితో మాట్లాడారు. గల్ఫ్ దేశాల్లోని తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం, తద్వారా ఉపాధి కల్పన అవకాశాలను పెంచడంతో పాటు సంక్షేమానికి సంబంధించి చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. త్వరలో తాను అధికార బృందంతో కలిసి గల్ఫ్ దేశాల పర్యటనకు వస్తానని వెల్లడించారు. అంతకు ముందు, దుబాయ్‌లో కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ ఎస్వీ రెడ్డి నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు వివేక్‌ను కలిసి దుబాయ్, ఇతర గల్ఫ్ దేశాల్లో తెలంగాణ ప్రవాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

తెలంగాణలో కాల్పుల విరమణ ప్రకటించాలి

- మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి
- పూర్వ విప్లవ విద్యార్థి వేదిక ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని కోరుతూ 7,500 మంది సంతకాలతో ప్రభుత్వాన్ని అభ్యర్థించినట్లు పూర్వ విప్లవ విద్యార్థి వేదిక ప్రతినిధులు వెల్లడించారు. అందులో ప్రకాశ్‌రాజ్, వేణు ఉడుగుల, తమ్మారెడ్డి భరద్వాజ, ఉమామహేశ్వరరావు తదితర సినీ ప్రముఖులతో పాటు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ప్రొ.ఘంటా చక్రపాణి, మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, కవి కె. శివారెడ్డి లాంటి సామాజిక, రాజకీయ, సాహిత్య రంగాలకు చెందిన వారెంతోమంది ఉన్నారని తెలిపారు. పూర్వ విప్లవ విద్యార్థి వేదిక సభ్యులు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం కాల్పుల విరమణను అధికారికంగా ప్రకటించాలని కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ప్రముఖ సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్ కోరారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పడవ తయారీ..!

- తుర్కయాంజల్ మున్సిపాలిటీ సిబ్బందిపై ప్రశంసలు



హయత్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి తుర్కయాంజల్ మున్సిపాలిటీ సిబ్బంది పడవను తయారు చేసి ఆశ్చర్యపరిచారు. వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించి, గాలి నింపిన నాలుగు ట్యూబ్‌లు, వెదురు కర్రలను ఉపయోగించి ఈ పర్యావరణ హిత పడవను వారి సృజనాత్మకతకు పదును పెట్టి తయారు చేశారు. తుర్కయాంజల్ మున్సిపాలిటీ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వినయ్‌కుమార్, పర్యావరణ ఇంజనీర్ సురేష్, వార్డు అధికారి బాల్‌రాజ్ తదితరుల బృందం మూడు రోజుల్లో దీనిని రూపొందించింది. ప్రస్తుతం తుర్కయాంజల్ మాసబ్ చెరువులో వినాయకుల నిమజ్జనం కోసం ఈ బోటును వినియోగిస్తున్నారు. ఈ సందర్భంగా తుర్కయాంజల్ మున్సిపాలిటీ కమిషనర్ కె. అమరేందర్‌రెడ్డి ఈ బోటుపైన మాసబ్ చెరువులో విహరించారు. బోటును తయారు చేసిన సిబ్బందిని అభినందించారు.

10న రవీంద్ర భారతిలో..
సంచార జాతుల విముక్తి దినోత్సవం

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం తొలి సారిగా ఈ నెల 10న సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని భావిస్తున్న నేపథ్యంలో ఈ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు సర్కారు సిద్ధమైంది. ప్రధానంగా వెనకబడిన వర్గాల్లో యాచక, సంచార జాతులకు తగిన గుర్తింపునిచ్చేందుకు సర్కారు ప్రణాళికలు రూపొందిస్తోంది. అత్యంత వెనకబడిన కులాలకు సైతం అన్ని వర్గాలతో సమ ప్రాధాన్యం కల్పించడానికి బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఎంబీసీ కార్పొరేషన్ సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని రవీంద్రభారతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు పాల్గొంటారు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో
విజ్ఞాన్స్ యూనివర్సిటీకి 70వ ర్యాంకు


ఆచార్య పి.నాగభూషణ్

గుంటూరు(విద్య), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్ఆర్‌డీ) గురువారం విడుదల చేసిన 2025వ సంవత్సరం ఉన్నతస్థాయి విద్యాసంస్థల ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) ర్యాంకుల్లో విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో 70వ ర్యాంకు లభించిందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో విజ్ఞాన్స్ యూనివర్సిటీకి 70వ ర్యాంకు లభించిందన్నారు. అదే విధంగా ఇంజనీరింగ్ విభాగంలో కూడా 80వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. టీచింగ్ లెర్నింగ్ రిసోర్సెస్, రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్రాడ్యుయేషన్ ఔట్‌కమ్స్, ఔట్‌రీచ్ అండ్ ఇంక్లూజివిటీ, పీఆర్ పర్‌సెప్షన్ కేటగిరీల్లో విజ్ఞాన్స్ యూనివర్సిటీ పనితీరును కేంద్రం పరిశీలించి 100 పాయింట్ల స్కోర్ ప్రామాణికంగా ఈ ర్యాంకులను కేటాయించిందన్నారు. ఎన్ఐఆర్ఎఫ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించడానికి కృషి చేసిన ఐక్యూఏసీ టీంను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు ప్రత్యేకంగా అభినందించారు.

హైదరాబాద్ ఐఐటీకి 7వ స్థానం!

అత్యుత్తమ ఇంజనీరింగ్ విద్యాసంస్థల కేటగిరీలో సత్తా.. 'ఓవరాల్'లో 12వ ర్యాంకు

- రాష్ట్ర ప్రభుత్వ వర్సిటీల విభాగంలో ఓయూకు ఏడో స్థానం
- వర్సిటీల కేటగిరీలో హెచ్‌సీయూకు 18వ ప్లేస్.. జేఎన్‌టీయూహెచ్‌కు 81వ స్థానం
- 'వైద్యం'లో ఉస్మానియాకు 48వ ర్యాంకు
- ఎన్ఐఆర్ఎఫ్-2025 ర్యాంకింగ్స్ వెల్లడి

న్యూఢిల్లీ/హైదరాబాద్ సిటీ/రాజేంద్రనగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అత్యుత్తమ ఇంజనీరింగ్ విద్యాసంస్థల జాబితాలో హైదరాబాద్ ఐఐటీ 7వ స్థానంలో నిలిచి సత్తా చాటింది. అలాగే ఓవరాల్ కేటగిరీలోనూ 12వ ర్యాంకు సాధించింది. అత్యుత్తమ ఇంజనీరింగ్ విద్యాసంస్థల జాబితాలో వరుసగా పదోసారి.. ఓవరాల్ కేటగిరీలో వరుసగా ఏడోసారి ఐఐటీ మద్రాస్ అగ్రస్థానాన్ని దక్కించుకుంది. జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ఆధారంగా రూపొందించిన వివిధ రంగాల్లోని అత్యున్నత విద్యాసంస్థలతో కూడిన నివేదికను 'ఇండియా ర్యాంకింగ్స్ 2025' పేరిట కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ గురువారం విడుదల చేశారు. ఓవరాల్ కేటగిరీలో దేశంలోని టాప్ 100 విద్యాసంస్థల్లో 24 రాష్ట్ర ప్రభుత్వ విశ్వ విద్యాలయాలు, 22 ప్రైవేటు డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, 19 ఐఐటీలు, ఐఐఎస్సీలు, 9 ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, 8 నిట్ సంస్థలు, 5 వైద్య సంస్థలున్నాయి. అత్యుత్తమ ఇంజనీరింగ్ విద్యాసంస్థల జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నిట్ వరంగల్ 28, కేఎల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ 35, ఐఐఐటీ హైదరాబాద్ 38, ఐఐటీ తిరుపతి 57వ స్థానంలో నిలిచింది. ఓవరాల్ కేటగిరీలో తెలుగు రాష్ట్రాల నుంచి హెచ్‌సీయూ 26, ఆంధ్రా యూనివర్సిటీ 41, కేఎల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ 46, ఉస్మానియా యూనివర్సిటీ 53, నిట్ వరంగల్ 63, ఐఐఐటీ హైదరాబాద్ 89వ స్థానాల్లో నిలిచాయి.

రాష్ట్ర ప్రభుత్వ వర్సిటీల విభాగంలో..

రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల విభాగంలో జాదవ్‌పూర్ యూనివర్సిటీ (కోల్‌కతా) మొదటి స్థానంలో నిలవగా, ఆంధ్రా విశ్వవిద్యాలయం(విశాఖపట్నం) 4, ఉస్మానియా విశ్వవిద్యాలయం (హైదరాబాద్) 7వ స్థానంలో ఉంది. విశ్వవిద్యాలయాల విభాగంలో ఐఐఎస్సీ బెంగళూరు తొలి స్థానంలో నిలవగా.. తెలుగు రాష్ట్రాలకు చెందిన హెచ్‌సీయూ 18, ఆంధ్రా యూనివర్సిటీ 23, కేఎల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ 26, ఉస్మానియా యూనివర్సిటీ 30, జేఎన్‌టీయూ (హైదరాబాద్) 81వ స్థానంలో నిలిచాయి. ఇక న్యాయ విద్య విభాగంలో నల్సార్ యూనివర్సిటీ 3, ఫార్మసీలో నైపర్ (హైదరాబాద్) 5, వ్యవసాయ విద్యలో జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 24, వైద్య విద్యలో ఉస్మానియా మెడికల్ కాలేజ్ 48వ ర్యాంకు సాధించింది. మేనేజ్‌మెంట్ విద్యలో ఐఐఎం అహ్మదాబాద్, వైద్య విద్యలో ఎయిమ్స్ ఢిల్లీ, న్యాయవిద్యలో బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ అగ్ర స్థానంలో నిలిచాయి.

రాష్ట్ర ఖజానాకు 10 వేల కోట్ల నష్టం!

ప్రధాన రంగాల్లో తగ్గనున్న జీఎస్టీ రాబడి.. సిమెంటు, ఆటోమొబైల్‌పై 10% పన్ను తగ్గుదల

- గ్రానైట్‌పై తగ్గనున్న 7% ఆదాయం
- పరిహారం చెల్లించాలని సర్కారు డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రం 'వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)'లో తెచ్చిన సంస్కరణలతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి పడనుంది. వివిధ రకాల సరుకులు, సేవలపై పన్ను రేట్లను తగ్గించడం, ఎత్తివేయడం వల్ల రాబడి గణనీయంగా తగ్గనుంది. పన్ను రేట్ల సవరింపుతో రాష్ట్రాలకు రూ.2 లక్షల కోట్ల మేర రాబడి తగ్గుతుందని బీజేపీయేతర రాష్ట్రాల ఆర్థిక మంత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఒక్క తెలంగాణకే రూ.7 వేల కోట్ల నష్టం వాటిల్లనుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. కానీ, ఈ నష్టం రూ.10 వేల కోట్లకు పైగా ఉంటుందని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఎక్కువ విక్రయాలు జరిగే సిమెంటు, ఆటోమొబైల్, ఔషధాలు, ఎలక్ట్రానిక్ వస్తువులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించింది. జీవిత, ఆరోగ్య బీమా సేవలపై జీఎస్టీని పూర్తిగా ఎత్తివేసింది. చాలా రకాల నిత్యావసరాలపై పన్నును తొలగించింది. నిజానికి ఇవి రాష్ట్రానికి అత్యధిక రాబడిని సమకూరుస్తున్నాయి. వీటిపై విధించే జీఎస్టీ సొమ్ములో సగం కేంద్రానికి, సగం రాష్ట్రానికి దక్కుతుంది. ఉదాహరణకు సిమెంటుపై రాష్ట్ర రాబడి దారుణంగా తగ్గే అవకాశాలున్నాయి. తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పెద్ద రాబడి మార్గం. భవన నిర్మాణ రంగంలో నెలకు 1.5-2 మిలియన్ టన్నులకు పైగా సిమెంటును వినియోగిస్తున్నట్లు అంచనా. బ్రాండును బట్టి ఒక్కో సిమెంటు బ్యాగు ధర రూ.350కి పైగా పలుకుతోంది. ఈ సిమెంటు విక్రయాలపై ప్రభుత్వం ఇదివరకు 28 శాతం జీఎస్టీని విధించేది. ఇప్పుడు దాన్ని 18 శాతం శ్లాబులో చేర్చింది. అంటే మొత్తం సిమెంటు విక్రయాలపై 10 శాతం మేర పన్ను రాబడి తగ్గిపోనుంది.

- రాష్ట్రంలో గ్రానైట్ పరిశ్రమ కూడా పెద్దదే. గ్రానైట్‌పై 12 శాతం ఉన్న జీఎస్టీ 5 శాతానికి తగ్గనుంది. దీని ద్వారా వచ్చే రాబడిలో 7 శాతం మేర తగ్గనుంది. వ్యక్తిగత, జీవిత బీమాలపై ఇదివరకున్న 18 శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించారు. దీని ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన 18 శాతం రాబడి పూర్తిగా పోనుంది.
- ఆటోమొబైల్ రంగం రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గణనీయంగా ఊతమిస్తోంది. ఈ రంగంలోని కార్లు, త్రిచక్ర వాహనాలపై జీఎస్టీ తగ్గడంతో రాబడికి గండి పడనుంది. రాష్ట్రంలో ఏటా వివిధ రకాల వాహనాలు దాదాపు 10 లక్షలకు పైగా అమ్ముడవుతున్నాయి. వీటిపై 10% మేర జీఎస్టీ తగ్గనుండడంతో రాబడిపై ప్రభావం చూపనుంది.
- రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ ఉపకరణాల మార్కెట్ కూడా పెద్దదే. ముఖ్యంగా ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషీన్లు బాగా అమ్ముడవుతుంటాయి. వీటిపై జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నారు. ఇక్కడా 10 శాతం మేర రాబడి తగ్గుతుంది.
- నిత్యావసర వస్తువుల (ఎఫ్ఎంసీజీ) మార్కెట్ కూడా రాష్ట్రానికి పెద్ద రాబడి మార్గం. ఈ విభాగంలోని చాలా వస్తువులను 5% శ్లాబులో చేర్చారు. కొన్నింటిపై జీఎస్టీ పూర్తిగా ఎత్తివేశారు. ఇలా అన్ని రకాలుగా రాష్ట్ర రాబడి రూ.10 వేల కోట్లకు పైగా తగ్గుతుందని చెబుతున్నారు

పరిహారం ఇవ్వండి..

పన్ను శ్లాబుల సవరింపుతో కోల్పోతున్న రాబడిని పూడ్చడానికి పరిహారం చెల్లించాలని రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. కొత్తగా ఏర్పడిన తెలంగాణకు తప్పకుండా పరిహారం చెల్లించాలని ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి.. జీఎస్టీ మండలికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి(జీఎస్‌డీపీ)లో జీఎస్టీ వాటా 2022-23లో 3.07 శాతం ఉండగా.. 2024-25లో అది 2.58 శాతానికి పడిపోయిందని రాష్ట్ర ప్రభుత్వం వివరిస్తోంది. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణతో ఇది మరింత తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. జీఎస్టీ తగ్గింపు కారణంగా నష్టపోయే రాబడిని పరిహారం రూపంలో పూడ్చాలని డిమాండ్ చేస్తోంది.

రాష్ట్ర ప్రజలకు గవర్నర్, సీఎం
మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు!




హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త జన్మదినం 'ఈద్ మిలాద్ ఉన్ నబీ' సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి గురువారం వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త బోధనలు కరుణ, సహనం, సామరస్యం, సార్వత్రిక సోదర భావంతో మానవాళిని శాంతి, సమష్టి శ్రేయస్సు వైపు నడిపిస్తాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. తోటి వారి పట్ల విశ్వాసం, దయ, నమ్మకంతో సేవ చేసినప్పుడు ప్రవక్త మహ్మద్ సందేశాన్ని పాటించిన వారమవుతామన్నారు. నిజమైన స్ఫూర్తితో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. సకల మానవాళికి ఆయన బోధనలు సదా ఆచరణీయమని పేర్కొన్నారు.

ఆర్అండ్‌బీ ఈఎన్సీగా మోహన్ నాయక్



హైదరాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ)గా జే.మోహన్ నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మోహన్‌నాయక్ ప్రస్తుతం శాఖలో రహదారుల విభాగం చీఫ్ ఇంజినీర్(సీఈ)తో పాటు, రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ఆయనకు పదోన్నతి కల్పించడంతో పాటు ఈఎన్సీగా నియమించింది. అయితే ఆర్ అండ్ బీలో సర్వీస్ రూల్స్ అంశం తేలకపోవడంతో శాఖలోని అన్ని స్థాయిలు ఇంచార్జి పోస్టులతోనే కొనసాగుతున్నాయి. ఈ కారణంగానే మోహన్ నాయక్‌ను కూడా ఇంచార్జి 'ఇంజినీర్ ఇన్ చీఫ్'గానే ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. శాఖలో ప్రస్తుతం ఇంచార్జి ఈఎన్సీగా జయభారతి కొనసాగుతుండగా మోహన్‌నాయక్ కూడా ఈఎన్సీగా రావడంతో ఒకటి, రెండ్రోజుల్లో వీరిద్దరికీ శాఖలు ఖరారు కానున్నాయి.

ఉక్రెయిన్‌లో శాంతి కోసమే
భారత్‌పై సుంకాలు!

టారిఫ్‌లు విధించకుంటే అమెరికా పేద దేశమే

సుప్రీం కోర్టును ఆశ్రయించిన ట్రంప్ సర్కారు

వాషింగ్టన్, సెప్టెంబరు 4: ప్రపంచ దేశాలపై విధిస్తున్న సుంకాలు చట్ట విరుద్ధమంటూ ఫెడరల్ కోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో.. దాన్ని సవాల్ చేస్తూ ట్రంప్ పరిపాలన విభాగం తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఉక్రెయిన్‌లో శాంతికి భారత్‌పై విధించిన సుంకాలను లింక్ చేస్తూ పిటిషన్ వేసింది. ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పేందుకు చేస్తున్న తమ ప్రయత్నంలో సుంకాలు కీలకమని పేర్కొంది. 'ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధానికి సంబంధించి ముందుగా ఉన్న జాతీయ అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు.. దెబ్బతిన్న ఆ దేశంలో శాంతిని నెలకొల్పడమే కీలకం. రష్యా ఇంధన ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నందుకే భారత్‌పై అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) సుంకాలను విధించేందుకు అధ్యక్షుడు ఇటీవల ఆమోదం తెలిపారు' అని వివరించింది. సుంకాలతో అమెరికా ధనిక దేశంగా ఉంటుందని.. లేదంటే పేద దేశంగా మారుతుందని వెల్లడించింది.

ఇరు దేశాల సంబంధాలకు దెబ్బే..

భారత్‌పై అమెరికా ఏకపక్ష సుంకాల కారణంగా ఇరు దేశాల మధ్య సంబంధాలకు ముప్పు వాటిల్లుతుందని యూఎస్ ప్రతినిధుల సభ సభ్యుడు గ్రెగొరీ మీక్స్ అన్నారు. 'అమెరికా-భారత్ భాగస్వామ్యానికి ఎప్పుడూ చట్ట సభ మద్దతు ఉంటుంది' అని చెప్పారు. 'ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పడమే మన ఆశయం అయినప్పటికీ ఏకపక్ష సుంకాల కారణంగా నిబద్ధత గల దేశాల మధ్య కీలక సంబంధాలు దెబ్బతినకుండా చూసుకోవాలని ట్రంప్‌ను మరోసారి హెచ్చరిస్తున్నాను' అని 'ఎక్స్'లో మీక్స్ పేర్కొన్నారు.

ఓటరు జాబితాలో
చేర్పునకు సోనియా ఫోర్జరీ

- దర్యాప్తు చేయించండి.. ఢిల్లీ కోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే ఓటరుగా నమోదయినందుకు సోనియాగాంధీపై కేసు పెట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలయింది. వికాస్ త్రిపాఠీ అనే వ్యక్తి అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు వైభవ్ చౌరాసియా కోర్టులో మంగళవారం పిటిషన్‌ను సమర్పించారు. కొన్ని పత్రాల ప్రకారం ఆమెకు 1983 ఏప్రిల్ 30న భారత పౌరసత్వం వచ్చిందని తెలిపారు. అయితే న్యూఢిల్లీ నియోజకవర్గం ఓటరు జాబితాలో 1980లో ఆమె పేరు నమోదయిందని చెప్పారు. 1982లో ఆ పేరును తొలగించారని, తిరిగి 1983లో నమోదు చేశారని వివరించారు. 1980లో ఆమె పేరును నమోదు చేశారంటే ఆ సమయంలో ఫోర్జరీ జరిగి ఉంటుందని ఆరోపించారు. ఆ సమయంలో ఎలాంటి ధ్రువపత్రాలు సమర్పించారో తెలుసుకోవాలని విన్నవించారు. మొత్తం వ్యవహారంపై దర్యాప్తు జరిపించాలని కోరారు.

ఎరువుల దుకాణంపై రాళ్ల దాడి

(మొదటిపేజీ తరువాయి)


మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కూపన్ల కోసం బారులు తీరిన రైతులు

ఇటుకలు, రాళ్లతో షాపుపై దాడి చేశారు. దుకాణం ముందు కర్రలు వేసి నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. కొంతమంది రైతులు మన గ్రోమోర్ గోదాం తాళాలు పగులగొట్టి యూరియా బస్తాలను తీసుకువెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం షాపు యాజమానితో మాట్లాడి రైతులను క్యూలైన్‌లో నిలబెట్టి అందులో ఉన్న 180 బస్తాల యూరియాను రైతులకు అందించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో రైతులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వెంటనే యూరియా ఇవ్వాలంటూ నినాదాలతో హోరెత్తించారు. ఒక దశలో క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. దీంతో పోలీసులు, రైతులకు మధ్య తోపులాట జరిగింది. యూరియా పంపిణీ చేయాలని కోరుతూ జగిత్యాల జిల్లా గొల్లపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లిలో రాస్తారోకోలు నిర్వహించారు. గంటల కొద్దీ క్యూలో నిల్చున్నా యూరియా ఇవ్వడం లేదంటూ కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంబర్‌పేటలో రైతులు వ్యవసాయ అధికారి మణిదీపికను దిగ్బంధించారు. భద్రాద్రి జిల్లా ఇల్లెందు వ్యవసాయ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో రైతులు ఆందోళనకు దిగారు. పది రోజులుగా తిరుగుతున్నా ఒక్క యూరియా బస్తా కూడా దొరకడంలేదంటూ మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై భారీ సంఖ్యలో రైతులు రాస్తారోకో నిర్వహించగా.. ఇద్దరు రైతులు పురుగు మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా ధర్మారావుపేటలో వందలాది మంది రైతులు పంపిణీ కేంద్రానికి ఎగబడడంతో తోపులాట జరిగి.. పలువురు మహిళా రైతులు స్పృహ తప్పి పడిపోయారు.

యూరియా పంపిణీకి సిరా గుర్తు !

నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలం తీలేర్ సింగిల్‌విండో వద్ద యూరియా కోసం రైతులు భారీ సంఖ్యలో పోటెత్తడంతో అధికారులు.. ఎన్నికల మాదిరిగా రైతుల వేళ్లకు సిరా గుర్తు వేసి.. టోకెట్లు ఇచ్చారు. అనంతరం వరుసగా యూరియా పంపిణీ చేశారు. గంటల కొద్దీ క్యూలో నిలబడిన స్పృహ తప్పి పడిపోయిన తీలేర్‌కు చెందిన రైతు మణెమ్మను ఆస్పత్రికి తరలించిన అనంతరం.. అధికారులు ఈ విధానాన్ని అమలు చేశారు.

600 బస్తాల యూరియాతో లారీని పట్టుకున్న పోలీసులు

దొడ్డిదారిన 600 బస్తాల యూరియాను తరలిస్తున్న లారీని వికారాబాద్ జిల్లా పరిగిలో పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాదారంలోని పవన్‌ప్లైవుడ్ కంపెనీకి సంబంధించినదని, అయితే అది పరిశ్రమలకు ఉపయోగించే యూరియా అని కంపెనీ యాజమాన్యం చెప్పడంతో వ్యవసాయాధికారులకు లేఖ రాశామని పోలీసులు తెలిపారు.

'గే' యాప్ 'గ్రైండర్' ద్వారా డ్రగ్స్ విక్రయం

- ఇద్దరు విక్రేతలతో పాటు కొంటున్న ఏడుగురి అరెస్టు
- రూ.15 లక్షల విలువైన 100 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం
- నిందితులంతా స్వలింగ సంపర్కులు.. ప్రత్యేక గుర్తులతో డ్రగ్స్ సమాచారం

అంబర్‌పేట/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్వలింగ సంపర్కులు, ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా ఉన్న గ్రైండర్ అనే యాప్ ద్వారా డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరితో పాటు కొంటున్న మరో ఏడుగురిని ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, చిలకలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.15 లక్షల విలువైన 100 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. నిందితులందరూ స్వలింగ సంపర్కులు (గేలు) కావడం విశేషం. ప్రధాన నిందితుడు హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుడు. ఈస్ట్ జోన్ డీసీపీ బీ బాలస్వామి వివరాలు వెల్లడించారు. కర్నూలు జిల్లాకు చెందిన ఒక వ్యక్తి హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ చిలకలగూడ సమీపంలో ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. అతనికి 2000లో వివాహం జరగ్గా.. రెండేళ్ల తర్వాత విడాకులు పొందాడు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. స్వలింగ సంపర్కుడిగా ఇందిరా పార్కు, సంజీవయ్య పార్కు, పరేడ్ గ్రౌండ్స్ వద్ద బస్టాప్‌లలో ఉంటూ విటులను ఆకట్టుకునేవాడు. దీంతో అతనికి హెచ్ఐవీ పాజిటివ్ సోకడంతో చికిత్స పొందుతున్నాడు. అతనితో పాటు మీర్‌పేటలో నివాసం ఉండే మరో వ్యక్తి డ్రగ్స్ కేసులో జైలుకెళ్లి 4 నెలల క్రితం బయటకొచ్చారు. వీరు గ్రైండర్ యాప్‌లో చేరి 'గే'ను ఆకట్టుకుంటున్నారు. గ్రైండర్ యాప్ గురించి తక్కువమందికి తెలియడం, నిఘా లేకపోవడాన్ని అవకాశంగా మలుచుకున్నారు. ఇతర సభ్యులతో చాటింగ్ సమయంలో డ్రగ్స్ ప్రస్తావన తెచ్చి, డ్రగ్స్ వాడే వారిని గుర్తిస్తున్నారు. డ్రగ్స్ అందుబాటులో ఉన్నదీ లేనిదీ తెలిపేందుకు ప్రత్యేక గుర్తులు వాడుతున్నారు. ప్రధాన నిందితుడు బెంగళూరులో ఉండే ఓ నైజీరియా దేశస్థుడిని నుంచి ఒక గ్రాము ఎండీఎంఏ 10 వేలకు కొని రూ.15 వేలకు అమ్ముతున్నాడు. డ్రగ్స్ కొంటున్న ఏడుగురిలో ఒక డాక్టర్ కూడా ఉన్నాడు.

ఇక్ఫాయి కళాశాల వద్ద
గంజాయి కలకలం

- 8 మంది విద్యార్థుల అరెస్టు
- 300 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం

శంకర్‌పల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ ఫైనాన్షియల్ ఎనలిస్ట్స్ ఆఫ్ ఇండియా (ఇక్ఫాయి) కళాశాల సమీపంలో విద్యార్థులు గంజాయి తాగుతుండడం కలకలం రేపింది. ఎనిమిది మంది విద్యార్థులను రాజేంద్రనగర్ ఎస్వోటీ, మోకిల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 300 గ్రాముల గంజాయిని, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ అని తేలింది. వారితోపాటు హాస్టల్‌లో పనిచేసే ప్రొద్దుటూరుకు చెందిన రవి గైక్వాడ్‌కు కూడా పాజిటివ్ వచ్చింది. విద్యార్థులను లోతుగా దర్యాప్తు చేయగా మహారాజ్‌పేట్‌కు చెందిన అంబూరి వంశీ (ర్యాపిడో డ్రైవర్) తమకు గంజాయి సరఫరా చేస్తాడని వారు తెలిపారు. కొంపల్లికి చెందిన మరో గంజాయి సరఫరాదారుడు వర్షిత్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. విద్యార్థులతో పాటు మహారాజ్‌పేట్, ప్రొద్దుటూరుకు చెందిన ఇద్దరు యువకులపై ఎన్‌డీపీఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు మోకిల సీఐ వీరబాబు తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.